ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

గుంటూరు

: fb.com/vaartha Digital

Published from Guntur, Ongole, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

25-6-2026 గురువారం సంపుటి: 32 సంచిక: 145 పేజీలు: 12 వెల: 6.50

**భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం** 9లో

**నిర్మాణంలోని గోడౌన్ కూలి 8 మంది మృతి**

## జొన్నగిరి ఇక స్వర్ణగిరి

### 'బంగారు' చరిత్రకు మళ్లీ ప్రాణంపోసిన సిఎం చంద్రబాబు

- రూ. 405 కోట్ల గోల్డ్‌మైన్స్ ప్రాజెక్టును ప్రారంభించిన సిఎం
- దేశంలోనే తొలి ప్రైవేటు బంగారు గని
- తొలియేడాదే 400 కిలోల బంగారం ఉత్పత్తి



బుధవారం జొన్నగిరి బహిరంగ సభలో ప్రసంగిస్తున్న సిఎం చంద్రబాబు

**తుగ్గలి,జూన్ 24,ప్రభాతవార్త:** రాయలసీమ నేలలో శతాబ్దాలుగా దాగి ఉన్న బంగారు చరిత్రకు మళ్లీ ప్రాణం పోసే ఘట్టానికి తుగ్గలి మండలం జొన్నగిరి వేదికగా నిలిచింది. ఒకప్పుడు విజయనగర సామ్రాజ్య కాలం నుంచి బంగారు నిల్వలకు ప్రసిద్ధి చెందిన ఈప్రాంతం కాలగర్భంలో తన వైభవాన్ని కోల్పోయినా.. నేడు మళ్లి స్వర్ణగిరిగా పునర్జన్మ పొందిందని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. జియో మైసూర్ సర్వీసెస్ లిమిటెడ్ డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థల ఆధ్వర్యంలో రూ.405 కోట్ల వ్యవయంతో నిర్మించిన జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాజెక్టును సి.ఎం.చంద్రబాబు నాయుడు, స్థానిక ఎమ్మెల్యే కెఇ శ్యామ్‌కుమార్‌తో పాటు జియో మైసూర్ ప్రాజెక్టు మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకరన్, డెక్కన్ గోల్డ్ మైన్స్ సంస్థల డైరెక్టర్ కార్తికేయన్‌తో కలిసి ప్రారంభించారు. ముందుగా సి.ఎం.చంద్రబాబు గోల్డ్ మైనింగ్ ప్రాంతాన్ని పరిశీలించారు. మొదటి యూనిట్‌ను ప్రారంభోత్సవం చేసి రెండవ యూనిట్‌ను శంకుస్థాపన చేసి ప్రారంభించారు.

అనంతరం గనుల నుంచి వెలికి తీసిన బంగారాన్ని సిఎం పరిశీలించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సంధర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సి.ఎం.చంద్రబాబు మాట్లాడుతూ భారతదేశంలోని తొలి ప్రైవేట్ బంగారు గని జియో మైసూర్ జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టు అని అన్నారు. జొన్నగిరి పేరు ఇకపై దేశవ్యాప్తంగా స్వర్ణగిరిగా గుర్తింపు పొందనుంది అన్నారు. చరిత్రను >>2

## 12 మంది కేంద్ర మంత్రులకు ఉద్వాసన?



- ధర్మేంద్ర ప్రధాన్‌ను తొలగించే అవకాశం
- ఇద్దరు సీనియర్లకు గవర్నర్ పదవులు
- రేపోమాపో విస్తరణ!

**న్యూఢిల్లీ,జూన్ 24:** ప్రధాని మోడీ 4.0 టార్గెట్‌గా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వం పార్టీలో కీలక మార్పులకు సిద్ధం అయ్యారు. కేంద్ర కేబినెట్ ప్రక్షాళనకు ముహూర్తం ఫిక్స్ అయింది. ఎన్డీఏ భాగస్వామ్య పక్షాలతో పాటుగా ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. 12 మంది మంత్రుల తొలగింపు దాదాపు ఖరారైంది. ఇద్దరుసీనియర్లకు గవర్నర్ పదవులు ఇవ్వనున్నారు. ఇప్పటికే రాష్ట్రపతిని కలిసిన ప్రధాని కేంద్ర కేబినెట్ ప్రక్షాళనపైన సమాచారం ఇచ్చినట్లు తెలుస్తోంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణపై కసరత్తు వేగవంతం అయింది. మంగళవారం సాయంత్రం ప్రధాని మోడీ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకుని కీలక సమాలోచనలుజరిపారు. మరోవైపు ఇద్దరు కేంద్ర మంత్రుల రాజ్యసభ పదవీకాలం ముగిసినా వారిని తిరిగి ఎంపికచేయలేదు. వీరిలో ఒకరు బుధవారం మంత్రి పదవికి రాజీనామా చేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఈ నెల 26 లేదా 27న ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. కేంద్ర క్యాబినెట్ భేటీలో పార్లమెంట్ సమావేశాలపై నిర్ణయం తీసుకునే అవకాశాలున్నాయి. కేరళకు చెందిన కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జార్జి కురియన్ బుధవారం తన మంత్రి పదవికి రాజీనామా చేశారు. రాజ్యసభ పదవీకాలం ఈ నెల 21న ముగిసింది. ఆయనను కేంద్రం తిరిగి నామినేట్ చేయలేదు. మరోవైపు రైల్వే శాఖ సహాయ మంత్రి రవనీత్ >>2

## నెల్లూరు జైలుకు సిఐ నాగరాజు

- 14 రోజుల రిమాండ్
- సాయికృష్ణది లాకప్ డెత్ అనడానికి ఆధారాలు : సిట్

**విజయవాడ,జూన్24,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపిలో సంచలనం సృష్టించిన గాదె సాయికృష్ణ లాకప్‌డెత్ కేసులో సిఐ నాగరాజుకు 14 రోజుల రిమాండ్‌ను విజయవాడ జ్యూడిషియల్ కోర్టు విధించింది. ఆయనను అదుపులోకి తీసుకుని సిట్ విచారించింది. అతనిపై అభియోగాలకు ఆధారాలుండటంతో అధికారికంగా అరెస్ట్ ప్రకటించారు. అతన్ని న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచేందుకు పోలీసులు >>2



బుధవారం నాగరాజును జైలుకు తరలిస్తున్న పోలీసులు

## రాజధానిలో ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల పర్యటన

**విజయవాడ,జూన్ 24,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల బృందం ప్రజా రాజధాని అమరావతి అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించింది. ప్రపంచ బ్యాంకు దక్షిణాసియా ఉపాధ్యక్షుడు జోహన్నెస్ జుట్, లీడ్ ట్రాన్స్‌పోర్ట్ స్పెషలిస్ట్ అండ్ టీటీఎల్ (అమరావతి ఇంటిగ్రేటెడ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ (ఎఐయూడిపి) గెరాల్డ్ పాల్ ఒలివర్, ఎడ్యుకేషన్ స్పెషలిస్ట్ సౌమ్య బజాజ్ లతో కూడిన బృందం అమరావతిలో >>2

## లారీని ఢీకొన్న ఆటో



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ఆటో

- పెళ్లి బృందంలోని నలుగురు దుర్మరణం, ఏడుగురికి తీవ్ర గాయాలు
- పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం 2లో



*Applicable T&C available at your nearest dealership. Ex-showroom price ₹13 99 900 for Grand Vitara Aspirion Edition, exclusively available in the Zeta (O) and Alpha (O) variants. Creative visualisation. Images used are for illustration purposes only. Features and accessories shown may not be part of the standard fitment. Black glass shade on the vehicle is due to lighting effect. Offers may vary and are subject to availability of stock. Maruti Suzuki India Limited reserves the right to discontinue an offer without further notice. Finance options available at the sole discretion of financier.

# తుంగభద్ర కొత్తగేట్లు నేడు ప్రారంభం

## హాజరుకానున్న ముగ్గురు సిఎంలు చంద్రబాబు, రేవంత్, డికె శివకుమార్



**అనంతపురం, జూన్ 24, (ప్రభాత వార్త బ్యూరో):** ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ ఉమ్మడి ప్రాజెక్టు తుంగభద్ర జలాశయం నూతన గేట్లను గురువారం లాంఛనంగా ప్రారంభించేందుకు సర్వం సిద్ధమైంది. తక్కువ కాలంలోనే అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో యేళ్ల పాత గేట్ల స్థానంలో కొత్త గేట్లను అమర్చిన చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించేందుకు ముగ్గురు రాష్ట్ర ముఖ్యమంత్రులు హాజరవుతుండడం ప్రాధాన్యత సంతరించుకుంది. దక్షిణ భారత దేశంలోనే అత్యంత కీలకమైన అంతర్రాష్ట్ర సాగునీటి ప్రాజెక్టు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల జీవనాడి అయిన తుంగభద్ర జలాశయం (టిబి డ్యామ్) సరికొత్త రికార్డుకు వేదిక కాబోతోంది. డ్యామ్‌కు కొత్తగా అమర్చిన 33 క్రస్ట్ గేట్లను (స్ప్లివే గేట్లు) ఈ నెల 25న మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సంయుక్తంగా ప్రారంభించనున్నారు. ఈ అరుదైన చారిత్రక ఘట్టానికి కర్ణాటకలోని కొప్పల్ జిల్లా మునిరాబాద్ (డ్యామ్ పరిసర ప్రాంతం) సర్వం సిద్ధమైంది. ఈ నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలతో పాటు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సిఆర్ పాటిల్ హాజరవుతున్నారు. ఈ ప్రారంభోత్సవం కార్యక్రమం అనంతరం హుసపేటలో భారీ బహిరంగ సభ కూడా జరగనుంది. ఇందుకు టిబి డ్యాం అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. గతేడాది ఆగస్టు 2024 తేదీన వచ్చిన భారీ వరదలకు డ్యామ్‌కు చెందిన 19వ నంబర్ క్రస్ట్ గేట్ చైన్ తెగి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఏపి ప్రభుత్వ చొరవతో, ప్రముఖ నీటిపారుదల నిపుణుడు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో యుద్ధప్రాతిపదికన తాత్కాలికంగా 'స్టాప్‌లాక్' గేటును ఏర్పాటు చేసి దాదాపు 80 టిఎంసిల నీరు వృధా కాకుండా కాపాడారు. ఆ తర్వాత నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ సిఫార్సుల మేరకు.. 73 ఏళ్ల నాటి పాత గేట్ల స్థానంలో అన్ని గేట్లను మార్చాలని నిర్ణయించారు. రూ. 51 కోట్ల వ్యయంతో కేవలం 6 నెలల స్వల్ప వ్యవధిలోనే మొత్తం 33 క్రస్ట్ గేట్లను చైన్ లింక్ వ్యవస్థను విజయవంతంగా పునరుద్ధరించి ఇంజనీర్లు సరికొత్త రికార్డు సృష్టించారు. తుంగభద్ర డ్యామ్ భద్రత అనేది ఏపి లోని రాయలసీమకు అత్యంత కీలకం. అనంతపురం జిల్లాకు హెచ్ఎల్సీ ద్వారా, కర్నూలు జిల్లాకు ఎల్ఎల్సీ ద్వారా తుంగభద్ర జలాశయం నుంచి నీరు తాగునీటికి ,సాగునీటికి అందుతుంది. మంచినీరు పథకాలు ఎన్నో ఈ నీరు ఆధారంగా పనిచేస్తాయి. టిబి డామ్ నూతన గేట్ల ఏర్పాటుతో రాబోయే 55 నుండి 60 ఏళ్ల పాటు డ్యామ్ భద్రతకు ఎటువంటి ధోకా ఉండదని, వరదల సమయంలో నీటి నిర్వహణ మరింత సులభతరం అవుతుందని అధికారులు, నీటిపారుదల నిపుణులు చెబుతున్నారు.మూడు రాష్ట్రాల మధ్య నీటి పంపకాల సమన్వయానికి ఈ ఉమ్మడి వేదిక ఒక మంచి పరిణామంగా నిలవనుంది అని చెప్పవచ్చు.. ఈ కార్యక్రమానికి ముగ్గురు రాష్ట్ర ముఖ్యమంత్రి లు హాజరవుతున్న నేపథ్యంలో అనంతపురం, బళ్లారి జిల్లాలకు ఎంతో ఉపయోగపడే సమాంతర కాలవ విషయం చర్చిస్తే బాగుంటుంది. తుంగభద్ర జలాశయం పై భాగంలో భారీ వర్షాలు వచ్చి డ్యాం నిండిన తర్వాత వృధాగా వెళ్లే వరద నీటిని వినియోగించుకునేందుకు సమాంతర కాలువ అనే ప్రతిపాదన దశాబ్దాల కాలంగా పెండింగ్‌లో ఉంది.. సమాంతర కాలవకు భూసేకరణ చేయడం ఇబ్బందిగా ఉంటుందని కొందరు వాదిస్తున్నప్పటికీ వెలుగుబడిన రాయలసీమ జిల్లాలు, కర్ణాటకలోని బళ్లారి, తదితర జిల్లాల కోసం వరద నీటిని ఉపయోగించుకునేందుకు సమాంతర కాలవ ప్రతిపాదనపై ముగ్గురు ముఖ్యమంత్రిలు సమంత అధికారులతో కలిసి ప్రాథమిక చర్చలు జరపాలని, ఈ విషయంలో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని రాయలసీమ జిల్లాల రైతులు ఆశిస్తున్నారు.



బుధవారం విజయనగరంలో గోవా గవర్నర్ అశోక్ గజపతిరాజును కలిసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

# గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజును కలిసిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్

**విజయనగరం, జూన్ 24 ప్రభాతవార్త:** గోవా గవర్నర్ పూసపాటి అశోక్ గజపతి రాజును విజయనగరం గవర్నర్ బంగ్లాలో బుధవారం సాయంత్రం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. 15 నిమిషాల పాటు సమకాలీన రాజకీయాలపై చర్చించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో పాటు విజయనగరం జిల్లా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రులకు ఉద్వాసన?

>> సింగ్ రాజ్యసభ పదవీకాలం కూడా ఈ నెల 21నే ముగియగా ఆమెను కూడా రాజ్యసభకు తిరిగి ఎంపిక చేయలేదు.ఇక కేంద్ర రవాణా, రహదారులు, కార్పొరేట్ వ్యవహారాల సహాయ మంత్రి హర్ష మల్హోత్రాను గత నెలలో ఢిల్లీ బిజెపి అధ్యక్షుడిగా నియమించారు. కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరికి చాలా కాలం క్రితమే ఉత్తరప్రదేశ్ రాష్ట్ర బిజెపి బాధ్యతలు అప్పగించారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో మంత్రివర్గంలో మరికొందరికి ఉద్వాసన తప్పదని, చాలా మంది కొత్తవారికి అవకాశాలు కల్పిస్తారని చర్చ జరుగుతోంది.

నీట్ పరీక్షలో ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను సైతం తప్పించనున్నారు. ఆప్ నుంచి బిజెపిలో చేరిన రాఘవ్ చద్దాతో పాటుగా బీహార్ మాజీ సిఎం నితీశ్ కేబినెట్‌లో చేరనున్నారు. పంజాబ్‌లో ఉన్న బిజెపి చీఫ్ నితీన్ నబీన్ హుటా హుటిన ఢిల్లీ చేరుకున్నారు. మిత్రపక్షాలకు ఈ సారి ప్రాధాన్యత పెరిగేలా మార్పులు ఉంటాయని చెబుతున్నారు. దీంతో ఈ రోజు కేంద్ర కేబినెట్ తరువాత కేబినెట్ ప్రక్షాళన పైన పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

# నెల్లూరు జైలుకు సిఐ నాగరాజు

>> కోర్టుకు తరలించారు. కోర్టుకు తరలించడానికి ముందు విజయవాడ మాజీ సిఐ నాగరాజుకు వైద్య పరీక్షలు చేశారు. వైద్య పరీక్షల అనంతరం నాగరాజును పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. కోర్టు అతన్ని రాజమహేంద్రవరం జైలుకు తరలించాలని ఆదేశించింది.అయితే ఆ జైలులో అదనంగా రిమాండ్ ఖైదీని ఉంచడానికి తగిన అవకాశాలు లేనందున నెల్లూరు జైలుకు తరలింపునకు పోలీసు విజ్ఞప్తి మేరకు కోర్టు ఆదేశించింది. ఆయనను నెల్లూరు జైలుకు తరలించారు. ఇక కోర్టుకు సిట్ సమర్పించిన నాగరాజు రిమాండ్ రిపోర్ట్‌లో సాయికృష్ణను కస్టోడియల్ డెత్ చేసినట్టు భావిస్తున్నామని స్పష్టం చేసింది. సాయి కృష్ణ శవాన్ని మాయం చేసినట్టు గుర్తించామని తెలిపింది. ఈ నెల 2 కంటే ముందే సాయి కృష్ణ మరణించాడని భావిస్తున్నామని పేర్కొంది. సాయి కృష్ణ మృతికి సంబంధించిన అన్ని ఆధారాలు నాగరాజు ధ్వంసం చేశారు. సైంటిఫిక్ ఎవిడెన్స్‌ను చెరిపి వేయటంతో సాయి కృష్ణ చనిపోయాడని గుర్తించామని సిట్ తెలిపింది. కస్టడిలో ఉండగానే సాయి కృష్ణ మరణించాడనే దానికి ఆధారాలు ఉన్నాయని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు..సిఐ కోర్టు ను కూడా తప్పుదోవ పట్టించారని సిట్ స్పష్టం చేసింది.,సాయికృష్ణది లాకప్‌డెత్ అనే విషయాన్ని దాచేందుకు సాయికృష్ణ శవాన్ని మాయం చేసినట్లు సిట్ తన నివేదికలో పేర్కొంది. శవాన్ని పూడ్చిపెట్టడమో, తగులబెట్టడమో చేసేందుకు యత్నించినట్లు స్పష్టం చేసింది. సాయికృష్ణ శవం ఇంకా లభించలేదన్న సిట్ ఏం చేశారనే దానిపై దర్యాప్తు చేయాల్సి ఉందని తెలిపింది. ఇది చాలా సంక్లిష్టమైన కేసు అని దర్యాప్తునకు మరింత సమయం అవసరమని రిమాండ్ రిపోర్టులో సిట్ స్పష్టం చేసింది.సిఐ నాగరాజు దర్యాప్తునకు సహకరించడం లేదని తెలిపింది.

తప్పుడు సమాధానాలతో దర్యాప్తును నాగరాజు పక్కదారి పట్టిస్తున్నట్లు పేర్కొంది. సాయికృష్ణను మే 6న మార్కాపురంలో పట్టుకుని కృష్ణలంకకు తీసుకొచ్చినట్లు సిట్ తెలిపింది. చట్టవిరుద్ధంగా సాయికృష్ణను పోలీస్ కస్టడీలో ఉంచినట్లు స్పష్టం చేసింది. కస్టడీకి అప్పగించిన తర్వాత సాయికృష్ణ ఆచూకీ తెలియలేదని వెల్లడించింది. సిసి ఫుటేజీలను ఉద్దేశపూర్వకంగా డిలీట్ చేసినట్లు సిట్ స్పష్టం చేసింది. గత నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ మధ్య సాయికృష్ణను పిఎస్‌లో చూసినట్లు ఎస్ఐ చెప్పారంది. సాయికృష్ణపై పాత కేసులు, నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. సాయికృష్ణ పిఎస్‌లో అపస్మారక స్థితిలో ఉండటం చూశానని తల్లి తెలిపిందని స్పష్టం చేసింది. మే1 నుంచి జూన్ 1 వరకు కృష్ణలంక పిఎస్‌లో సీసీటీవీ ఫుటేజీ లభించలేదని రిపోర్టులో సిట్ పేర్కొంది.

పిఎస్‌కు వచ్చాక సాయికృష్ణ తన సెల్‌ఫోన్‌ను నాగరాజుకు అప్పగించారంది. సాయికృష్ణను సిఐ నాగరాజు మేజిస్ట్రేట్ ముందు ప్రవేశపెట్టలేదని వివరించింది. సాయికృష్ణ తీవ్రగాయాలతో లాకప్‌లో ఉండటం తల్లి చూసిందని సిట్ తెలిపింది. సిఐ నాగరాజు హైకోర్టుకు తప్పుడు సమాచారం ఇచ్చారంది. సాయికృష్ణ తమ కస్టడీలో ఉన్నాడనే విషయం నాగరాజు దాచిపెట్టారని సిట్ పేర్కొంది. నాగరాజు కావాలనే ఆధారాలను నాశనం చేశాడని స్పష్టమైందని సిట్ వెల్లడించింది. ఈ కేసులో మరి కొందరు పోలీసు సిబ్బందిని అరెస్ట్ చేసే అవకాశం ఉందని సమాచారం.

# ప్రపంచ బ్యాంకు ప్రతినిధుల పర్యటన

>> పర్యటించింది.ప్రపంచ బ్యాంకు బృందం తొలుత ఏపీసీఆర్‌డీఏ ప్రాజెక్టు కార్యాలయాన్ని సందర్శించింది. అమరావతి సమగ్ర పట్టణాభివృద్ధి ప్రాజెక్టు కింద చేపడుతున్న పనుల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంది. ప్రపంచ బ్యాంకు ప్రతినిధులు అమరావతిలో చేపడుతున్న ట్రంక్ రోడ్ల నిర్మాణం, గ్రావిటీ కెనాల్ అభివృద్ధి, ఇతర కీలక మౌలిక సదుపాయాల పనులను పరిశీలించారు. సంబంధిత అధికారులు ఆయా సైట్ల వద్ద పనుల పురోగతిని ప్రపంచ బ్యాంకు బృందానికి వివరించారు.అనంతరం ప్రపంచ బ్యాంకు బృందం ఎస్ఆర్ఎమ్ యూనివర్సిటీని సందర్శించింది. ఏపీసీఆర్‌డీఏ సోషల్ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో.. యూనివర్సిటీలో ఉచితంగా నిర్వహిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ కార్యక్రమాలను పరిశీలించింది. శిక్షణలో చేరిన అభ్యర్థులతో అమరావతిలో లభించే ఉపాధి అవకాశాలపై ప్రపంచ బ్యాంకు బృందం పరస్పర చర్చ నిర్వహించింది.

# లారీని ఢీకొన్న ఆటో

## పెళ్లి బృందంలోని నలుగురు దుర్మరణం, ఏడుగురికి తీవ్ర గాయాలు

**పాకాల, జూన్ 24 ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా పాకాల మండలం పరిధిలోని పూతలపట్టు – నాయుడుపేట జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. గాదంకి గ్రామం వద్ద గల ఫారెస్ట్ చెక్ పోస్ట్ ముందు జరిగిన ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు వ్యక్తులు దుర్మరణం పాలవ్వగా, ఆటో డ్రైవర్‌తో సహా మరో ఏడు మంది తీవ్రంగా గాయపడ్డారు. బెంగళూరు నుంచి ప్లైవుడ్ లోడుతో శ్రీకాళహస్తి సమీపంలోని చింపేడు గ్రామంలో గల కట్టెల ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ డ్రైవర్ షేక్ బాజీ బాబా (47 సూర్యాపేట, తెలంగాణ), బుధవారం మధ్యాహ్నం 1 గంటల ప్రాంతంలో ఎలాంటి ఇండికేటర్లు వేయకుండా జాతీయ రహదారిపై ఒక్కసారిగా సడన్ బ్రేక్ వేసి లారీని నిలిపివేశాడు. అదే సమయంలో యాదమర్రి మండలం పెరుమాలపల్లి గ్రామం నుంచి తిరుపతిలో జరుగుతున్న తమ బంధువుల వివాహ వేడుకకు వెళ్లేందుకు ప్రయాణికులతో వస్తున్న ఆటో లారీ సడన్‌గా ఆగడంతో అదుపుతప్పి వెనుక వైపు నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న చిత్తూరు జిల్లా తవణంపల్లి మండలం ఏనుగుంటపల్లి గ్రామానికి చెందిన యనమల మాధవి (40), ఆమె కుమార్తె మేఘన (15) అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మిగిలిన ప్రయాణికులను, ఆటో డ్రైవర్‌ను స్థానికులు వెంటనే అంబులెన్స్ ద్వారా తిరుపతిలోని రుయా ఆసుపత్రికి తరలించారు. రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇద్దరు మరణించారు, యాదమర్రి మండలం పెరుమలపల్లి గ్రామానికి చెందిన పులకింటి రాజశేఖర్ (25), పులకింటి బేబీ (50) అనే వారి పరిస్థితి విషమించి కన్నుమూశారు. దీంతో ఈ ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య నాలుగుకి చేరింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పులకింటి నవీన్ (14), కొమ్ము విష్ణు (19), ఎనుమల సూరి (17), పులకింటి చిన్నబ్బ (50), పులకింటి రఘు (55), చాముండేశ్వరి (30)లతో పాటు ఆటో డ్రైవర్ పులకింటి సుబ్రమణ్యం (50) ప్రస్తుతం రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, ఎలాంటి ముందస్తు హెచ్చరిక సూచికలు (ఇండికేటర్లు) లేకుండా వాహనాన్ని రోడ్డుపై సడన్‌గా ఆపడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాద ఘటనపై మృతుల, బాధితుల బంధువుల నుంచి ఫిర్యాదు తీసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

# మంగళగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్న డిప్యూటీ సిఎం పవన్

**విజయవాడ జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ దర్శించుకున్నారు. బుధవారం ఉదయం ఆలయానికి చేరుకుని స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పానకాన్ని నైవేద్యంగా సమర్పించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలుత ఆలయం వద్దకు చేరుకున్న పవన్‌కు దేవాదాయశాఖ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు.

# సివిల్ సర్వీసు రూల్స్‌లో సవరణలు

## 1991 జీఓలో మార్పులు చేస్తూ ఉత్తర్వులు

**విజయవాడ జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ సవిల్ సర్వీసెస్ రూల్స్‌లో సంస్కరణలు చేశారు. అందుకు అనుగుణంగా గెజిట్ వెలువడింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 309 నిబంధన ద్వారా ఇవ్వబడిన అధికారాలను మరియు దీనికి వీలు కల్పించే అన్ని ఇతర అధికారాలను వినియోగించుకుంటూ ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఆంధ్రప్రదేశ్ సివిల్ సర్వీసెస్ నియమాలు 1991కు జి.ఓ.ఎంఎస్. నెం.487, జనరల్ అడ్మినిస్ట్రేషన్ డిపార్ట్మెంట్, 1992 సెప్టెంబర్ 14న జారీ చేయబడింది. మరియు జులై 1, 1992 తేదీ నాటి ఆంధ్రప్రదేశ్ గెజిట్ యొక్క పార్ట్-1, నెం.235 అసాధారణ సంచికలో ప్రచురించబడింది. తరువాత కాలానుగుణంగా సవరించబడింది. నిబంధనకు మొదటి మరియు రెండవ నిబంధనల కోసం పేర్కొన్న నియమాలలోని నియమం 9లో, దుర్వినియోగం, లంచం, ద్వివి వాహం, అవినీతి, నైతిక అశాంతి, నకిలీ పత్రాలు మహిళలు అణకువను అవమానించడం వంటి నిరూపితమైన అన్ని కేసులలో సేవ నుండి తొలగింపు శిక్ష విధించబడుతుంది.

# ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం జులై 10కి వాయిదా: మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రత్యర్థి(గొడ్డలి) పార్టీ తప్పుడు ప్రచారాలను, కువిమర్శలను సమర్ధవంతంగా తిప్పికొట్టాలని తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పిలుపు ఇచ్చారు. నేతలు, గత ప్రభుత్వంలో బూతు మంత్రులు కృష్ణా జిల్లా పరువు ఎలా తీశారో, ప్రస్తుతం విషప్రచారాలు ఎలా చేస్తున్నారో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత కేడర్‌పై ఉందని నారా లోకేష్ కార్యకర్తలకు విజ్ఞప్తిచేశారు. మోపిదేవిలో నిర్వహించిన టిడిపి కార్యకర్తల సమావేశంలో లోకేష్ మాట్లాడుతూ మహనీయులు జన్మించిన ఈ జిల్లాలో గత ప్రభుత్వంలో బూతుల మంత్రి ఉండే వారు, ఒకడు కార్యకర్తలను ఇబ్బంది పెట్టేవాడు. మరొకడు భువనేశ్వరమ్మను అవమానించేవాడు. నేను ఆనాడేచెప్పా, వారి పేర్లు ఎర్ర బుక్కులో రాస్తున్నాని. వారివిషయంలో ఎవరికీ ఎటువంటి అనుమానాలు అవసరం లేదు, రెడ్ బుక్ తన పని తాను చేస్తుందని అన్నారు.

**జులై 10నుంచి ఇంటింటికీ ప్రచారం:**

ఇంటింటికీ ప్రచార కార్యక్రమాన్ని జులై 10వ తేదీ నుంచి ప్రారంభిస్తాం. సర్ ప్రక్రియ కొనసాగుతున్నందున ఈ కార్యక్రమాన్ని వాయిదా వేశాం. సర్ ప్రక్రియపై అలసత్వం వద్దు, ప్రతిఓటు విలువైనది. అవనిగడ్డలో కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి, యుద్ధప్రాతిపదికన పూర్తిచేయండి. కొన్ని విషయాల్లో అధికారులు దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు నా దృష్టికివచ్చింది, 24గంటల్లో సరిచేయాలని ఆదేశించాం. దొంగ కేసులను సహించబోను. మంత్రి, జోనల్ కోఆర్డినేటర్‌తో మాట్లాడాను. కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత నాపై ఉంది. త్వరలో నియోజకవర్గానికి అందరికీ ఆమోదయోగ్యమైన ఇన్‌చార్జిని వేస్తామని చెప్పారు.

# సమాజంలో మార్పు తెచ్చేందుకే విద్యాశాఖను ఎంచుకున్నా!: మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** సమాజంలోమార్పు తెచ్చేందుకే నేను అత్యంత కఠినమైన విద్యాశాఖను ఎంచుకున్నాను. దీనిని నేను ఛాలెంజ్‌గా స్వీకరించాను. విద్యావ్యవస్థలో మార్పు తేవడం ఉపాధ్యాయుల సహకారంతోనే సాధ్యమవుతుంది. దేశంలోనే ఆదర్శవంతంగా ఏపి మోడల్ ఎడ్యుకేషన్ తీసుకురావాలన్నది నా ధ్యేయం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, అధికారుల సమష్టి కృషితోనే ఇది సాధ్యమవుతుందని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలం కొక్కిలిగడ్డలో పి4 పథకంలో భాగంగా దాతల సహకారంతో రూ.1.4 కోట్లతో నూతనంగా నిర్మించిన జెడ్పీ హైస్కూలు నూతన భవనాలను మంత్రి లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా లోకేష్ కొక్కిలిగడ్డ హైస్కూలు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ గత రెండేళ్లలో విద్యా వ్యవస్థలో సంస్కరణలన్నీ పూర్తి చేశాం, ఇక ఉపాధ్యాయులంతా పూర్తిగా ఫలితాలపైనే శ్రద్ధ వహించాలని సూచించారు.

# జొన్నగిరి ఇక స్వర్ణగిరి

>> తిరగ రాస్తున్న స్వర్ణగిరి జొన్నగిరి ప్రాంతానికి బంగారంతో అనుభంధం కొత్తది కాదని సిఎం గుర్తు చేశారు. శతాబ్దాల క్రితమే ఈ ప్రాంతంలో బంగారు ఆనవాలు ఉన్నాయని, పురాతన కాలం నుంచి ఈ నేల ఖనిజ సంపదకు నిలయంగా నిలిచిందన్నారు. అయితే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పెట్టుబడులు, పరిశ్రమల సహకారంతో ఇప్పుడు ఆ చరిత్రను మల్లి వెలికి తీసే సమయం వచ్చిందన్నారు. ఒకప్పుడు దేశంలో బంగారు గనులు అంటే కర్ణాటకలోని కెజిఎఫ్ గురుకు వచ్చేది. ఇప్పుడు భారతదేశంలోనే బంగారు ఉత్పత్తి ఎక్కడ జరుగుతుందంటే జొన్నగిరి అంటే మన స్వర్ణగిరి పేరు వినిపించాలి అని సిఎం ఆకాక్షించారు. బంగారు మాత్రమే కాదు....భవిషత్తును వెలికితీసే ప్రాజెక్టు రూ.405 కోట్ల పెట్టుబడితో 1500 ఎకరాలలో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టు ద్వారా తొలి యేడాది 400 కిలోలు, రెండవ ఏడాది 900 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్టు ఆయన తెలిపారు. భవిషత్తులో 50 వేల కిలోల వరకు బంగారం ఉత్పత్తి చేసే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఇది కేవలం గనుల ప్రాజెక్టు మాత్రమే కాదని రాయలసీమ ఆర్థిక కొలంబనకు బలమైన పునాది అని సిఎం వివరించారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టులో 800 మందికి ఉపాధి లభించగా, రానున్న కాలంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా మరో 5 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు సిఎం వెల్లడించారు. ఒకప్పుడు రాయలసీమ గురించి మాట్లాడప్పుడు గతంలో కరువు, వలసలు, వెనుకబాటుతనం ప్రాస్థావనకు వచ్చేదని ఇకపై పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు, బంగారు గనులు చర్చకు వస్తాయని సి.ఎం.అన్నారు. స్వర్ణగిరి ప్రాజెక్టు ఆ మార్పుకు ప్రతీకగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. స్వర్ణగిరి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పేల జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రాజెక్టు రాష్ట్రానికే కాకుండా దేశానికి గర్వకారణంగా మారిందని సిఎం తెలిపారు. ప్రపంచ స్థాయి ప్రమాణాలతో గనుల నిర్వాహణ జరగాలని, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తునే ఉత్పత్తి పెంచాలని ఆయన సూచించారు. స్వర్ణగిరి పేరు ప్రపంచవ్యాప్తంగా వినిపించాలి. ఈ ప్రాంత యువతకు ఉపాధి, రాష్ట్రానికి అదాయం, దేశానికి బంగారం అంధించే కేంద్రంగా ఇది ఎదగాలి అని సిఎం పిలుపు నిచ్చారు. జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంతో రాయలసీమ చరిత్రలో మరో కీలక ఆధ్యాయం ఆరంభమైందని అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ఒకప్పుడు మట్టిలో దాగిన సంపదగా ఉన్న బంగారం ఇప్పుడు అభివృద్ధి, ఉపాధి, ఆర్థిక ప్రగతికి ప్రతీకగా మారబోతొంది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాటల్లో చెప్పాలంటే, జొన్నగిరి కాదు.. స్వర్ణగిరి అనే నినాదం ఇకపై ఈ ప్రాంత భవిషత్తుకు గుర్తింపుగా నిలువనుందని పేర్కొన్నారు. అనంతరం సి.ఎం.చంద్రబాబు జ్యులరీషాపు యజమానులకు జియో మైసూర్ సర్వీసు ప్రైవేట్ లిమిటెడ్ ఎం.డి.ప్రభాకరన్ చేతుల మీదుగా బంగారు బిస్కెట్లను అందజేశారు. అలాగే సిఎంకు జియో మైసూరు సర్వీసు కంపెనీ యాజామాన్యం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చిత్రపటంతోకూడిన బంగారు చిత్రపటాన్ని సిఎంకు బహుకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు, పరిశ్రమల శాఖా మంత్రి టిజి భరత్, మైనింగ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపి బస్తిపాటి నాగరాజు, కోడుమూరు ఎమ్మెల్యే దస్తగిరి, ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి, ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి, ఎమ్మెల్సీ బీటి నాయుడు, జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, ముఖేషకుమార్ మీనా, జియో మైసూరు ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం జనరల్ మేనేజర్ బాలాజి, రాజేష్, పలువరు టిడిపి నాయకులు పాల్గొన్నారు.



వెలికితీసిన బంగారాన్ని పరిశీలిస్తున్న సిఎం చంద్రబాబు

## వారం - వర్జ్యం

25-06-2026, గురువారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
నిజ జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, శుక్లపక్షం, ఆరుద్ర కార్తె
ఏకాదశి రా.8.11, స్వాతి సా.4.31
వర్జ్యం : రా.10.45-రా.12.32
దు.ఉ.9.58-ఉ.10.50, 2) మ.3.13-సా.4.05
శుభసమయం : ఉ.8.00-9.00
రాహుకాలం - మ.1.30-3.00

## వార్తాఫలం

**మేషం:** బంధువుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. సేవా కార్యక్రమాలలో లాభాలు పొందుతారు. శుభవార్తలు అందుకుంటారు.

**వృషభం:** ఉన్నత పదవులలో ఉన్నవారితో పరిచయాలు ఏర్పడతాయి. స్పెకులేషన్స్ లాభిస్తుంది. ఋణాలు తీరుస్తారు.

**మిథునం:** ఎక్కువ అనుకూల వాతావరణం నెలకొని ఉండటం ఆనందానికి కారణం అవుతుంది. ఆస్తి వివాదాలు తీరుతాయి.

**కర్కాటకం:** నూతన కాంట్రాక్టులు కైవసం చేసుకుంటారు. అనుకున్న పనులు దిగ్విజయంగా నెరవేరుస్తారు.

**సింహం:** దూరపు ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ది పొందుతారు. వాహన సౌఖ్యం.

**కన్య** :శ్రమకు ఓర్చి మీ వంతు సహాయం అందిస్తారు. ఇంటియందు జరిగే శుభకార్యాలలో స్వల్ప విభేదాలు తలెత్తే సూచన.

**తుల:** సంతాన ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవలసి వస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలు సాఫీగా పూర్తి చేస్తారు.

**వృశ్చికం:** ఊహించని రీతిలో అవకాశాలు దగ్గరకు వస్తాయి. సద్వినియోగం చేసుకోండి. స్థలాలు కొనుగోలు చేస్తారు.

**ధనుస్సు:** ఎవరినీ లెక్కచేయక మీ పనిని సక్రమంగా నిర్వహించి వృత్తిలో లాభపడతారు. మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది.

**మకరం:** వ్యవహారాలలో తొందరపాటు వద్దు. ఈ రోజు పాతమిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. వాహనసౌఖ్యం.

**కుంభం:** విదేశీయానానికి చేసే ప్రయత్నాలు అనూహ్యంగా ముందడగు వేస్తాయి. వాతావరణాన్ని అనుకూలంగా మలచుకుంటారు.

**మీనం:** సాంప్రదాయాలకు విలువనిచ్చి పాతకాలపు మనిషిగా ముద్రపడతారు. మధ్యవర్తిగా పేరు గడిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మత్స్యకార కుటుంబాలను ఆదుకొంటాం

## పులిగడ్డలో వారి కష్టసుఖాలను తెలుసుకొన్న మంత్రి లోకేష్



పులిగడ్డ పల్లె వేణిపాయలో మత్స్యకారులతో కలిసి వల విసురుతున్న మంత్రి లోకేష్

**విజయవాడ,జూన్ 24, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మత్స్యకార కుటుంబాలకు ప్రజాప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ భరోసా ఇచ్చారు. బుధవారం కృష్ణా జిల్లా పర్యటనలో భాగంగా అవనిగడ్డ మండలం పులిగడ్డ పల్లెపాలెంలోని మత్స్యకార కుటుంబాలతో నారా లోకేష్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పులిగడ్డ పల్లెపాలెంలోని నాయుడు వెంకటేశ్వరరావు, ఆయన సతీమణి మోనిక, సింగోతు సుధీర్, సతీమణి శివపార్వతితో పాటు ఎస్.నరసింహస్వామి, కే.మశేన్ రావులతో మాట్లాడారు.

**వల విసిరి చేపల వేట..**

పులిగడ్డలోని మత్స్యకార కుటుంబాలతో కలిసి వేణిపాయలో మంత్రి నారా లోకేష్ స్వయంగా పడవలోప్రయాణించారు. మత్స్యకారుల జీవనస్థితిగతులను మంత్రి ప్రత్యక్షంగా పరిశీలించారు. బోట్ల తయారీ, వినియోగం, చేపల వేట, అమ్మకం, ఆదాయం, కుటుంబ స్థితిగతులు, సమస్యలు తెలుసుకున్నారు. చేపలవేటనిషేధ సమయంలో ప్రజాప్రభుత్వం అందిస్తున్న మత్స్యకార భరోసాపైనా మంత్రి ఆరా తీశారు.

**పడవ కొనుగోలుకు రూ.2.50 లక్షలు..**

చిన్న పడవల కొనుగోలుకు ఒక్కో పడవకు రూ.2.50 లక్షలు, పెద్ద పడవకు రూ.7.50 లక్షల వరకు వ్యయం అవుతుందని మత్స్యకారులు మంత్రికి వివరించారు. ఇక్కడపెద్ద బోట్లు నడవవని, చిన్న బోట్లను మాత్రమే వినియోగిస్తామని తెలిపారు. నెల్లూరులో బోట్లు తయారీ ఉందని వివరించారు. ఉదయం 2 నుంచి 3 గంటల సమయంలో చేపల వేటకు బయలుదేరి 9 గంటలకు తిరిగివస్తామని తెలిపారు. వలల్లో 15 రకాలు ఉంటాయని, వలలో పడిన చేపలను స్థానిక కంపెనీలకు విక్రయిస్తామన్నారు. కుటుంబానికి నెలకు రూ.20వేల వరకు సంపాదన ఉంటుందని, గ్రామంలో 300 మంది వరకు మత్స్యకారులు ఉన్నారని చెప్పారు. తమ గ్రామంలో ప్రస్తుతం రిజిస్టరైన చిన్నబోట్లు 60,, పెద్దబోట్లు 15 వరకు ఉన్నాయని వివరించారు.

25-6Pg3fG_25-6Pg3fG.qxd 24/Jun/26 11:05 PM Page 1



# నేషనల్ రేర్ డిసీజెస్ పాలసీ అమలుకు పటిష్ట చర్యలు: మంత్రి సత్యకుమార్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిలో "నేషనల్ రేర్ డిసీజెస్ పాలసీ" సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రభుత్వం పటిష్ఠ చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఆర్థిక స్థోమత లేకపోయినా, వ్యాధి అరుదైనదైనా ప్రతి రోగికీ వైద్యం అందాలన్నదే ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. అరుదైన వ్యాధులను ముందే గుర్తించేందుకు రాష్ట్రంలో 'యూనివర్సల్ నియోనాటల్ స్క్రీనింగ్' ప్రారంభించినట్లు తెలిపారు. ప్రత్యేక వైద్యం, పరిశోధనల కోసం ఎపిలో మూడు 'సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్' కేంద్రాలను గుర్తించామని, విశాఖ, విజయవాడ (ఎస్ఎంసి), తిరుపతిలో సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరిశోధనల కోసం పిఎస్‌యు, సిఎస్ఆర్ నిధుల వినియోగంపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని డిఎంఇ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కేంద్ర జాబితాలో లేని 'హంటింగ్‌టన్స్ వ్యాధి'పై కూడా ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. పాలసీ అమలులో కేరళ వంటి రాష్ట్రాల ఉత్తమ పద్ధతులను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. బాధితుల ఆర్థిక భరోసా కోసం ప్రత్యేక నిధుల ఏర్పాటు అంశాన్ని సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# 'స్పైడర్'లో సైకో విలన్‌గా జగన్ ప్రవర్తన

## ● మదనపల్లెలో ఫైళ్ల దగ్ధం కేసులో సిఐడి దర్యాప్తు ముగిసింది: మంత్రి అనగాని విమర్శలు



**తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** అభివృద్ధిలో దూసుకెళుతున్న రాష్ట్రంలో ఏ ఇద్దరు నేతలు కలిసి ఉన్నా వైసిపి నేత జగన్ భరించలేకపోతున్నారని రాష్ట్రమంత్రి, తిరుపతి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ ఘాటైన విమర్శలు చేశారు. కులాలు, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడమే గొడ్డలి పార్టీ లక్ష్యమని మండిపడ్డారు. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయం ఫైళ్ల దగ్ధం కేసులో సిఐడి దర్యాప్తు పూర్తి కావచ్చిందని వెల్లడించారు. జగన్ ప్రవర్తన చూస్తుంటే మహేశ్ బాబు స్పైడర్ సినిమాలో సమాజంలో ఇబ్బందులు చూసి ఆనందించే సైకో విలన్‌లాగా అనిపిస్తోందని అన్నారు. ప్రభుత్వ భూములను, రికార్డులను మాయం చేసేందుకు అప్పట్లో జరిగిన ఈ భారీ కుట్రకు కారకులైన పెద్దల ముసుగులు త్వరలోనే తొలగిపోతాయని, బాధ్యులపై అత్యంత కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో త్వరలోనే అత్యంత పారదర్శకంగా భూముల రీ సర్వే 2.0 ప్రారంభించబోతున్నట్లు మంత్రి అనగాని ప్రకటించారు. వివాదాల్లో ఉన్న ప్రతి భూమిని న్యాయపరంగా పరిష్కరించి రైతులకు భరోసా ఇస్తామన్నారు. ఏడాది కిందట జరిగిన దామినేడు భూ వ్యవహారాన్ని వైసీపీ నేతలు ఇప్పుడు ఉద్దేశపూర్వకంగానే తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. తిరుపతిలో కూటమి నిర్వహించిన బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడంతో ఓర్వలేక తనపై, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, అక్కడ భూములు కొనుగోలు చేసిన వ్యక్తికి తమకు ఎలాంటి సంబంధం లేదని మంత్రి తేల్చిచెప్పారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై ఇప్పటికే లీగల్ కేసులు పెట్టామని అన్నారు. బుధవారం తిరుచానూరులో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. 2029 నాటికి కాదు కదా 2049 నాటికి కూడా గొడ్డల పార్టీ అధికారంలోకి రాదని సంచలన వ్యాఖ్యలు చేశారు. మాకు మరో మూడేళ్లు అధికారం ఉందన్న విషయం గొడ్డల పార్టీ నేతలు గుర్తుంచుకోవాలని మంత్రి గుర్తుచేశారు. చట్ట ప్రకారం మాత్రమే వెళ్లాలన్న సిఎం చంద్రబాబు వైఖరి కారణంగానే గొడ్డలి పార్టీ నేతలు బతికి పోతున్నారని అనగాని ఘాటుగా స్పందించారు.

# తిరుమల సమాచారం




## భోగశ్రీనివాసుడికి ప్రత్యేక సహస్రకలశాభిషేకం

**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలోని పంచబేరాలలో ఒకటైన భోగశ్రీనివాసమూర్తిని పల్లవరాణి సామవై ప్రతిష్ఠించిన రోజు గుర్తుగా బుధవారం ఉదయం ఆలయంలో భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్రకళశాభిషేకం నిర్వహించారు. ఆలయం లోపల గరుడాళ్వార్ సన్నిధిలో శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాసమూర్తిని, విశ్వక్సేనులను కొలువుదీర్చారు. శ్రీనివాసమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో అభిముఖంగా కౌతుకమూర్తి భోగశ్రీనివాసమూర్తిని, ఆయనకు అభిముఖంగా విశ్వక్సేనుల వారిని ఉంచారు. అనంతరం మూలమూర్తిని భోగశ్రీనివాస మూర్తికి కలుపుతూ దారంకట్టి అనుసంధానం చేశారు. భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే అభిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది. అనంతరం వేదపండితులు వేదపారాయణం చేయగా, అర్చకులు ప్రత్యేక సహస్రకళశాభిషేకం వైభవంగా జరిపించారు. ఆర్జితసేవలన్నీ యధావిధిగా జరిగాయి. ఈ కార్యక్రమంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి దంపతులు, జెఇఒ డాక్టర్ ఎ.శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు వేణుగోపాల్ దీక్షితులు, డిప్యూటీ ఇఒ లోకనాథం, పేష్కార్ రామకృష్ణ, పారుపత్తేదార్ హిమత్‌గిరి, ఏవిఎస్ఒ రాజశేఖర్ పాల్గొన్నారు.

## పద్మసరోవరంలో నేటి నుండి పద్మావతి అమ్మవారి తెప్పోత్సవాలు

**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలోని తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో వార్షిక తెప్పోత్సవాలు నేటి నుండి 29వ తేదీ వరకు ఐదు రోజులపాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటల నుండి రాత్రి 7.30 గంటల వరకు పద్మసరోవరంలో సుందరంగా అలంకరించిన తెప్పలపై విహరిస్తూ పద్మావతి అమ్మ భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు. తొలిరోజు గురువారం సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత కృష్ణస్వామి తెప్పోత్సవంలో మూడు ప్రదక్షిణలు పవిత్ర పుష్కరిణిలో జరుగుతుంది. 26న సుందరరాజస్వామి తెప్పోత్సవంలో మూడు ప్రదక్షిణలు, మూడవరోజు 27 నుండి 29 వరకు పద్మావతి అమ్మవారి తెప్పోత్సవం నిర్వహిస్తారు. 27న మూడు ప్రదక్షిణలు, 28న ఐదు ప్రదక్షిణలు చివరగా 29న ఏడు ప్రదక్షిణలు జరుగుతాయి. 27, 28, 29 తేదీలలో పద్మసరోవరంలోని నీరాడ మండపంలో మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 4.30 గంటల వరకు అమ్మవారికి తిరుమంజనం ఘనంగా నిర్వహించనున్నారు. జూన్ 28వ తేదీ రాత్రి 8.30 గంటలకు గజవాహన సేవ, జూన్ 29వ తేదీ రాత్రి 8.30 గంటలకు గరుడవాహన సేవ వైభవోపేతంగా జరుగనున్నాయి. తెప్పోత్సవం అనంతరం ప్రతిరోజూ ఆలయ మాడవీధుల్లో అమ్మవారి ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహించనున్నారు. తెప్పోత్సవాల సందర్భంగా ఐదు రోజుల పాటు నిర్వహించే కల్యాణోత్సవం, ఊంజల్‌సేవలను, జూన్ 26న




# 'మన మిత్ర'తో కాసుల వర్షం

## ● వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆలయాలకు రూ.22.26 కోట్ల రాబడి ● మే నెలలోనే రూ.12.91 కోట్ల ఆదాయం ● దర్శనం, సేవల టికెట్ల ద్వారానే 10.69 కోట్లు ● 30శాతం టికెట్లను మనమిత్ర ద్వారానే బుక్ చేసుకుంటున్న భక్తులు ● ఆలయాల వద్ద మనమిత్ర కోసం ప్రత్యేక సేవా కేంద్రాలు ● మనమిత్రకు పెరుగుతున్న ఆదరణ

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రజలకు ఎలాంటి అంతరాయాలు లేకుండా కేవలం వారి మొబైల్ ఫోనులోని వాట్సాప్ ద్వారానే అన్ని సేవలు అందించాలన్న సదాశయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ఇప్పుడు రాష్ట్రంలోని ప్రధాన ఆలయాలకు కాసుల వర్షం కురిపిస్తోంది. తిరుమల శ్రీవారి ఆలయం మినహా రాష్ట్రంలోని దేవాదాయశాఖ పరిధిలో ఉన్న 21 ప్రధాన ఆలయాలకు మనమిత్ర ద్వారా దర్శనం, సేవల టికెట్ల బుకింగ్ చేసుకునే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ఈ ఆలయాలకు మనమిత్ర ద్వారా ఇప్పటి వరకు రూ.22.26 కోట్ల ఆదాయం సమకూరింది. ఇందులోనూ గత మే 11వ తేదీ నుంచి జూన్ 11వ తేదీ వరకు నెల రోజుల వ్యవధిలోనే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఈ ఆలయాలకు రూ.12.91 కోట్ల ఆదాయం సమకూరింది. ఆలయాల్లో దర్శన టికెట్లు, ఆర్జిత సేవా టికెట్లు, తలనీలాల సమర్పణ, ఈ హుండీ ద్వారా కానుకలు సమర్పించడం ద్వారా ఆలయాలకు ఈ ఆదాయం సమకూరింది.

**ఆరు ఆలయాలకు అధిక ఆదాయం:** ఈ 21 ఆలయాల్లో ఆరు ప్రధాన ఆలయాలకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అధిక ఆదాయం సమకూరింది. శ్రీకాళహస్తిలోని శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆయలానికి భక్తులు మనమిత్ర ద్వారా బుక్ చేసుకున్న దర్శనం, సేవలు, తలనీలాలు, ఈహుండీ కానుకల రూపేణా నెల రోజుల్లో రూ.3.39 కోట్ల మేర ఆదాయం సమకూరింది. అన్నవరం శ్రీవీర వెంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం ఆలయానికి రూ.2 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. శ్రీశైలం శ్రీ భ్రమరాంభ మల్లిఖార్జున స్వామి దేవస్థానానికి రూ.1.77కోట్లు, ద్వారకా తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంకు రూ.1.54 కోట్లు, విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివారి దేవస్థానానికి 1.53 కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. వీటి తరువాత స్థానంలో సింహాచలం శ్రీ వరాహలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానానికి రూ.1.04 కోట్ల మేర మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా సమకూరింది. వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆయలానికి కూడా మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా భారీగానే ఆదాయం సమకూరింది. ఈ ఆలయానికి నెలలో రూ.66.11 లక్షల ఆదాయం మనమిత్ర ద్వారా వచ్చింది.

**30శాతం టికెట్లు మనమిత్ర ద్వారానే..:** రాష్ట్రంలోని ప్రధాన ఆలయాల్లో 30శాతం మేర దర్శనం, సేవల టికెట్లు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే బుక్ అవుతున్నాయి. ఆలయాలు దర్శించాలనుకుంటున్న ప్రజానీకానికి మనమిత్ర చాలా హాయిగా మారింది. మామూలుగా అయితే ఆలయాల వద్ద రద్దీలో దర్శనం, సేవా టికెట్ల కోసం గంటల కొద్ది నిరీక్షించాల్సి వచ్చేంది. ఇప్పుడు అలా కాకుండా భక్తులు తమ చేతిలోని సెల్‌ఫోన్‌లో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా కేవలం హాయ్ అని మెసేజ్ పంపితే చాలు, వారు వెళ్లాలనుకున్న ఆలయం వివరాలు, అక్కడ దర్శనం, సేవా టికెట్ల అందుబాటు అందులో చూపించేస్తుంది. వాట్సాప్‌లోనే దర్శనం, సేవా, తలనీలాల టికెట్లు బుక్ చేసుకుని వాటి పిడిఎఫ్‌లు కూడా అందులోనూ డౌన్‌లోడు చేసుకుంటున్నారు. దీనివల్ల మనమిత్ర వాడే భక్తులు తాము వెళ్లదలచిన ఆలయం వద్ద పెద్దగా వేచి చూడాల్సిన అవసరం లేకుండా పోతోంది.

**మనమిత్ర సేవా కేంద్రాలు:** రాష్ట్రంలోని కొన్ని ఆలయాల వద్ద మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న భక్తుల సౌకర్యార్థం ప్రత్యేకంగా మనమిత్ర సేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు. దీంతో మనమిత్ర ద్వారా టికెట్లు బుక్ చేసుకున్న భక్తులు మనమిత్ర సేవా కౌంటర్లకు వద్దకు వెళ్లి అక్కడ మనమిత్ర భక్తుల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్లలో త్వరితగతిన దర్శనం ముగించుకుని వచ్చేస్తున్నారు. ఆలయాలు సందర్శించాలనుకునే ప్రజలు, భక్తులకు మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ అత్యంత సులభ సాధనంగా మారింది. ఎవ్వరినీ అడగాల్సిన అవసరం లేకుండా తమ మొబైల్ నుంచే కేవలం ఒక్క హాయ్ అన్న సందేశం పంపితే చాలు ఆలయాల సేవలన్నీ వారి చేతిలోని మొబైల్ లోనే తెలుసుకుని అక్కడి నుంచే టికెట్లు బుక్ చేసుకోగలుగుతున్నారు. రాబోయే రోజుల్లో మనమిత్ర ద్వారా ఆలయాలకు మనమిత్ర ద్వారా టికెట్ల బుకింగ్ సంఖ్య మరింత పెరిగే అవకాశాలున్నాయని ఆర్‌టిజిఎస్, దేవాదాయశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# తిరుమలను తాకిన నీటిఎద్దడి

## ● హోటళ్లకు, స్థానికులకు తప్పని క'న్నీళ్ల' కష్టాలు ● నాలుగురోజులకోసారి సరఫరాతో కటకట



బాలాజీనగర్, తిరుమల

**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తీవ్ర వర్షాభావ పరిస్థితులు... వేసవిసెలవులు ముగిసినా కొనసాగుతున్న భక్తుల తాకిడితో తిరుమలలో నీటి ఎద్దడి అనివార్యమైంది. ఇప్పటికే తిరుమలలోని ఐదు ప్రధాన జలాశయాల్లో ఉన్న నీరు మరో 75రోజులకు సరిపడే మాత్రమే ఉండటంతో వాణిజ్య అవసరాలకు (హోటళ్ళకు, ఫాస్ట్‌పుడ్ కేంద్రాలకు), స్థానికులు నివాసముంటున్న బాలాజీనగర్ వాసులకు, హెచ్‌టి ప్రాంతం, డిబిరోడ్డు, ఆర్‌బి సెంటర్‌లో నివాసముంటున్న వారికి నీటి కష్టాలు మొదలయ్యాయి. చాలావరకు తిరుమలలో నీళ్ల వృధా కాకుండా పరిరక్షించడానికి పబ్లిక్ కొళాయిలు కూడా తొలగించేశారు. దానికి బదులు తిరుమల వాసులకు ఇళ్లకే నేరుగా కొళాయి కనెక్షన్స్ ఇచ్చి నీటిని సరఫరా చేస్తున్నారు. గత మూడునెలలుగా తీవ్ర వేసవితో వర్షాభావ పరిస్థితులతో కొండపై నీటికి ఇబ్బందులు తలెత్తాయి. ముందుచూపుతో టిటిడి అధికారులు తిరుమలలో కాపురాలుంటున్న స్థానికులకు, హెచ్‌టి కాంప్లెక్స్, షాపింగ్ కాంప్లెక్స్, టెలిఫోన్ ఎక్స్చేంజ్ మార్గంలోని హోటళ్ళకు కూడా రేషన్ విధానం అమలుచేసి నీటిని నాలుగు రోజుల కోసారి సరఫరా చేస్తున్నారు. ఇలా సరఫరా అవుతున్న నీటిని పట్టుకుని మళ్ళీ నీళ్ళు వచ్చేవరకు వాటినే వినియోగించుకోవాల్సి వస్తోందని స్థానికులు వాపోతున్నారు. 2025లోనే తీవ్రనీటి ఎద్దడి పరిస్థితులు తలెత్తాయి. అప్పట్లోనే టిటిడి అధికారులు ప్రైవేట్ నీళ్ళట్యాంకర్లపై ఆధార పడాలని స్థానికులకు సూచించారు. ఈ విషయంపై "వార్త"ప్రధానంగా నీటి కష్టాలు ప్రచురించడంతో స్పందించిన సిఎం చంద్రబాబునాయుడు తిరుమలకు నీటి ఎద్దడి రాకుండా చూడాలని అదికారులను ఆదేశించారు. మళ్ళీ ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు ఎదురవడంతో స్థానికులు నీటి కష్టాలు చవిచూస్తున్నారు.

**నాలుగు రోజులకోసారి నీళ్ళే శరణ్యం:** తిరుమలలో అనాదికాలం నుండి బాలాజీనగర్, ఆర్‌బి సెంటర్‌లో స్థానికులు నివాసముంటున్నారు. వీరంతా కొండపైనే పలు రకాలుగా వ్యాపారాలు చేసుకుని జీవనం సాగిస్తున్న వారే. సుమారు 1,100వరకు ఇళ్ళు ఉన్నాయి. ఐదువేలమందివరకు జనాభా ఉన్నారు.వీరికి రోజుకు ఒక్కొక్కరికి 10లీటర్ల నీరు అవసరం అనుకున్నా రోజుకు సరాసరి 2లక్షల లీటర్లు నీరు వినియోగమవుతుంది. నెలరోజుల నీటి సరఫరాకు ఇంటికి వందరూపాయలు టిటిడి వసూలుచేస్తోంది. ఇదీ నామమాత్రపు బిల్లు అయినా వేసవిలో మాత్రం నీటికి కష్టాలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు నాలుగురోజులకోసారి సరఫరా అవుతున్న నీటిని డ్రమ్ములు, నీటి ట్యాంకర్లులో నింపుకున్నా అరకొరగానే నీటి వినియోగం మారిందని స్థానికుల ఆవేదన. తిరుమలలో రెండువేల వరకు వివిధ రకాల వ్యాపారాలు, దుకాణాలు, టీ దుకాణాలు, 30వరకు పెద్ద హోటళ్ళు, వందవరకు ఫాస్ట్‌పుడ్ కేంద్రాలు ఉన్నాయి. వీటికి కూడా నీటి రేషన్‌తో బెంబేలెత్తి పోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే స్థానికులు, గృహావసరాలకు, వాణిజ్య అవసరాలకు ప్రైవేట్ నీళ్ళట్యాంకర్లపై ఆధారపడక తప్పదనే విషయం స్పష్టమవుతోంది.

**'వార్త'ముందే హెచ్చరించినా!:** తీవ్రవర్షాభావ పరిస్థితులతో తిరుమలలో జలాశయాల్లో నీరు తగ్గిపోతోందని, ఐదు ప్రధాన జలాశయాల్లో ఉన్న నీరు మరో 85రోజుల వరకు సరిపడుతుందని టిటిడి అధికారుల మాటగా "వార్త"మేనెలలోనే ప్రధానంగా ప్రచురించింది. ఈ పరిస్థితి గత నెలరోజులుగా కనిపిస్తున్నా ఇప్పుడు స్థానికులకు రేషన్ విధానం అమలుతో తెలిసింది. ఇప్పటికీ కురవని నైరుతి వానలతో తిరుమలలో అధికారులు తాగునీటి కోసం సతమతమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. రానున్న జులై మాసంలో కూడా వర్షాలు కురవకపోతే తాగునీటికి ప్రత్యామ్నాయ పరిస్థితులపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

తిరుమలలో మొత్తం 14,304 లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యంతో గోగర్భం డ్యామ్ పూర్తిస్థాయి నీటిమట్టం 2,894 అడుగులు, పాపవినాశనం 697.14 అడుగులు, ఆకాశగంగ జలాశయం 685లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం. రెండు ప్రధాన పెద్దజలాశయాలు కుమారధార, పసుపుధార తీర్థాలు. ఈ రెండు జలాశయాల్లో పసుపుధార 2,833లక్షల గ్యాలన్లనీటి సామర్థ్యం, కుమారధారతీర్థం 4,258లక్షల గ్యాలన్ల నీటిసామర్థ్యం కలిగివున్నాయి. ఇవన్నీ పూర్తిస్థాయిలో నిండితే ఏడాదిన్నరపాటు నీటికొరత తలెత్తదు. అయితే గత రెండు నెలలుగా జలాశయాలకు నీరుచేరే అవకాశం లేకపోయింది.

వర్షాభావ పరిస్థితులతో జలాశయాల్లో నీరు తగ్గిపోతుండటంతో తిరుమల వాసులకు నీటి కష్టాలు మొదలయ్యాయి. భక్తులకు కూడా కాటేజీలకు, అతిథిగృహాలకు రేషన్ విధానం అమలు చేస్తున్నారు.

# శ్రీవాణి దర్శన టికెట్ల సమయం గందరగోళం

## - అయోమయంలో 300 మంది భక్తులకు ఇబ్బందులు



**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రతిరోజూ సాయంత్రం 4గంటలకు అనుమతించే శ్రీవారి ట్రస్ట్ బ్రేక్ దర్శనాల భక్తులకు .జారీచేసిన టిక్కెట్లపై సమయం తప్పుగా ముద్రించడంతో గందరగోళం నెలకొంది. బుధవారం ఈ సంఘటనతో శ్రీవాణి భక్తులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రతిరోజూ సాయంత్రం 4 గంటలకు శ్రీవాణి ట్రస్ట్ భక్తులను దర్శనానికి అనుమతినిస్తారు. అయితే కొన్ని టిక్కెట్లపై సాయంత్రానికి బదులుగా ఉదయం 4 గంటలు అని ముద్రించడంతో గందరగోళంగా తయారైంది. దీంతో బుధవారం తెల్లవారుజామునే క్యూ కాంప్లెక్స్‌కు చేరుకున్న 300 మంది భక్తులను వైకుంఠమ్ క్యూకాంప్లెక్స్‌లో సిబ్బంది ఆపేశారు. సాయంత్రం దర్శనానికి రావాలని సూచించారు. అయితే తెల్లవారుజామునే వచ్చామని, తమకందరికీ దర్శనాలు కల్పించాలని పట్టుబట్టారు. దీంతో టిటిడిలో జరిగిన పొరపాటును సరిదిద్ది భక్తులకు ఉదయం వేళ విఐపి బ్రేక్ దర్శనం టిటిడి అధికారులు కల్పించడంతో పరిస్థితి సద్దుమణిగింది. టిటిడి సిబ్బంది పొరపాటు వల్లే ఈ సమస్య తలెత్తిందని అధికారులు వివరణ ఇచ్చుకునే పరిస్థితి కనిపించింది సిబ్బంది చేసిన చిన్న పొరపాటు కారణంగా తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చిన వందలాది మంది భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసింది. శ్రీవారి దర్శనం కోసం పలువురు భక్తులు మూడు నెలల ముందే ఆన్‌లైన్‌లో శ్రీవాణి ట్రస్ట్ టికెట్లను కొనుగోలు చేశారు. ఈ టికెట్లపై దర్శన సమయం సాయంత్రం 4 గంటలకు బదులుగా, పొరపాటున ఉదయం 4 గంటలుగా ముద్రితమైంది. టికెట్‌పై ఉన్న సమయాన్నే ప్రామాణికంగా తీసుకున్న దాదాపు 300 మంది భక్తులు బుధవారం తెల్లవారుజామున 3 గంటలకే తిరుమలలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్1 వద్దకు చేరుకున్నారు. దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తుల టికెట్లను అక్కడి టిటిడి సిబ్బంది తనిఖీ చేయగా అసలు విషయం బయటపడింది. సాయంత్రం జరగాల్సిన దర్శనానికి ఉదయం సమయం వేశారని గుర్తించారు. చివరకు శ్రీవాణి టిక్కెట్ భక్తులందరికీ రెఫరల్ ప్రొటోకాల్ విఐపి బ్రేక్ దర్శనం కింద శ్రీవారి దర్శన భాగ్యం కల్పించారు. మొత్తం మీద టికెట్ల జారీలో జరిగిన సాంకేతిక పొరపాటు భక్తులకు తాత్కాలిక ఇబ్బందులు కలిగించినప్పటికీ, టిటిడి అధికారులు తక్షణం స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి సమస్యను పరిష్కరించడంతో శ్రీవారిని దర్శించుకుని భక్తులు సంతృప్తితో వెనుదిరిగారు.

# భక్తుల భద్రతే ధ్యేయంగా తిరుమలలో ఆక్టోపస్ మాక్‌డ్రిల్



**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** వేసవిసెలవులు ముగిసినా తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ముందుజాగ్రత్తగా బుధవారం ఉదయం ఆక్టోపస్ పోలీసులు, పోలీసులు కొండపై ప్రత్యేక మాక్ డ్రిల్ నిర్వహించింది. ఊహించని విధంగా ఉగ్రవాద దాడులు జరిగినా, ఏదైనా అత్యవసర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా భక్తులకు ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా ఎలా రక్షించాలి, వ్యూహాత్మకంగా శత్రువులను ఎలా అణచివేయాలి, తక్షణమే ఎలా స్పందించాలనే అంశాలపై ఈ విన్యాసాలు జరిగాయి. అత్యంత అధునాతన ఆయుధాలు, అత్యాధునిక రక్షణ సామాగ్రితో సన్నద్ధమైన దాదాపు 50 మంది కమాండోల ప్రత్యేక సిబ్బంది ఈ ఆపరేషన్‌లో చురుగ్గా పాల్గొని తమ నైపుణ్యాలను ప్రదర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం విజిలెన్స్ విభాగం, తిరుమల పోలీసుల సమన్వయంతో ఈ హైప్రొఫైల్ మాక్ డ్రిల్ ప్లాన్ చేశారు. భక్తులు కూడా ఉత్కంఠగా వీటిని తిలకించారు. ఈ మాక్‌డ్రిల్ శ్రీవారి ఆలయ పరిసరాలు, లడ్డూ పోటు, వైకుంఠం క్యూ కాంప్లెక్స్ వంటి అత్యంత రద్దీగా ఉండే ప్రాంతాలలో నిర్వహించారు. ఏదైనా ఊహించని పరిస్థితి ఏర్పడితే బందీల విముక్తి చర్యలు, ఉగ్రవాదులను ఏరివేసే వ్యూహాలను కమాండోలు ఆచరణాత్మకంగా ప్రాక్టీస్ చేశారు. ఈ భద్రతా విన్యాసాలు కేవలం అప్రమత్తతను పరీక్షించుకోవడానికే కాకుండా, తిరుమలకు వచ్చే సామాన్య భక్తులలో ఒక బలమైన ధైర్యాన్ని, నమ్మకాన్ని నింపేలా సాగాయి. ఎలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు భద్రతా బలగాలు సర్వసన్నద్ధంగా ఉన్నాయనే సందేశాన్ని ఈ మాక్ డ్రిల్ ద్వారా స్పష్టం చేశారు. రానున్న బ్రహ్మోత్సవాలను దృష్టిలో ఉంచుకుని కొండపై భద్రతా కవచాన్ని పటిష్టం చేసే వ్యూహం మరోసారి పరీక్షించారు.



## మోపిదేవి శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సేవలో మంత్రి లోకేష్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవిలోని శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవాలయాన్ని మంత్రి లోకేష్ సందర్శించారు. మంత్రి లోకేష్‌కు వేద పండితులు, ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం నాగపుట్ట వద్ద పాలుపోసి శ్రీవల్లీ దేవసేనసమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ ఇఒ దాసరి శ్రీరామ వరప్రసాదరావు మంత్రి నారా లోకేష్‌ను ఘనంగా సత్కరించి, తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపి వల్లభనేని బాలశౌరి, మండలి విప్ పంచుమర్తి అనూరాధ, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, భాష్యం ప్రవీణ్, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, ఆర్టీసి చైర్మన్ కొనకళ్ల నారాయణ, మచిలీపట్నం పార్లమెంట్ టిడిపి అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్, జోనల్ కోఆర్డినేటర్ మంతెన సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

## గంగమ్మ లాకప్‌డెత్ కేసు... హైకోర్టు కీలక ఆదేశాలు

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిది:** దళిత మహిళ గంగమ్మ లాకప్ డెత్‌పై దాఖలైన పిల్‌పై బుధారం ఎపి హైకోర్టు విచారణ జరిపింది. దుర్గప్ప ట్రీట్మెంట్‌కి సంబంధించిన అన్ని రిపోర్టులను ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ సీల్డ్ కవర్‌లో హైకోర్టుకు సమర్పించారు. రిపోర్టులు మొత్తాన్ని ధర్మాసనం క్షుణ్ణంగా పరిశీలించింది. పిటిషనర్ తరపున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ గంగమ్మ కుమార్తె లక్ష్మిని పోలీసులు భయపెడుతున్నారు. ఆమె స్వగ్రామంంలోకి ఎవరిని వెళ్లనివ్వట్లేదని గంగమ్మ మృతదేహానికి రిపోస్టు మార్టం నిర్వహించాలని పిటిషనర్ తరపున న్యాయవాది కోరారు. గంగమ్మ ఒంటిపై గాయాలు ఉన్నాయని హైకోర్టు ప్రశ్నించగా కార్డియాక్ అరెస్ట్‌తో పాటు మరికొన్ని కారణాలతో గంగమ్మ చనిపోయిందని పోస్టుమార్టం రిపోర్ట్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వం తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. గంగమ్మ కూతరు లక్ష్మికి భద్రత కల్పించాలని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలు తమ ముందుంచాలని ఆదేశించిన, విచారణ వాయిదా వేసింది.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం
రహదారులు మరియు భవనముల శాఖ
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
సుమారు రూ.1.80 లక్షల విలువ గల పనికి నిట్ నెం.5/ఇ.ఇ/ఆర్&బి/నరసరావుపేట/2026-27, తేది: 19.06.2026 ద్వారా టెండర్లు ఆహ్వానించబడుచున్నవి. వివరములు ఇ-మార్కెట్ ప్లేస్ అనగా www.apeprocurement.gov.in 29.06.2026 మ.3.00 గంటల నుండి 13.07.2026 మ.3.00 గంటల వరకు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.
సం/-, కార్యనిర్వాహక ఇంజనీరు, (ర.భ) డివిజన్, నరసరావుపేట.
DIPR.NO. 20749/CL/ADVT/1/1/2022-23 తేది: 24.06.2026

GREATER VISAKHAPATNAM MUNICIPAL CORPORATION
Tender Notice No.11/2026-27/SE(North)/EE (North)/DB/GVMC/ Dt:22-06-2026 (Item-01)
Number of Works : 1 Nos (One)
Value of Works (ECV) : Rs.1,20,97,598/-
Downloading Starting Date : 23-06-2026 @ 10.00 P.M.,
Date of Opening Tenders : 08-07-2026 @ 02.00 P.M.,
Further details at http://www.apeprocurement.gov.in
O/o the Superintending Engineer (North), GVMC For Commissioner, GVMC

NOTICE
MAHADHAN
In order to make the Indian Farmers internationally competitive, Mahadhan Agritech Limited, brings to you the following Imported & Indigenous 100% Water Soluble Mixture of Fertilisers as per order dated 24.10.2015, issued by Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi.

| Sr. No. | Particulars / Grade | NPK 16-8-34 | NPK 8-52-17 | NPKFe 0-42-47-2.8 | NPKS 30-0-0-5 | NPKS 24-0-12-6 |
|---|---|---|---|---|---|---|
| 1 | Moisture percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 2 | Total Nitrogen percent by weight, minimum | 16 | 8 | 0 | 30 | 24 |
| 3 | Total Phosphorous and water soluble phosphorous (as $P_2O_5$) percent by weight, minimum | 8 | 52 | 42 | 0 | 0 |
| 4 | Water Soluble Potassium (as $K_2O$) percent by weight, minimum | 34 | 17 | 47 | 0 | 12 |
| 5 | Sulphur (as S) percent by weight, minimum | 0 | 0 | 0 | 5 | 6 |
| 6 | Ferrous Iron (as Fe) percent by weight, minimum | 0 | 0 | 2.8 | 0 | 0 |
| 7 | Total Chloride per cent by weight, maximum | 1.5 | 1.5 | 1.5 | 1.5 | 1.5 |
| 8 | Matter insoluble in water per cent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 9 | Sodium as NaCl percent by weight, maximum | 0.5 | 0.5 | 0.5 | 0.5 | 0.5 |
| 10 | Lead (as Pb) per cent by weight, maximum | 0.003 | 0.003 | 0.003 | 0.003 | 0.003 |
| 11 | Cadmium (as Cd) per cent by weight, maximum | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 | 0.0025 |
| 12 | Arsenic (as As) per cent by weight, maximum | 0.01 | 0.01 | 0.01 | 0.01 | 0.01 |

Salient Features:
1. 100% Water Soluble.
2. Improves quality and yield of the produce.
3. Suitable to use through drip irrigation and foliar application.
Supply and sales of above Mahadhan WSF grades will be done after 30-35 days.

Manufactured / Imported & Marketed by -
MAHADHAN AGRITECH LIMITED
Registered Office : Sai Hira, Survey No. 93, Mundhwa Road, Mundhwa, Pune - 411036, Maharashtra.
www.mahadhan.co.in

25-6pg4_25-6pg4.qxd 24/Jun/26 11:07 PM Page 1



వార్త


విధి అంటూ ఎవరూ సృష్టించలేదు. మనకు మనమే సృష్టించుకున్నాం. మన మాట, ఆలోచన, ప్రవర్తన వల్ల మన జీవితానికి మనమే బాధ్యులం.

న- లావోసు

# బ్లాంక్‌చెక్ ఫీ 'జులుం'!

తామేం చేసినా చెల్లుతుంది కనుక ఎవరు నవ్వుకున్నా, విమర్శలు రువ్వుకున్నా తమకేటి సిగ్గు అన్న చందాన తెలుగు రాష్ట్రాల్లో విద్యావ్యాపారం మూడు పువ్వులు ఆరుకాయలుగా వర్ధిల్లుతోంది. ప్రధానంగా విద్యార్థుల ఫీజుల విషయంలో కళాశాల యాజమాన్యాలు ప్రవర్తిస్తున్న తీరు చూస్తే ఒక భావకవి కలం లోంచి వచ్చిన పద విన్యాసమొకటి గుర్తొస్తోంది. తామేదో విద్యాసేవ చేస్తున్నట్లు గొప్పగా చెప్పుకునే ఆయా విద్యాసంస్థలపై వస్తున్న అభియోగాలు చూస్తోంటే నవ్వుకోవాల్సిందే! అందరికీ తమ తీరు తెలిస్తే నవ్వుల పాలవుతామనే ఆలోచన కూడా లేకుండా ఫీజుల వసూళ్లలో విచ్చలవిడిగా విధానాలు అవలంబిస్తున్నారు. ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో ఇంజినీరింగ్ తదితర వృత్తి విద్యాకోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్‌లను అడిగితే ఆయా కళాశాలల యాజమాన్యాలు పెడ్తున్న షరతులు ఏ విద్యార్థికీ సంతృప్తి నిచ్చేవి కావు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో చదువుకున్న విద్యార్థులు తాజాగా కాలేజీ యాజమాన్యాలకు తమ అసలు ధృవపత్రాల కోసం బ్లాంక్ చెక్‌లు, ప్రామిసరీ నోట్లు సమర్పించుకోవాల్సి వస్తోంది. తమ కోర్సు పూర్తి చేసుకున్నాక ఉన్నత విద్యాకోర్సుల్లో చేరాలంటే లేదా విదేశీ చదువుల కోసం ముందుకు సాగాలంటే ఒరిజినల్ డిగ్రీ పత్రాలు కావాలి. పైగా తాము ప్రస్తుతం చదువుతున్న కళాశాలలోనే క్యాంపస్ సెలక్షన్‌లలో ఎంపికయినా కూడా వారు ఉద్యోగ ప్రస్థానంలో అడుగు పెట్టే సందర్భంగా ఒరిజినల్స్ నమోదు చేయించుకోవాలి. అందుకోసం వాటిని దఖలు పరచాలి. గత మూడేళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను సకాలంలో విడుదల చేసిన పాపాన పోలేదు. ఈ నేపథ్యంలో ఈ యేడాది ఇంజినీరింగ్ ఇతర వృత్తి విద్యా కోర్సులో పూర్తయిన విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లు ఇవ్వలేదు. విద్యార్థి కోర్సులు పూర్తి చేసినప్పటికీ ప్రభుత్వం సదరు విద్యార్థుల అక్కౌంట్‌కు ఫీజు రీయింబర్స్‌మెంట్ జమ చేయకపోవడంతో ఈ యేడాది విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకమైంది. ప్రభుత్వం నుంచి ఆ బకాయిలను వసూలు చేసుకోలేక విద్యార్థుల భవిష్యత్‌తో ముడిపెడితే తమ ఖజానాలోటు నిండుతుందని ప్రయివేటు కళాశాలల యాజమాన్యాలు భావించిన తక్షణమే అమలులో పెట్టాయి. అందుచేతనే ఫీజులు చెల్లిస్తే ఒక పద్ధతి, చెల్లించకపోతే మరో పద్ధతిని అనుసరిస్తున్నాయి. ప్రభుత్వ భరోసాతో కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు మరో మార్గాంతరం లేక లబోదిబో అంటున్నారు. ఫీజు బకాయిలు చెల్లించాల్సింది ప్రభుత్వం కానీ ఒరిజినల్ సర్టిఫికేట్‌లు అడిగితే, ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయి ఫలానా తేదీలోగా ఫీజు రాకపోతే తామే చెల్లిస్తామన్న హామీ పత్రాలతోపాటు అందుకు చెల్లుబాటు ప్రామిసరీ నోట్లు, బ్యాంక్ చెక్‌లు రాయించుకుంటున్నారు. ఇదో దుర్విధానం. ఇలాంటి విధానాలను నిలుపుదల చేయడం కోసం రాష్ట్ర విద్యాశాఖ ప్రత్యేకమైన చర్యలేమీ తీసుకోలేకపోయింది. ఈ నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు ఈ యేడాది 2026-27విద్యాసంవత్సరం నుంచి ఫీజులను వసూలు చేసి, ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చేసినప్పుడు విద్యార్థులకు ఆ సొమ్ము తిరిగి చెల్లించాలని సూచించింది. అసలు చదువుకునే స్తోమత లేని విద్యార్థుల కోసమే ఫీజురీయింబర్స్‌మెంట్ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టగా ఇప్పుడా విధానాన్ని మార్చేస్తే ఆ విద్యాపథకం స్ఫూర్తి దెబ్బతింటుంది. ఈ పథకంతో ఇప్పటికే గత పదేళ్లుగా ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు వృత్తి విద్యా కోర్సులలో చేరితమ జీవితాలు పండించుకుంటున్నారు. ఇప్పుడా పథకాన్ని ఆపినా, హైకోర్టు సూచనలతో ఎవరి ఫీజులు వారు కట్టేసి మళ్లీ ప్రభుత్వం నుంచి విద్యార్థులు వసూలు చేసుకోవడం సరైనపద్ధతి కాదు. దాంతో ఫీజులు కట్టుకోలేనివారు, నిరాశానిస్పృహలతో తమ జీవితాలను వెలిబుచ్చాల్సి ఉంటుంది. హైకోర్టు ఉత్తర్వులు వెంబడి ప్రభుత్వం కూడా ఓ విచిత్రమైన జి.ఓ ఇచ్చింది. 2026-27 విద్యాసంవత్సరంలో విద్యార్థులకు నేరుగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. కానీ ప్రభుత్వం ప్రతి యేటా ఏయే సమయాల్లో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించగలదో స్పష్టత లేక హైకోర్టు ఎలాంటి కొత్త ఉత్తర్వులు ఇవ్వలేదు. పాత పద్ధతి అమల్లో ఉన్నట్లే. ఈలోగా ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ చెల్లించే విషయంలో చొరవ చూపలేదు. కళాశాలలు చేసేది లేక విద్యార్థుల పేరిట ఉన్న ఫీజు బకాయిలు వారి నుంచే వసూలు చేయాలన్న ధోరణితో బ్లాంక్ చెక్‌లు, ప్రామిసరీ నోట్లు సేకరణ విధానాన్ని చేపట్టింది. ఇలాంటి విధానం దేశంలోని ఏ యూనివర్సిటీ, కళాశాలలు అవలంబించడం లేదు. తెలంగాణ కళాశాలలు ఎన్నుకున్న పద్ధతి చర్చనీయాంశమైంది. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోతే తాము కళాశాలలను నడపలేమని ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ముందుగానే హెచ్చరించాయి. బంద్ పాటించడంతో ప్రభుత్వం కొంతమేరకు ఫీజు రీయిం బర్స్‌మెంట్ నిధులు విడుదల చేసింది. గత మూడేళ్లుగా ఆయా కళాశాలలకు చెల్లించాల్సిన ఫీజుబకాయిలు దాదాపు పదివేల కోట్ల రూపాయల వరకు ఉండగా కంటి తుడుపుగా రూ.400 కోట్లు విడుదల చేసి ప్రభుత్వం మిన్నకుంది. ఇక కొత్త విద్యాసంవత్సరం మొదలయ్యింది. కథ మామూలే. పెరిగిపోతున్న బకాయిలు వచ్చే మార్గం లేదు. కనీసం విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికేట్‌లకు లింకు పెడితే నైనా కొన్ని నిధులు రాబట్టుకోగలమని కళాశాల యాజమా న్యాలు చేపట్టిన వసూళ్ల విధానం విద్యార్థుల విదేశీ చదువులు, ఉపకార వేతనాలకు దూరమయ్యే పరిస్థితి ఎదురైంది. ప్రభుత్వ భరోసాతో విద్య పూర్తయిందన్న ఆనందమే లేకుండా మరో ఉన్నత చదువులకు ఆటంకాలేర్పడుతున్నాయని ఆందోళనలో గత యేడాది విద్యాయాత్ర ముగిసింది.

మాటలో నిజాయితీ, స్పష్టత ఉంటే అవతలివారు ఇట్టే ఆకర్షితులవుతారు.



ప్లేటో

సంతృప్తే మనిషికి సహజమైన సంపద. భోగాలు, విలాసాలు కృత్రిమమైన దారిద్ర్యం వంటివి.



సోక్రటీస్

# ప్రజావాక్కు



### ముప్పుగా మారుతున్న ఇ-వ్యర్థాలు

ఆధునిక ప్రపంచంలో ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం వేగంగా పెరుగుతోంది. మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లు, టెలివిజన్లు, బ్యాటరీలు, గృహోపకరణాలు వంటి పరికరాలు కొంతకాలం తరువాత ఈవ్యర్థాలుగా మారుతున్నాయి. ఈవ్యర్థాల పరిమాణం రోజురోజుకు పెరుగుతుండటం పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్రమైన ముప్పుగా మారింది. ఈవ్యర్థాల్లో సీసం, పాదరసం, కాడ్మియం వంటి ప్రమాదకర లోహాలు ఉంటాయి. వీటిని శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకపోతే నేల, నీరు, గాలి కలుషితమవుతాయి. ఫలితంగా శ్వాసకోశవ్యాధులు, నాడీ సంబంధిత సమస్యలు, ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా అనధికారిక రీసైక్లింగ్ కేంద్రాల్లో పని చేసే కార్మికులు ఎక్కువగా ఆరోగ్యపరమైన ప్రమాదాలకు గురవుతున్నారు. ఈవ్యర్థాల సమస్యకు ప్రధాన కారణాలు తరచుగా కొత్తపరికరాలను కొనుగోలుచేయడం, పాత పరికరాలను నిర్లక్ష్యంగా పారవేయడం, అవగాహన లోపం. ఈ పరిస్థితిని అధిగమించాలంటే ఈవ్యర్థాలను ప్రత్యేకంగా సేకరించి అధికారిక రీసైక్లింగ్ కేంద్రాలకు అందించాలి. ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రజలు సమన్వయంతో పనిచేస్తే ఈవ్యర్థాల ముప్పును తగ్గించవచ్చు.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### వృద్ధ నేతలు తప్పుకోవాలి

దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అపారమైన తెలివితేటలు శక్తి సామర్థ్యాలు గల యువకులు మనదేశంలో ఎంతో మంది ఉన్నారని వారు రాజకీయాల్లోకి వచ్చి చురుకైన పాత్ర పోషించాలని అత్యున్నత పదవులను అధిష్టించాలని మాటల్లోనూ ఉపన్యాసాల్లోను చెబుతున్నారు కానిచేతలు ఇందుకు వ్యతిరేకంగా ఉంటున్నాయి. యువతకు అవకాశం ఇవ్వటం లేదు. ఎంత వయసు వచ్చినా పదవులను పట్టుకుని వేలాడుతున్నారు.

- శాస్త్రి, హైదరాబాద్

### హోటళ్లు పరిశుభ్రత పాటించాలి

నగర పరిసర ప్రాంతాల్లో హోటళ్లు కనీస పరిశుభ్రత పాటించకుండా టిఫిన్స్ చేస్తుండడం వలన వాటిని తినే ప్రజలు అనేక రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. కావున ఎక్కడికక్కడ అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకొని ప్రజలు రోగాల బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### రిజర్వేషన్లు మన ప్రతిభకు గొడ్డలిపెట్టు!

ప్రతిభకు పట్టం కట్టడం అంటే భారతదేశాన్ని అభివృద్ధి పథంలో శరవేగంగా పయనింపచేయడం! రిజర్వేషన్లకు రాం రాం పాడి, మంగళం పాడి, ప్రతిభే కొలమానంగా మన ప్రభుత్వాలు ముందుకు సాగేలా ఒక పెద్దఎత్తున ఉద్యమానికి అంకురార్పణ గావించేలా ప్రజా సంఘాల వారు మేధావి వర్గాల వారు తీవ్ర కృషి సల్పాలి! ఎందుకంటే అగ్రవర్ణాల వారికి 100 ర్యాంకు వచ్చిన దక్కనిఫలం, రిజర్వేషన్ వున్నవారికి 5000 ర్యాంకు వచ్చిన ఫలం దక్కడం ఓ అమానుషం, ఓ తీరని అన్యాయం క్రిందకు వస్తుంది! ఇప్పటికైనా కుల, మతాలకు అతీతంగా ప్రతి ఒక్క ప్రజానీకం రిజర్వేషన్లకు శాశ్వత విరామం ప్రకటించేలా ప్రతిభ వున్నవారికి పట్టాభిషేకం చేసేలా తీవ్ర కృషి చేయాలి.

- బుగ్గన మధుసూదనరెడ్డి, నంద్యాల జిల్లా

### చరిత్రను వక్రీకరిస్తున్నారు

దేశం కోసం ఎంతో చేసి ఎన్నో కష్టాలు పడి దేశానికి ప్రధాని అయిన వారు దేశ ప్రజలకు అద్వితీయమైన సేవలు అందించి ఏనాడు గొప్పలు చెప్పుకోని వారు ప్రచార ఆర్భాటాలు ఇష్టపడని వారు సంపన్న కుటుంబంలో పుట్టి కూడా అతి నిరాడంబరంగా జీవించిన వారు దేశ ప్రథమ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసి 17 సంవత్సరాల పాటు దేశాన్ని పాటించిన వారు నెహ్రూ. ఆయన పాలనా కాలాన్ని అధిగమించామని గొప్పలు చెప్పుకుంటూ ప్రచారం చేసుకుంటున్నారు. మంచిదే సుదీర్ఘకాలం పాటు దేశానికి సేవ చేసే అదృష్టం కొందరికే దక్కుతుంది. ప్రధాన మంత్రి పదవిలో ఉంటూ తుది శ్వాస విడిచే అదృష్టం కూడా కొందరికే దక్కుతుంది.

- ఎమ్.ఎస్.శర్మ, హైదరాబాద్

### ప్రచార సాధనాలు

ధరల పెరుగుదల, నిరుద్యోగం, పరీక్షలు సక్రమంగా నిర్వహించలేకపోవటం దారుణంగా పతనమవుతున్న రూపాయి విలువ ఆర్థికంగా చితికిపోతూ అప్పుల పాలవుతున్న దేశం ఇవన్ని కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలు. వీటిని విపక్షాలు వేలెత్తి చూపుతున్నాయి. ప్రభుత్వ అసమర్థతను విమర్శిస్తున్నాయి. అయితే పాలకులు తమ వైఫల్యాలను అంగీకరించడం లేదు. అంతా బాగుందని, అందరూ హీపీగాఉన్నారని ఎవరికి ఎలాంటి సమస్యలు లేవని కబుర్లు చెబుతూ ప్రజలను మోసం చేస్తోంది. అంతా తమకు అనుకూలంగా మార్చుకుంటోంది. ప్రసార మాధ్యమాలైన రేడియో, టివిలు కూడా ప్రభుత్వ అనుకూలవార్తలు ప్రసారం చేస్తున్నాయి.

-మిథునం, హైదరాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 'విలువల విద్య'తోనే యువతకు భవిత

**ఒక సమాజం ఆమోదించి, అంగీకరించిన ఆదర్శాలు, నియమాలు, ప్రవర్తనలనే 'విలువలు'అంటారు. మంచి విలువలు గల వ్యక్తుల వలనే మంచి సమాజ నిర్మాణం అవుతుంది. అదే మన దేశ భవిష్యత్తు. విలువలను విద్యారూపంలో బోధన ద్వారా పెంపొందించటం ఒక విధానమైతే ఆదర్శప్రాయులు వాటిని అనుసరణీయం ద్వారా సమాజానికి నేర్పించగలగడం అనేది మరో గొప్ప విధానం. కుటుంబ పెద్ద ద్వారా కుటుంబ విలువలు, సమాజంలోని పెద్దల ద్వారా సామాజిక విలువలు, రాజకీయ నాయకుల ద్వారా రాజకీయ విలువలు, స్వీయనియంత్రుత్వ విలువలను మీడియా, సోషల్ మీడియా వారు అనుసరించి నిరూపించగలిగితే తదనంతరం వచ్చేవివిధ వ్యవస్థలలోని తరానికి మార్గదర్శకులుగా, గురువుగా విలువలను అనుసరిస్తున్న వారే ఉండవచ్చనే అభిప్రాయం కలుగుతుంది విశ్లేషకులకు.**

వి వి రమణ నాయక్

ఒక దేశం అన్ని రకాల ప్రగతి ఆ దేశ విలువల వ్యవస్థపై ఆధారపడి ఉంటుంది. అంటే ఆ దేశ సాంఘిక, ఆర్థిక, రాజకీయ అభివృద్ధిలన్నీ ఆ దేశ 'విలువల విద్యపై' ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. చరిత్ర కూడా ఇదే చెబుతుంది. రెండవ ప్రపంచ యుద్ధంలో జర్మనీ, జపాన్ సర్వనాశనమయినాయి. జపాన్లోని హిరోషిమా నాగసాకి పట్టణాలు ఆటంబాంబులకు గురి అవ్వగా జర్మనీ తూర్పు జర్మనీ పశ్చిమ జర్మనీగా విడగొట్టబడింది. కానీ ఆ రెండు దేశాలు అనుసరించిన 'సామాజిక బాధ్యత విలువల' వలన కేవలం రెండు దశాబ్దాలలోనే అవి రెండు అభివృద్ధి చెందాయి. అదే విధంగా 1948లో ఏర్పడిన తక్కువ జనాభాగా ఉన్న ఇజ్రాయిల్ దేశం సైతం రెండు దశాబ్దాలు వ్యవధిలోనే చాలా శక్తివంతమైన దేశంగా మారించింది. దీనికి కారణం ఆ దేశ ప్రజలు అనుసరించిన 'విలువలతో కూడిన అంకితభావం'. చరిత్ర చెబుతున్న అలాంటి విలువలు నేడు మన దేశంలో కనబడుతున్నాయా అని ప్రశ్నించుకోవాల్సి వస్తుంది. వాస్తవానికి నేడు మన సమాజంలో కుటుంబం, సామాజిక, ఆర్థిక, రాజకీయ, మీడియా, సోషల్ మీడియా లాంటి వ్యవస్థలలో విలువల సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాం. ఈ విలువల సంక్షోభం నుండి బయటపడే మార్గాన్ని నేడు మనం సవాళ్లుగా తీసుకోవాల్సిన పరిస్థితి ఉన్నది. ఈ విలువలను పాఠశాల విద్యార్థి దశ నుండే అనుసరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. విద్యార్థి దశ నుండే 'విలువలతో కూడిన విద్యను' గురువులు అందించేందుకు సంసిద్ధంగా ఉన్నప్పటికీ, ప్రస్తుత కాలం తల్లిదండ్రుల సహకారం గురువులకు అందడం లేదనేది సత్యవాక్కు. నేటి తల్లిదండ్రులు తమ బిడ్డలను విద్యాసంస్థలలో చేర్పించుతున్న సందర్భంలో గురువులను మార్కులు, ర్యాంకులు మాత్రమే అడుగుతున్నారు కానీ మంచి విలువలను నేర్పించండి అని అడగడం లేదు. వాళ్ళు మార్కులు, ర్యాంకులు మాత్రమే తమ పిల్లల భవిష్యత్తు అనే భ్రమలో నుండి బయటపడాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎందుకంటే స్వతంత్ర్యం వచ్చే నాటికంటే నేడు మన దేశ అక్షరాస్యత రేటు సుమారుగా 80 శాతం ఉన్నప్పటికీ విద్యావంతులతో పాటు అవినీతి పరుల రేటు కూడా పెరుగుతున్నది అని కొన్ని సర్వేల ప్రకారం తెలుస్తుంది. అవినీతి గల దేశాల జాబితాలో మన దేశం రేటు కూడా పెరిగింది కదా! అనగా విలువలతో కూడిన విద్యను బోధించకుండా తల్లిదండ్రుల కోరిక మేరకు కేవలం మార్కులు, ర్యాంకుల కోసం మాత్రమే బోధన జరుగుతుంది కాబట్టి అక్కడ విలువల బోధన లేనందున అక్షరాస్యతతో పాటు అవినీతి కూడా పెరిగినట్టే కదా! కాబట్టి ప్రస్తుత అకాడమిక్ సంవత్సరాన్ని పురస్కరించుకొని తరగతులు ప్రారంభ సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు గురువులను మార్కులు, ర్యాంకులు మాత్రమే కాకుండా మంచి విలువలను నేర్పించగలరని అడగటం చేస్తే అది దేశ భవిష్యత్తుకు మంచిప్రణాళికగా భావించవచ్చనే అభిప్రాయం కలుగుతుంది. గత అమెరికా అధ్యక్షుడు ఇదే విధా నాన్ని అనుసరించారు. మా బిడ్డలను తమరి చేతులలో ఉంచుతున్నందున మంచి 'విలువలతో కూడిన విద్యను' బోధించండనీ వారి గురువులను కోరారు. ఉచితంగా లభించే వంద రూపాయల కంటే కష్టపడి సంపాదించే ఒకరూపాయి విలువైనదని, ఓటమిని తట్టుకోవడం గెలుపును ఆస్వాదించటం, అసూయద్వేషాలకు దూరంగా ఉంచడం, ప్రకృతిని ప్రేమించడం మోసంతో వచ్చే గెలుపు విజయం కాదని 'విలువలతో



కూడిన విద్యను' మా బిడ్డలకు నేర్పించగలరని గురువులను కోరడం జరిగింది. విద్యార్థుల కంటే తల్లిదండ్రులకు ఈ విలువల విద్య బోధించాలేమో అనే ఆలోచనలను కొన్ని సందర్భాలను గమనిస్తుంటే అనిపిస్తుంటుందని విద్యావేత్తలు వాపోతున్నారు. మార్కులు, ర్యాంకులు మాత్రమే జీవితం కాదని ఈ సమాజంలోని తల్లిదండ్రులు తెలుసుకోవాల్సి ఉన్నది.' నీవు నీతిలేని విద్యను బోధిస్తున్నావు అంటే తెలివిగల దయ్యాలను తయారు చేస్తున్నారని అర్థం' అని విలువల్లేని విద్యగురించి అంటారు డ్యూక్ ఆఫ్ వెల్డింగ్టన్. ఒక సమాజం ఆమోదించి, అంగీకరించిన ఆదర్శాలు, నియమాలు, ప్రవర్తనలనే 'విలువలు'అంటారు. మంచి విలువలు గల వ్యక్తుల వలనే మంచి సమాజ నిర్మాణం అవుతుంది. అదే మన దేశ భవిష్యత్తు. విలువలను విద్యారూపంలో బోధన ద్వారా పెంపొందించటం ఒక విధానమైతే ఆదర్శప్రాయులు వాటిని అనుసరణీయం ద్వారా సమాజానికి నేర్పించగలగడం అనేది మరో గొప్ప విధానం. కుటుంబ పెద్ద ద్వారా కుటుంబ విలువలు, సమాజంలోని పెద్దల ద్వారా సామాజిక విలువలు, రాజకీయ నాయకుల ద్వారా రాజకీయ విలువలు, స్వీయనియంత్రుత్వ విలువలను మీడియా, సోషల్ మీడియా వారు అనుసరించి నిరూపించగలిగితే తదనంతరం వచ్చేవివిధ వ్యవస్థలలోని తరానికి మార్గ దర్శకులవుతారు. 'కుటుంబ విలువల' విషయానికి వస్తే 'నాకు గొప్పతల్లిని ఇవ్వండి నేను గొప్పజాతిని ఇస్తాను' అని అంటారు నెపోలి యన్. అంటే మంచి విలువలను పాటించే తల్లిదండ్రుల వలనవారిని చూసి అనుసరించే వారి బిడ్డలు అదేవిధంగా మంచి విలువలతో పెరిగి జాతి నిర్మాణంలో భాగస్వాములు కాగలరు. ఇలాంటి విలువలు బోధన ద్వారా కాకుండా కుటుంబ పెద్దలను చూసి అనుసరించి నేర్చుకునే విలువలు ఇవి. నేటి సమాజంలో రాజకీయ విలువల సంక్షోభాన్నిఎదుర్కొంటున్నాము. ప్రస్తుత నాయకులు మంచి విలువలు గల రాజకీయ విధానాన్ని అనుసరించగలిగితే తర్వాతతరం వారికి ఇది ఆదర్శప్రాయంగా ఉండగలుగుతుంది. రాజకీయ విలువలు అనుసరించే వారిని చూసి ఆచరణ ద్వారా నేర్చుకోగల ఈ రాజకీయ విలువలు యువ రాజకీయ నాయకులకోసం ఇది అత్యంత అవసర మైనది. ఉదాహరణకు.. 1965 సంవత్సరంలో పాకిస్తాన్ భారత్ పై దాడి చేసింది. దీనికి ప్రతిగా భారత్ జవాబు మాత్రమే చెబుతుంది. ఈ సందర్భంలో అమెరికా భారత్ పై ఒత్తిడి చేస్తూ యుద్ధం ఆపేయాలని లేనిచో భారత్ కు సరఫరా చేయవలసిన ధాన్యాన్ని ఆపేస్తామని బెదిరింపులు చేస్తున్న సందర్భం అది. వాస్తవానికి భారత్ పాక్‌కు జవాబు మాత్రమేఇస్తుంది. ఇది 'స్వాభిమానసమస్య'. ఆ సందర్భంగా దేశ ప్రధాని అయిన లాల్ బహదూర్ శాస్త్రి దేశ ప్రజలకు ఒక పూట భోజనం మానేయండి అనే సందేశం ఇవ్వాల్సివచ్చిన పిమ్మట, ముందు రోజు అనగా ఆదివారం సాయంకాలం తన ఇంటిలో భోజనం వండనీయకుండా తను వారి పిల్లలతో పాటు ఉపవాసం చేయాల్సి వచ్చింది. వారు, వారి పిల్లల ఉపవాస ప్రయోగ ప్రోత్సాహంతో మరుసటి రోజు సోమవారం జాతినీ ఉద్దేశించి ఒక పూట ఉపవాస మంత్రాన్ని దేశ ప్రజలు పాటించాల్సి ఉందని పిలుపునిస్తూ జై జవాన్ జై కిసాన్ నినాదాన్ని ఇచ్చారు. నేడు భారత్ ఇలాంటి 'విలువలతో కూడిన రాజకీయాన్ని' కోరుకుంటుంది. ఈ విధానాలు బోధనతో మాత్రమే కాకుండా 'విలువలు కలిగిన నాయకులను' అనుసరించటం ద్వారా నేర్చుకునే రాజకీయ విలువలు ఇది. సుప్రీంకోర్టు 2002 ఇచ్చిన తీర్పులో విద్యార్థులకు "విలువలతో కూడిన విద్య" అందించేందు కు అన్ని మతాలలోని మానవతా విలువలను విద్యార్థులకు బోధించాలని వ్యక్తులు ఉన్నతులు కావాలంటే 'విలువల బోధన అవసరమని స్పష్టంగా తెలిపింది. ప్రస్తుతం మన రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల స్థాయి నుండే 'విలువల విద్య' అవసరమని భావించి గురువుల సహకారంతో మంచి విలువల విద్య విధానాన్ని మొదటి తరగతి నుండి నేర్పించేందుకు తగువిధంగా సమాయాత్తమై ఉన్నదానేది చాలా గొప్ప విషయంగా భావించవచ్చు.•

# ప్రజారోగ్యాన్ని మింగేస్తున్న కల్తీ మాఫియా!

వనకల్ల వీరప్ప

నిత్యం మనం తీసుకునే ఆహారం అమృతం కావాలి, కానీ నేడు అది నెమ్మదిగా ప్రాణాలను హరించే విషంగా మారుతోంది. లాభాపేక్ష అనే రాక్షసి కోరల్లో చిక్కుకున్న ఆహార రంగం, సామాన్యుడి ఆరోగ్యంతో చెలగాట మాడుతోంది. 'సర్వం కల్తీమయం' అన్నది కేవలం ఒక నానుడి కాదు, నేడు అది మన కళ్లముందు కదలాడుతున్న భయంకర వాస్తవం. భారతదేశంలో సామాన్య ప్రజలజీవన ప్రమాణాలు పెరగడం అటుంచితే, కనీస ఆరోగ్య భద్రత కరువవ్వడం ఆందోళన కలిగించే అంశం. వాతావరణ కాలుష్యంఒకవైపు ఊపిరితిత్తులను ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే, మరోవైపు మనం తినేఆహారంలో చేరుతున్న రసాయనాలు నిశ్శబ్దంగా మృత్యువును ఆహ్వానిస్తున్నాయి. ఉదయం నిద్రలేచిన దగ్గరి నుండి వాడే టూత్‌పేస్ట్, పాలు, టీ పొడి, వంట నూనె, పప్పు ధాన్యాలు.. ఇలా ఒకటేమిటి, ఏ వస్తువును తాకినా అందులో కల్తీ ఉందన్న వార్తలు వినియోగదారుడి వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి. గతంలో కల్తీ అంటేఏదో ఒక వస్తువులో తక్కువ నాణ్యత గల పదార్థాలనుకలపడం అని అనుకునేవారు. కానీ నేడు అది ఒక వ్యవస్థీకృత నేరంగా రూపాంతరం చెందింది. ఇటీవల దేశవ్యాప్తంగా జరిగిన దాడులు చూస్తుంటే, ఒక భారీ నెట్‌వర్క్ దీని వెనుక ఉన్నట్లు అర్థమవుతోంది. సూరత్ వంటి నగరాల్లో యూరియా, డిటర్జెంట్, ప్రాణాంతక రసాయనాలతో 'సింథటిక్ పాలు' తయారు చేయడం మానవత్వం లేని చర్య. పన్నీర్, నెయ్యిలో జంతువుల కొవ్వును కలపడం వంటి ఘటనలు ఆధ్యాత్మిక భావనలతో పాటు ఆరోగ్య భద్రతను కూడా దెబ్బతీస్తున్నాయి. ఢిల్లీలో వెలుగులోకి వచ్చిన నకిలీ టూత్ పేస్ట్ తయారీ కేంద్రం మనదైనందిన జీవితంలో ఏవస్తువునూ నమ్మలేమని నిరూపించింది. బ్రాండెడ్ కంపెనీల పేర్లతో నకిలీ ప్యాకింగ్ చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారు. గడువు ముగిసిన సాఫ్ట్ డ్రింక్స్, ప్యాక్డ్ ఫుడ్స్‌పై పాత తేదీలను చెరిపివేసి కొత్తతేదీలు ముద్రించడం ద్వారా వినియోగదారుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ప్రస్తుత ఆధునిక సమాజంలో నగర జీవనం చాలా వేగంగా మారిపోయింది. ఉరుకులు పరుగుల జీవితంలో సొంతంగా వంట చేసుకునే తీరికలేక చాలామంది బయటి ఆహారంపై ఆధారపడుతున్నారు. బిర్యానీ సెంటర్లు, టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ అవుట్‌లెట్లు నేడు ప్రతిగల్లీలోనూ దర్శనమిస్తున్నాయి. అయితే, ఈ కేంద్రాల్లో శుభ్రత అనేది మచ్చుకైనా కనిపించడం లేదు. హైదరాబాద్ వంటి నగరాల్లో వెలుగులోకివచ్చిన అల్లంవెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాల పరిస్థితి దారుణం. కుళ్ళిన అల్లం, వెల్లుల్లికి రంగులు, రసాయనాలు కలిపి ఆకర్షణీయమైన ప్యాకింగ్‌తో హోటళ్లకు సరఫరాచేస్తున్నారు. ఇలాంటి పదార్థాలను వాడటం వల్ల హోటల్ ఆహారం రుచి కరంగా ఉన్నట్లు అనిపించినా, అది లోలోపల అవయవాలను చిత్తు చేస్తోంది. కల్తీ ఆహారం అనేది కేవలం ఒక వ్యక్తిగత సమస్య కాదు, ఇది దేశం ఎదుర్కొంటున్న అతిపెద్ద ప్రజారోగ్య సంక్షోభం. కల్తీ వల్ల కలిగే నష్టాలు తక్షణమే బయటపడవు, కానీ దీర్ఘకాలంలో అవి ప్రాణాంతకమవుతాయి. ఆహారభద్రతా ప్రమాణాలను పర్యవేక్షించాల్సిన 'ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా', ఆరోగ్యశాఖలు క్షేత్రస్థాయిలో విఫలమవుతున్నాయని చెప్పక తప్పదు. తనిఖీలు కేవలం పండుగ సీజన్లకు లేదా ఫిర్యాదులు వచ్చినప్పుడు మాత్రమే పరిమితం కాకూడదు. ప్రభుత్వం ఎన్నిచట్టాలు చేసినా, ప్రజల్లో చైతన్యం లేనిదే మార్పు రాదు. ఏదైనా వస్తువు కొనేముందు ఎక్స్‌పైరీ డేట్, తయారీదారు వివరాలు, ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లోగోను తప్పనిసరిగా చూడాలి. మనం ఇప్పుడే మేల్కోకపోతే, రేపటితరం

# ఇంకా స్పష్టత రాని శాంతి ఒప్పందం!



సుంకవల్లి సత్తిరాజు

ఎట్టకేలకు ఇరాన్ యుద్ధం ముగిసిందని సంబరపడుతున్న తరుణంలో అప్పుడప్పుడూ ఇజ్రాయిల్, ఇరాన్ మధ్య చెలరేగుతున్న ఆగ్రహజ్వాలల కారణంగా పశ్చిమాసియాలో శాంతి స్థాపన దిశగా పడుతున్న అడుగులపై అనుమానపు క్రీనీడలు కమ్ముకుంటున్నాయి. 100 రోజులకు పైగా అమెరికా ఇజ్రాయిల్ దేశాల క్షిపణుల మోతతో, యుద్ధ విమానాల రణ ధ్వనులతో మధ్యప్రాచ్యం లో నెలకొన్న తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు శాంతి చర్చలతో చల్లారిపోతాయని భావిస్తున్న తరుణంలో అమెరికా హుంకరింపులు, ఇరాన్ బెదిరింపులు, లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడుల వలన ప్రస్తుతం కుదిరిన ఎంఓయూ రాబోవు రోజుల్లో శాంతి ఒప్పందంగా మారుతుందా? లేక పరిస్థితి మొదటికొస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తడం సహజం. ఇజ్రాయిల్ పై దాడులు చేయకుండా హెజ్బొల్లాను కట్టడి చేయక పోతే ఇరాన్‌పై అనూహ్యమైన దాడులు చేస్తామని ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ మండిపడుతున్నది. ఎంఓయూ పై సంతకాలు జరిగిన తర్వాత కూడా లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడులు చేయడంతో ఇరాన్ హార్ముజ్ జలసంధిని తిరిగి మూసివేయడం ఆందోళన కలిగించినా ప్రస్తుతం హార్ముజ్ తెరచే ఉందని, నౌకల రాకపోకలు కొనసాగుతు న్నాయని జెడి వాన్స్ చెప్పడం హర్షదాయకం. ఒక వైపు స్విట్జర్లాండ్‌లో ఇరాన్‌తో జెడివాన్స్ నాయకత్వంలో వాషింగ్టన్ చర్చలు జరుపుతున్నది. ఈ చర్చల్లో పురోగతి కనిపించడంతో ప్రపంచం ఊపిరి పీల్చుకుంటున్నది. ఈ చర్చల్లో కుదిరిన ఒప్పందం ద్వారా ఇరాన్ పునర్నిర్మాణం కోసం 300 బిలియన్ డాలర్ల భారీ సహాయం లభించనుంది. ఇందుకు ప్రతిగా ఈ మొత్తంతో అమెరికాకు చెందిన గోధుమలు, మొక్కజొన్న తదితర ఆహార వస్తువులు కొనాలనే షరతు విధించారు. ప్రస్తుతం కుదిరిన అవగాహనా ఒప్పందం వలన ఇరాన్ బాగా లబ్ధి పొందడంతో భవిష్యత్తులో గల్ఫ్ ప్రాంతంలో ఇరాన్ ఆధిపత్యం కొనసాగే అవకాశముంది. దీనితో గల్ఫ్ దేశాల్లో గుబులు ప్రారంభమైనది. ఇరాన్ పై యుద్ధానికి అమెరికాను పురిగొల్పిన ఇజ్రాయిల్ ప్రస్తుతం ఇరాన్ అమెరికాల మధ్య సాగుతున్న చర్చల పట్ల, ఎంఓయూ పట్ల ఆగ్రహం ప్రదర్శిస్తూ అమెరికాను లెక్క చేయకుండా లెబనాన్‌పై దాడులు కొనసాగించడంపై ట్రంప్ తీవ్ర స్థాయిలో బెంజిమన్ నెతన్యాహూపై విరుచుకుపడడం ఇరు మిత్రదేశాల మధ్య దూరం పెరగడానికి కారణం కావడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో భవిష్యత్తులో ఇజ్రాయిల్ ఒంటరిగా మిగిలిపోతుందా? లేక అమెరికా చెప్పినట్టు వింటుందా అనేప్రశ్నలు తలెత్తుతున్నాయి. 'అనువు గాని చోట అధికులమనరాదు' అనే వేమన పద్యం అమెరికా విషయంలో మరోసారి నిరూపించబడింది. ట్రంప్ అహానికి తగిన శాస్తి జరిగింది. ప్రపంచ ప్రజల మనోభిప్రా



యం నెరవేరింది. యుద్ధానికి కేంద్ర బిందువుగా మారిన హార్ముజ్ జలసంధి గుండా ప్రయాణించే ప్రపంచ దేశాల చమురు నౌకలపై ఎలాంటి ట్రాన్సిట్ టోల్స్‌లేకుండా స్వేచ్ఛగా ప్రయాణం చేసే వెసులుబాటు లభించింది. అమెరికా ఇప్పటివరకు ఇరాన్‌లో కొనసాగించిన నావెల్ బ్లాకేడ్‌ను నిలిపి వేసింది. స్విట్జర్లాండ్‌లో కుదిరిన అవగాహనా ఒప్పందంపై అమెరికా, ఇరాన్ దేశాలు సంతకా లు చేసాయి. పూర్తి స్థాయి శాంతి ఒప్పందానికి ఇంకా అనేక దఫాలుగా చర్చలు జరగవలసి ఉంది. ఈ ఒప్పందం ఆచరణ రూపం దాల్చితే ఇక నుంచి ఇరాన్ పై అమెరికా మిలటరీ ఆపరేషన్లు ఆగిపోతాయి. ఇరాన్‌పై ఆంక్షలను సడలించడం, అమెరికా ఫ్రీజ్ చేసిన 24 బిలియన్ డాలర్ల ఇరాన్ నిధులను దశల వారీగా విడుదల చేయడానికి ట్రంప్ అంగీకరించడం జరిగింది. ఇదే సందర్భంలో లెబనాన్ పై ఇజ్రాయిల్ దాడులు కూడా ఆగిపోవాలని ఇరాన్ డిమాండ్ చేస్తున్నది. ఇరాన్ విషయంలో ఒబామా సాధించలేనిది తాను పూర్తి చేస్తానని ప్రగల్భాలు పలికిన ట్రంప్ తుదకు సాధించిందేమిటి? ఆర్థిక పతనం వైపు పయనిస్తున్న అమెరికాను మరింత దివాలా తీయించడం తప్ప. 100 రోజులకు పైగా సాగిన పశ్చిమాసియా యుద్ధంలో ప్రపంచ దేశాలు తీవ్రంగా నష్టపోయాయి. ఆయిల్ సప్లై చెయిన్స్ విచ్ఛిన్నం కావడంతో ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులు తల్లక్రిందులయ్యాయి. ద్రవ్యోల్బణం తీవ్ర రూపం దాల్చింది. నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. ఆర్థిక సంక్షోభం తీవ్ర స్థాయికి చేరుకుంటున్న తరుణంలో యుద్ధం ముగియడం ఆహ్వానించదగిన పరిణామమే. అయితే ఈ యుద్ధం ద్వారా అమెరికా సాధించిందేమిటనే ప్రశ్న తలెత్తడం సహజం. వాస్తవంగా ఈ యుద్ధం వలన అమెరికా సాధించిందేమీ లేదు. ఇరాన్ చేతిలో చావు దెబ్బ తిని, చేసేదేమీ లేక శాంతి ఒప్పందం పేరుతో గౌరవప్రదంగా తప్పించుకోవడం తప్ప. ఇరాన్ అమెరికాల మధ్య రాజీ కుదర్చడంలో పాకిస్థాన్ పాత్ర పరిమితం. వాషింగ్టన్ టెహ్రాన్‌ల మధ్య సంధి కుదర్చడంలో ఖతార్ కీలక పాత్ర వహించింది. అమెరికా ఆంక్షల వలన ఇప్పటికే ఇరాన్ తీవ్రంగా నష్టపోగా, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొని నిలబడడం విశేషం. యుద్ధంలో ఇరాన్ 350బిలియన్ డాలర్లకు పైగా, అమెరికా వంద బిలియన్ల డాలర్లకు పైగా నష్టాన్ని చవిచూసిచూసాయి. యుద్ధంతో సంబంధం లేని అనేక దేశాలు కూడా తీవ్రంగా నష్టపోగా, భారత్ కూడా ఈ యుద్ధంవలన సుమారు 50 బిలియన్ల డాలర్లు నష్టపోయినట్లు అంచనా. ప్రస్తుతం యుద్ధానికి ముగింపు వాక్యం పలికినా ఇంకా ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. ట్రంప్ నిర్ణయం నెతన్యాహుకు అంగీకారయోగ్యం కాలేదు. అయితే అమెరికా నిర్ణయాలు ఇతర దేశాల మెప్పు కోసం కాదని జెడివాన్స్ చెప్పడం ఇజ్రాయిల్‌కు మింగుడు పడడం లేదు. అమెరికా ఇరాన్ మధ్య కుదిరిన ఎం.ఓ.యూ పూర్తి స్థాయి శాంతి ఒప్పందానికి దారి తీస్తుందా? లేక మధ్యలో ఇరాన్, ఇజ్రాయిల్ దేశాలు మడతపేచీ పెడతాయా? అనే విషయం స్పష్టం కావలసి ఉంది. నిలకడ లేని ట్రంప్ భవిష్యత్తులో ఇరాన్ పై దాడి చేయబోడనే గ్యారంటీ ఉందా? హమాస్, హెజ్బొల్లా సంస్థలపై ఇరాన్ తన అనుకూల ధోరణిని మార్చుకుంటుందా? అపారమైన ప్రాణనష్టం జరిగిన గాజా, లెబనాన్‌లపై అమెరికా, ఇజ్రాయిల్, ఇరాన్‌ల దృక్పథంఎలా ఉండబోతుంది? ఇందుకు కాలమే సమాధానం చెప్పాలి. ఇరాన్ పై యుద్ధం కారణంగా ఇజ్రాయిల్ కూడా భారీగా నష్టపోయింది. యుద్ధం పేరుతో అధికారంలో కొనసాగుతున్న బెంజిమన్ నెతన్యాహుకు అమెరికా, ఇరాన్‌ల మధ్య కుదిరిన శాంతి ఒప్పందం ఆశనిపాతం. ఇప్పటికైనా యుద్ధం ముగియడం ఆహ్వానించదగ్గ అంశమే అయినా ఈ విషయం

## నృసింహుని సన్నిధిలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రత్యేక పూజలు

మంగళగిరి, జూన్ 24, ప్రభాతవార్త : మంగళగిరి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ బుధవారం ఉదయం దర్శించుకున్నారు. స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించి, అష్టోత్తరాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కొండ ఎగువన



కొలువైన శ్రీ పానకాల లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాన్ని సందర్శించారు. పానకాల స్వామి వారికి పట్టువస్త్రాలతోపాటు పానకం నైవేద్యంగా సమర్పించి పూజలు చేశారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనాలు, స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. తొలుత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు విచ్చేసిన పవన్ కళ్యాణ్ కు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు మంగళవాయిద్యాలతో స్వాగతం పలికారు. రాష్ట్ర మెడికల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చిల్లపల్లి శ్రీనివాస్ తదితరులు పవన్ కళ్యాణ్ తో ఉన్నారు.

## నేడు తూర్పులో మెగా జాబ్ మేళావివరాలు వెల్లడించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, జూన్ 24,ప్రభాతవార్త : ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలో నేడు మెగా జాబ్ మేళా నిర్వహించనున్నామని, దీనిని యువత సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం విడుదల చేసిన ఒక పత్రిక ప్రకటనలో



వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి యువత భవిత కోసం అనేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటికే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో మూడు విడతలుగా మెగా జాబ్ మేళా నిర్వహించామని, వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించామని చెప్పారు. స్థానిక బీఆర్ స్టేడియం వద్ద కోడిగుడ్ల సత్రంలోని వెల్ఫేర్ హాస్టల్ లో నిర్వహించే మెగా జాబ్ మేళాలో 15 ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు చేయనున్నాయని తెలిపారు. పదో తరగతి నుంచి బీటెక్ వరకు విద్యార్హత కలిగి ఉండాలని సూచించారు. వేతనం రూ.15 వేల నుంచి రూ.30 వేల వరకు ఉంటుందన్నారు. తూర్పు నియోజకవర్గంలోని యువత కలలకు ఇదొక మొదటి మెట్టని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్ల కాలంలో రాష్ట్రానికి పరిశ్రమల వరద పారించామని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేశామన్నారు. లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమలను తీసుకొచ్చి యువతకు ఉజ్వల భవిష్యత్తు అందించనున్నామని చెప్పారు.

## వైసీపీ కాపు నాయకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:తెదేపా కాపు నేతలు

తెనాలి మున్సిపాలిటీ జూన్ 24(ప్రభాతవార్త): రాష్ట్రంలో వైసిపి పార్టీ కాపు నాయకులు చేస్తున్న,అసత్య ప్రచారాలు, అభూత కల్పనలు,కుట్రలు, కుతంత్రాలపై ప్రజలు అవగాహనతో ఉండాలని తెనాలి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కాపు నాయకులు పేర్కొన్నారు. బుధవారం పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ,ఇటీవలి కాలంలో కొందరు వైసీపీ నాయకులు, ముఖ్యంగా కాపు సామాజిక వర్గం పేరును ఉపయోగించుకుంటూ, తెలుగుదేశం పార్టీ మరియు కూటమి నాయకత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాలను మేము తీవ్రంగా ఖండిస్తున్నాం అన్నారు తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ అన్ని సామాజిక వర్గాలను సమానంగా గౌరవించింది. కాపు సామాజిక వర్గం అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని,రాజకీయ ప్రయోజనాల కోసం సామాజిక వర్గాలను రెచ్చగొట్టడం మా విధానం కాదు అని అన్నారు నాటి తెలుగుదేశం గవర్నమెంట్లో కాపులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి 5 రిజర్వేషన్ కల్పిస్తూ శాసనసభలో ఆమోదించారని గుర్తు చేశారు.అలానే కాపు కార్పొరేషన్ ద్వారా 1000 కోట్లు నిధులు కేటాయిస్తే తదనంతరం అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కాపు కార్పొరేషన్లో మిగిలిన 500 కోట్లను వేరే పథకాలకు మళ్లించి కాపుల పొట్ట కొడితే ఆరోజు ఈ వైసీపీ కాపు నాయకులందరూ ఏం చేశారని ప్రశ్నించారు.తెలుగుదేశం ప్రభుత్వం కాపులకు కార్పొరేషన్ ద్వారా అనేక ఉద్యోగ ఉపాధి



అవకాశాలు కల్పించిందని అందులో భాగంగా యువతకి కార్లు, మహిళలకు అనేక విధాల లోన్లు ఇచ్చి ప్రోత్సహించిందని, కాపు విద్యార్థులకు విదేశీ విద్యకు కూడా కార్పొరేషన్ ద్వారా సహాయ సహకారాలు అందించిందని గుర్తు చేశారు.. కాపులకి అన్ని విధాలుగా అండగా నిలిచేది కూటమి ప్రభుత్వం అని కాపులు ఇప్పటికీ ఎప్పటికీ కూటమి ప్రభుత్వానికి అండగానే ఉంటారని పునరుద్ఘాటించారు ఈ కూటమి ప్రభుత్వం అభివృద్ధి సంక్షేమం రెండు కళ్ళుగా భావిస్తూ చేస్తున్న ఈ ప్రజా పరిపాలనను చూసి తమ రాజకీయ భవిష్యత్తు ప్రశ్నార్థకం అవుతుందని అక్కస్సుతో జగన్మోహన్ రెడ్డి సూచనలతో వైసీపీ నాయకులు కులాల మధ్య మతాల మధ్య ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ సమాజంలో అలజడులు సృష్టిస్తున్నారని అన్నారు.ప్రజలకు కావాల్సింది అభివృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాలు, సంక్షేమం. కానీ వైసీపీ నాయకులు ఈ అంశాలపై మాట్లాడకుండా, అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. కావున కాపు సోదర సోదరీమణులు వాస్తవాలను పరిశీలించండి. ఎవరు మీ అభివృద్ధికి సంక్షేమానికి కట్టుబడి పని చేస్తున్నారు వారికి అండగా ఉండాలని ఇలాంటి కుల రాజకీయాలకి స్వస్తి పలకాలని విజ్ఞప్తి చేశారు.. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మాదాల కోటేశ్వరరావు, పార్టీ సీనియర్ నాయకులు,అక్కిశెట్టి వెంకటేశ్వరరావు ,తెలుగుదేశం పార్టీ తెనాలి మండల ఉపాధ్యక్షుడు ముళ్ళపూడి వెంకట్ , గాజుల విజయ సారథి, అన్నదాసు నాగేశ్వరరావు, గుమ్మడి నరసయ్య, గద్దె వెంకట్రావు,దూళిపూడి పూర్ణచంద్రరావు, కలకండ శేషయ్య,తిరుమలశెట్టి వెంకట నారాయణ,కే. శేషగిరి,తోట శ్రీకాంత్,పసుపులేటి ఏడుకొండలు, గోపిశెట్టి అప్పారావు, కాలిశెట్టి వెంకట్ నారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరెడ్డి నివాసానికి గిద్దలూరు, నరసరావుపేట ఎమ్మెల్యేలు

నరసరావుపేట,జూన్ 24 ప్రభాతవార్త : నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు వ్యక్తిగత ఆత్మీయులు సూరె శ్రీనివాసరెడ్డి ని గిద్దలూరు ఎమ్మెల్య అశోక్ రెడ్డి కలిశారు. పట్నంలోని శ్రీనివాసరెడ్డి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను వారు కలిసారు. ప్రకాశం జిల్లా నుండి వ్యక్తిగత పనులపై నరసరావుపేటకు వచ్చిన ఆయన తన సన్నిహితుడైన శ్రీనివాస్ రెడ్డి ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డిని ఈ సందర్భంగా శాలువా,పూలమాలతో ఘనంగా సత్కరించారు. రాజకీయాలలో ఆయన మరింత రాణించి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సభ్యులు ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ప్రకాశం జిల్లా ప్రజలు, ప్రజాప్రతినిధులతో తమకు దశాబ్దాలుగా సన్నిహిత సంబంధాలు ఉన్నాయని తెలియజేశారు. గిద్దలూరు శాసనసభ్యులు అశోక్ రెడ్డి నరసరావుపేటకు రావటం సంతోషంగా ఉందన్నారు. వారితో తమకు సోదర బంధంతోపాటు, మంచి స్నేహం ఉందన్నారు. సూరె శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తమ ఆహ్వానం మేరకు ఇంటికి వచ్చిన ఎమ్మెల్యేలు అశోక్ రెడ్డి తో పాటు డాక్టర్ చదలవాడ అరవింద బాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వద్దుల కృష్ణారెడ్డి, వాగ్దేవి విద్యాసంస్థల చైర్మన్ రాయల శ్రీనివాసరావు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## మంగళగిరి క్రికెట్ స్టేడియంలో రామ్ చరణ్ సందడి

### ఏ పీ ఎల్ ట్రోఫీ జర్సీలను ప్రారంభించిన రామ్ చరణ్ క్యాపిటల్ అమరావతి రాయల్స్ భీమవరం బుల్స్ మధ్య మ్యాచ్ టాస్ వేసి మ్యాచ్ లను ప్రారంభించిన రామ్ చరణ్ స్టేడియం చుట్టూ తిరుగుతూ అభిమానులకు అభివాదం

మంగళగిరి జూన్ 24, ప్రభాతవార్త : మంగళగిరి లోని నవులూరు వద్ద నూతనంగా నిర్మాణం పూర్తి చేసుకున్న క్రికెట్ స్టేడియం నందు జిఎంఆర్ ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏ పీ ఎల్) సీజన్ 5 ను మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ తేజ్ బుధవారం సాయంత్రం ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన అభిమానుల కోలాహలం మధ్య మ్యాచ్ వైభవంగా జరిగింది. క్యాపిటల్ అమరావతి రాయల్స్ భీమవరం బుల్స్ జట్లు తలపడుతుండగా రామ్ చరణ్ టాస్ వేసి మ్యాచ్ ను ప్రారంభించారు. అమరావతి రాయల్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. టాస్ వేసిన అనంతరం రామ్ చరణ్ తేజ్




స్టేడియం చుట్టూ తిరిగి అభిమానులకు అభివాదం చేశారు. క్యాపిటల్ అమరావతి రాయల్స్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకుంది. రామ్ చరణ్ ను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో పోలీసులు, సెక్యూరిటీ సిబ్బంది అతి కష్టం మీద తాకిడిని అదుపు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఐటీ విద్యాశాఖల మంత్రి నారా లోకేష్ చొరవతో జరుగుతున్న ఈ మ్యాచ్ లు ఈ నెల 30 వరకు కొనసాగనున్నాయి. కార్యక్రమంలో ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), సెక్రెటరీ సానా సతీష్, కేంద్ర మంత్రి భూపతి రాజు, శ్రీనివాస్ వర్మ, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, శాప్ చైర్మన్ రవి నాయుడు, వంగవీటి రాధా తదితరులు పాల్గొన్నారు. మీడియా ప్రతినిధులకు న్యూస్ కవరేజ్ చేసేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అధికారులు పాసులను జారీ చేశారు. మీడియా గ్యాలరీ తో పాటు, విఐపి గ్యాలరీలోకి సాధారణ వ్యక్తులు సైతం చొచ్చుకు రావడం భద్రత వైఫల్యాన్ని ఎత్తి చూపింది. సెక్యూరిటీ సిబ్బంది చేతులు ఎత్తి వేయడం వల్లనే ఈ పరిస్థితి తలెత్తిందని, అంతర్జాతీయ స్థాయి హంగులతో స్టేడియం నిర్మితమైనట్లు చెబుతున్న నేపథ్యంలో ఇక్కడ భద్రత ఇలా ఉండటం ఏమిటి అన్న ప్రశ్న లు తలెత్తాయి

## విజయోత్సవ సభ నిర్వహించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

గుంటూరు, జూన్ 24,ప్రభాతవార్త :ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం రెండు సంవత్సరాల సుపరిపాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గుంటూరు పశ్చిమ నియోజకవర్గ విజయోత్సవ సభ శ్రీనివాసరావుపేటలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఇండస్ట్రియల్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తాళ్ళ వెంకటేష్, నిమ్మల శేషయ్య, జనసేన నాయకుడు ఆళ్ల హరి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి నారాయణ రెడ్డి పాల్గొని కూటమి ప్రభుత్వ రెండు సంవత్సరాల పాలన, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రసంగించారు.ఈ సందర్భంగా ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన 23వ డివిజన్ టీడీపీ కార్యకర్త షేక్ సాంబయ్య కుటుంబానికి టీడీపీ కార్యకర్తల సంక్షేమ నిధి నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును ఎమ్మెల్యే గళ్ళా మాధవి వారి భార్య షేక్ శిరీషకు అందజేశారు. అదేవిధంగా 2 ఏళ్ల ఎమ్మెల్యే గళ్ళా మాధవి చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని తెలుపుతూ, తయారు చేసిన లఘు చిత్రం ఎన్డీయే కూటమి నేతలను ఆకట్టుకుంది.అనంతరం కూటమి నేతలతో కలిసి విజయోత్సవ కేక్‌ను కట్ చేసి పరస్పరం తినిపించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి ప్రధాన కారణం ప్రజల ఆకాంక్షలతో పాటు గత వైసీపీ పాలనపై ప్రజల్లో నెలకొన్న వ్యతిరేకతేనని అన్నారు. రాష్ట్రం తీవ్ర సంక్షోభ పరిస్థితుల్లో ఉన్న సమయంలో తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ మూడు శక్తులు ఏకమై రాష్ట్ర పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టాయని పేర్కొన్నారు. రెండు సంవత్సరాల కాలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అన్ని రంగాల్లో వేగంగా ముందుకు సాగిందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అంకితభావం, ప్రధాని నరేంద్ర మోదీ సహకారంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని అన్నారు.గత పాలన కొనసాగి ఉంటే రాష్ట్రం మరింత వెనుకబడిపోయేదని, యువత ఉపాధి అవకాశాలు కోల్పోయి సామాజిక సమస్యలు పెరిగే పరిస్థితి ఏర్పడేదని పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు భరోసా కల్పించే పాలన కొనసాగుతోందని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రభుత్వం పనిచేస్తోందని చెప్పారు.గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో కూడా ప్రజల సహకారం, పార్టీ నాయకులు, కార్యకర్తల అండదండలతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలిగామని తెలిపారు. సమస్యలు ఎప్పుడూ ఉంటాయని, వాటిని పరిష్కరిస్తూ ముందుకు వెళ్లడమే



ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు రానున్న రోజుల్లో ఇంటింటికీ వెళ్లి డోర్‌టుడోర్ ప్రచార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను, భవిష్యత్ కార్యాచరణను ప్రజలకు వివరించడం ప్రతి నాయకుడు, కార్యకర్త బాధ్యత అని అన్నారు.

అదేవిధంగా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా నిర్వహించాలని, బూత్ స్థాయిలో ప్రతి ఇంటిని సంప్రదించి ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా పార్టీ దృష్టికి తీసుకురావాలని సూచించారు.ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర లక్ష్య సాధన దిశగా పయనిస్తోందని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు వంటి చారిత్రాత్మక నిర్ణయాలు కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు.కూటమి ప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ ఫలాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజల్లో మరింత విశ్వాసం కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిస్తూ, అందరూ ఐక్యంగా పనిచేసి రాష్ట్ర అభివృద్ధికి భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలోని అనుబంధ సంఘాల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, డివిజన్ కమిటీ సభ్యులు, బూత్ కన్వీనర్లు, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

## జనసేన పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తా: తుమ్మల నరసింహ

గుంటూరు, జూన్ 24, ప్రభాతవార్త : జనసేన పార్టీ గుంటూరు పార్లమెంట్ పరిధిలోని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిశీలకుడిగా తనను నియమించిన పార్టీ అధిష్టానానికి ఆ పార్టీ నగర కార్యదర్శి తుమ్మల నరసింహ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.



ఈ బాధ్యతను తనపై ఉంచిన పార్టీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే గుంటూరు పార్లమెంట్ పరిశీలకుడిగా నియమితులైన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ గారికి కూడా నరసింహ అభినందనలు తెలియజేస్తూ, తనకు లభించిన అవకాశానికి వారి ప్రోత్సాహం, సహకారం ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల నరసింహ మాట్లాడుతూ, పార్టీ అధిష్టానం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో జనసేన పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు కూటమి విజయాలకు తన వంతు పాత్రను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మరింత చేరువయ్యేలా కార్యక్రమాలు చేపడతానని, పార్టీ సిద్ధాంతాలు, నాయకత్వం ఆశయాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం శ్రమిస్తానని చెప్పారు. రానున్న రోజుల్లో పార్టీ అభివృద్ధి, కూటమి బలోపేతం లక్ష్యంగా అంకితభావంతో పనిచేస్తానని తుమ్మల నరసింహ స్పష్టం చేశారు.

## విద్యార్థుల్లో రహదారి భద్రతపై అవగాహన

గుంటూరు క్రైమ్,జూన్24,ప్రభాతవార్త: గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం 4.30 గంటల నుండి రాత్రి 8.00 గంటల వరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పాఠశాలలు,కళాశాలలు,వాటి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడ్డాయి.ద్విచక్ర వాహనం హెల్మెట్ లేకుండా నడిపిన వారిపై 204,మైనర్ డ్రైవింగ్ 15,ఓవర్ స్పీడ్ 40, ట్రిపుల్ రైడింగ్ 43, రాంగ్ సైడ్ డ్రైవింగ్ 19, డ్రంక్ అండ్ డ్రైవింగ్ 6, అధర్ వైలేషన్స్ 347,మొత్తం 677కేసులు నమోదు చేయగా రూ3,84,290/ జరిమానా విధించారు.

అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ఎనిమిది చోట్ల కండక్ట్ చేశారు.65మంది డ్రైవర్స్ 120 మంది స్టూడెంట్స్ 105 మంది కామన్ పబ్లిక్ హాజరయ్యారు. ఈ ప్రత్యేక డ్రైవ్‌లో స్టేషన్ హౌస్ ఆఫీసర్లు,సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు,ట్రాఫిక్,లా అండ్ ఆర్డర్ సిబ్బంది పాల్గొని విద్యార్థుల భద్రత,ట్రాఫిక్ క్రమశిక్షణ, మహిళల రక్షణ,ప్రజా శాంతిభద్రతల పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. ఈ తనిఖీలలో భాగంగా మైనర్లు వాహనాలు నడపకుండా ప్రత్యేక తనిఖీలు నిర్వహించి,నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు,సంబంధిత విద్యార్థులు,వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించారు.ఈవ్ టీజింగ్,విద్యార్థినులను వేధించడం వంటి అసాంఘిక చర్యలను అరికట్టేందుకు విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో నిఘాను ముమ్మరం చేసి,అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను గుర్తించి కౌన్సెలింగ్ నిర్వహించారు.భవిష్యత్తులో ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.వాహనాలకు అధిక శబ్దం చేసే సైరన్లు,అనుమతి లేని హారన్లు అమర్చడంపై ప్రత్యేక తనిఖీలు చేపట్టి,మోటారు వాహనాల చట్టానికి విరుద్ధంగా వ్యవహరించే వారిపై కేసులు నమోదు చేయడంతో పాటు,అవసరమైతే డ్రైవింగ్ లైసెన్స్ రద్దుకు సిఫార్సు చేస్తామని సూచించారు.స్నేక్ డ్రైవింగ్,ర్యాష్ డ్రైవింగ్,నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి ప్రమాదకర చర్యలపై ప్రత్యేక నిఘా ఉంచి,వాహన తనిఖీలు నిర్వహించి ఉల్లంఘనలకు పాల్పడిన వారిపై చర్యలు చేపట్టారు.ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకొని రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు.విద్యార్థులు,యువత,వారి తల్లిదండ్రులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని,మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని,రహదారి భద్రతకు సహకరించాలని పోలీసు అధికారులు సూచించారు.విద్యాసంస్థల పరిసర ప్రాంతాల్లో సురక్షిత వాతావరణం కల్పించడం జిల్లా పోలీసుల ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని,భవిష్యత్తులో కూడా ఇటువంటి ప్రత్యేక తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.

## కోడిపందాలపై మెరుపు దాడి

గుంటూరు క్రైమ్,జూన్24,ప్రభాతవార్త: రహస్యంగా కోడిపందాలు నిర్వహిస్తున్న 12 మంది వ్యక్తులను టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకొని అరెస్టు చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుంటూరు జిల్లా పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని కొప్పురావూరు గ్రామంలో తిరుమలశెట్టి రాజశేఖర్‌కు చెందిన డైరీ ఫామ్ హౌస్ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో కోడిపందాలు



నిర్వహిస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు,డీఎస్‌బీ డీఎస్పీకి సమాచారం అందించి,గుంటూరు ఎస్పీ సీఐ2 ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్స్ సిబ్బంది,పెదకాకాని పోలీస్ స్టేషన్ సిబ్బంది సంయుక్తంగా బుధవారం మధ్యాహ్నం మెరుపు దాడి నిర్వహించారు. దాడిలో కోడిపందాలు నిర్వహిస్తున్న నిర్వాహకులు టి. రాజశేఖర్, కొప్పురావూరు,సందీప్,నంబూరు పోలీసులు సంఘటనా స్థలంలో దాడి నిర్వహించి పందెం కోడి పుంజులు 4,కోడి కత్తులు 33,12 మంది వ్యక్తులు,9 సెల్ ఫోన్లు,14 ద్విచక్ర వాహనాలు,3 కార్లు,రూ. 8,260 నగదును స్వాధీనం చేసుకున్నారు.నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం పెదకాకాని పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది.


## గాంధేయవాది వజ్రాల రామలింగాచారి కన్నుమూత

తెనాలి జూన్ 24 (ప్రభాతవార్త): మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమ నిర్వాహకులు, గాంధేయ సిద్ధాంతాల ప్రచారకులు వజ్రాల రామలింగాచారి (78) బుధవారం సాయంత్రం కన్నుమూశారు.కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన విజయవాడలోని మణిపాల్



ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సాయంత్రం 4 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారు.రామలింగాచారి గతంలో డాక్యుమెంట్ రైటర్‌గా సేవలందించి, అనంతరం సామాజిక సేవ వైపు మళ్లారు. గాంధేయ సిద్ధాంతాలను ప్రజల్లో విస్తరించేందుకు కృషి చేస్తూ మహాత్మా గాంధీ సేవా శాంతి ఆశ్రమం ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు.నిరాడంబర జీవనం, సేవా తత్వం, మానవీయ విలువలతో ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు.ఆయన మృతితో ఆశ్రమం ఒక మార్గదర్శకుడిని కోల్పోయిందని ఆశ్రమవాసులు, సామాజిక కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు.ఆయన పార్థివదేహాన్ని బుధవారం సాయంత్రం గాంధీ ఆశ్రమానికి తీసుకువచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు.గురువారం మధ్యాహ్నం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు ఆయన సోదరుడు వజ్రాల నాగరాజు తెలిపారు.రామలింగాచారి కి భార్య రత్నకుమారి, కుమార్తెలు లక్ష్మి, పుష్పవతి, వనజాక్షి పద్మిని ఉన్నారు. అల్లుళ్ల విజయభాస్కర్, శివయ్య, శ్యాంబాబు, సోదరుని కుమారుడు వజ్రాల విశ్వనాథ్‌తో పాటు కుటుంబ సభ్యులు, ఆశ్రమవాసులు ఆయన భౌతికంగా దూరమైనా ఆదర్శాలు చిరస్థాయిగా నిలిచిపోతాయని నివాళులర్పించారు.

## పరిశుభ్రమైన తాళ్లచెరువు కోసం మార్పు కోసం ఒక్క అడుగు.. టీం కృషి



అచ్చంపేట జూన్ 24 (ప్రభాత వార్త): అచ్చంపేట మండలం తాళ్లచెరువు గ్రామంలోని ఎస్సీ మాదిగపల్లెలో ప్రజారోగ్యం, పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇస్తూ "మార్పు కోసం ఒక్క అడుగు" టీం ఆధ్వర్యంలో ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో మురుగు నీరు నిల్వ ఉండి దోమలు, క్రిమికీటకాల వ్యాప్తికి అవకాశం ఉన్న ప్రాంతాల్లో, కాలువల పరిసరాల్లో పంచాయతీ కార్యదర్శి చొరవతో బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమాన్ని తాళ్లచెరువు గ్రామ టీడీపీ అధ్యక్షుడు గాదె ఇన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామ ప్రజలకు ఆరోగ్య పరిరక్షణ, పరిశుభ్రత ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తూ వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా "మార్పు కోసం ఒక్క అడుగు" టీం సభ్యులు మాట్లాడుతూ గ్రామ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్రజల సహకారంతో తాళ్లచెరువును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేదర రాఘవరాజు, దుగ్గి శ్రీనివాసరావు, మేదర అజయ్, రేపూడి అనిల్, చింతపల్లి అనిల్, కోటా సురేష్, చిలక ప్రశాంత్, చింతపల్లి జోసెఫ్ పాల్గొన్నారు. అలాగే బీజేపీ నాయకుడు బాలస్వామి, మాజీ సర్పంచ్ రేపూడి జోజి, గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## నిబంధనలకు విరుద్ధంగా పీజీ పరీక్షలు..!

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, జూన్24, ప్రభాతవార్త: ఏఎన్‌యు పరిధిలో పీజీ రెండవ సెమిస్టర్ పరీక్షలు జూలై 7న నిర్వహించడం నిబంధనలకు విరుద్ధమని వైఎస్ఆర్‌సిపి విద్యార్థి విభాగం వర్సిటీ ఇన్‌చార్జ్ డా.వంతగాని రమేష్ ఆరోపించారు. బుధవారం వర్సిటీ ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ జి.సింహాచలంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ పీజీ పరీక్షలు నిర్వహించాలంటే కనీసం 90రోజుల వర్కింగ్‌డేస్‌గా ఉండాలనే నిబంధన ఉందని దానిని



అనుసరించకుండ 70రోజుల లోపే పరీక్షలు నిర్వహించడం సరికాదన్నారు. చాలా కోర్సుల్లో సిలబస్ పూర్తికాలేదని విద్యార్థులు తమ దృష్టికి తీసుకొచ్చారని పేర్కొన్నారు. సిలబస్ పూర్తికాకుండా వర్సిటీ పరీక్షలు నిర్వహించడం సమంజసమేనా అని ప్రశ్నించారు. పరీక్షలు నిర్ణయాన్ని వాయిదా వేసి సిలబస్ పూర్తి చేసిన తరువాతనే పరీక్షలు నిర్వహించాలని సూచించారు. దీనిపై రిజిస్ట్రార్ స్పందిస్తూ తమకు కొంత సమయం కావాలని కోరినట్లు రమేష్ పేర్కొన్నారు.

**వర్సిటీ ప్రతిష్ట పెంచుతున్నాము: పీజీ కోఆర్డినేటర్**

పరీక్షల నిర్వహణపై వర్సిటీ ప్రతిష్ట పెంచుతున్నామని పీజీ పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేసవి సెలవులు అధికంగా ఇవ్వడం వల్ల సిలబస్ పూర్తికాలేదని తెలిసిందని వివరించారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పరీక్షల నిర్వహణ 10రోజులు వాయిదా వేసి జూలై 7నుంచి ప్రారంభంకావల్సిన పరీక్షలు జూలై 17 నుంచి నిర్వహిస్తామని తెలిపారు. వీసి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పరీక్షల నిర్వహణపై నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. సవరించిన షెడ్యూల్ ప్రకారం 90రోజులు సరిపోతుందన్నారు. కాగా తక్కువమంది విద్యార్థుల ఉంటే చేతిరాతతో ప్రశ్నాపత్రాలు ఇచ్చామన్నారు. సిలబస్‌లో లేని ప్రశ్నలపై పిర్యాదుల రాలేదని వివరించారు. పీజీ ప్రొఫెషనల్ పరీక్షల నిర్వహణపై సంస్కరణలు తీసుకొచ్చామని, పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామన్నారు. తమ విభాగంపై పనికట్టుకుని ఆరోపణలు చేయడం సరికాదని సుబ్బారావు స్పష్టంచేశారు.

## బిసిలను అగ్రపథాన నిలబెడతాం

### --రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత

సచివాలయం,జూన్ 24,ప్రభాతవార్త : సమాజంలో సగానికిపైగా ఉన్న బిసిలను రాజకీయ,ఆర్థిక,సామాజిక రంగాల్లో అగ్రపథాన నిలపడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర బిసి ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు.రూ.500కోట్ల సాస్కి నిధులతో ఎంజేపి గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించబోతున్నామని,కొత్తగా మరో 10బిసి గురుకులాలను ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.బిసి విద్యార్థులకు ఐఐటి,నీట్‌లో ప్రవేశానికి శిక్షణ పొందేలా రెండె ఎక్స్‌లెన్స్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.రూ.1000కోట్లతో ఆదరణ 3.0పథకాన్ని అమలు చేయబోతున్నామని,ఈ పథకం ద్వారా ఆధునిక పరికరాలు అందజేసి,బీసీలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దనున్నామని తెలిపారు.బిసి రక్షణ చట్టానికి తుది రూపు ఇస్తున్నామని,దేశంలోనే మొట్టమొదటి సారిగా బీసీలకు ఆత్మగౌరవాన్ని నిలిపేలా చట్టాన్ని రూపొందిస్తున్నామని తెలిపారు.అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో బిసి,ఈడబ్ల్యూఎస్ సంక్షేమ శాఖలో రెండేళ్ళ ప్రగతిపై బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడారు.బిసీలు సమాజానికి బ్యాక్ బోన్లు అని సీఎం చంద్రబాబు నాయుడు నమ్మారన్నారు.సమాజంలో సగానికి పైగా ఉన్న బిసీల అభ్యున్నతే లక్ష్యంగా అనేక పథకాలను,అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రవేశపెట్టిన మొదటి బడ్జెట్‌లో రూ.39వేల కోట్లు,రెండో బడ్జెట్‌లో రూ.47వేల కోట్లు,మూడో బడ్జెట్‌లో రూ.51వేల కోట్లు కేటాయించామన్నారు.ఇది కూటమి ప్రభుత్వానికి బిసిల పట్ల ఉన్న త్తశుద్ధికి నిదర్శనమన్నారు.

**--గురుకులాలతో బీసీలకు అత్యున్నత విద్య**

ప్రస్తుతం రాష్ట్రంలో 109బిసి గురుకులాల ఉన్నాయని,కొత్తగా మరో 10గురుకులాలను ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి తెలిపారు.రూ.500కోట్ల సాస్కి నిధులతో ఎంజేపి గురుకులాలకు శాశ్వత భవనాలు నిర్మించనున్నట్లు తెలిపారు.పదో తరగతి తర్వాత డ్రాప్ ఔట్లను నిరోధించడానికి 6బాలికల గురుకుల పాఠశాలలను జూనియర్ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామన్నారు.వీటిలో 960మంది విద్యార్థినులకు ఉన్నత చదువులు చదువుకునే అవకాశం కలుగుతుందన్నారు.

**--బిసి కార్పొరేషన్ ద్వారా రూ.32కోట్ల వ్యయం**

వివిధ పథకాల కింద బిసి కార్పొరేషన్ ద్వారా రెండేళ్ళలో 117.68లక్షల మంది బిసి లబ్దిదారులుకు రూ.32533.68కోట్లు అందజేశామని మంత్రి సవిత తెలిపారు.2014-19మధ్య 13జిల్లాస్థాయి కాపు భవనాలను,487మిని కాపు భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు.తర్వాత వచ్చిన జగన్ ప్రభుత్వం 13జిల్లాస్థాయి కాపు భవనాల్లో 9కాపు భవనాలను,487మిని కాపు భవనాలకు గాను 421మినీ కాపు భవనాలు రద్దుచేశారన్నారు.

**--తప్పులకు శిక్ష తప్పదు**

గత ప్రభుత్వంలో జరిగిన తప్పులకు అక్రమాలకు శిక్ష తప్పదని మంత్రి సవిత స్పష్టంచేశారు.వైసీపీ నాయకులెన్నీ రాజకీయ డ్రామాలు ఆడినా,కులాల మధ్య చిచ్చుపెట్టాలని చూస్తున్నా,చట్టం తనపని చేసుకుపోతుందన్నారు.నా బిసీలు అంటూ అధికారంలోనికి వచ్చిన జగన్ రాష్ట్రంలో వెనుకబడిన కులాలను ఉక్కుపాదంతో అణచివేశారని మండిపడ్డారు.బిసీలపై అక్రమ కేసులు బనాయించారని,ప్రస్తుత అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు,తనతో సహా మంత్రులు అచ్చెన్నాయుడు,కొల్లు రవీంద్రతో పాటు సామాన్య బిసి కార్యకర్తలపైనా అక్రమ కేసులు బనాయించారని తెలిపారు.పల్నాడు జిల్లాలో తోట చంద్రయ్య,బాపట్లలో అమర్‌నాథ్ గౌడ్ వంటి పలువురు బిసీలను దారుణంగా హత్యచేశారని మంత్రి సవిత తెలిపారు.

## రైతన్నా మీకోసం...లో ఎపిఎఐఎంఎస్ ద్వారా ఎరువుల పంపిణీ వివరాలు

### వెల్లడించిన రాజుపాలెం మండల వ్యవసాయ అధికారి వెంకట నర్సయ్య

రాజుపాలెం, జూన్ 24, ప్రభాతవార్త: మండలంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో రాజుపాలెం మండల వ్యవసాయ అధికారి (ఏఓ) పి. వెంకట నర్సయ్య గారు పాల్గొని, రైతులకు పలు కీలక సూచనలు చేశారు. వ్యవసాయ రంగంలో పారదర్శకతను పెంచేందుకు మరియు ఎరువుల బ్లాక్ మార్కెటింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అగ్రికల్చర్ ప్రొడ్యూస్ అండ్ ఇన్‌పుట్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (ఏపిఏఐఎంఎస్) విధానాన్ని మండలంలో పక్కాగా అమలు చేస్తున్నట్లు ఆయన ఈ కార్యక్రమంలో రైతులకు వివరించారు. ఖరీఫ్‌రైతన్నా మీకోసం కార్యక్రమంలో వెల్లడించిన ముఖ్య అంశాలు:..కౌలు రైతులకు ముఖ్య గమనిక:.. కౌలు రైతులు కూడా తప్పనిసరిగా తాము సాగు చేసే పంట వివరాలను స్థానిక రైతు సేవా కేంద్రంలో (ఆర్ఎస్‌కె) నమోదు చేయించుకోవాలని స్పష్టం చేశారు.



..యాప్‌లో నమోదు తప్పనిసరి:.. రైతులు ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో యూరియా మరియు డీఏపీ (డిఏపి) కొనుగోలు చేయాలన్నా.. ఖచ్చితంగా ఏపిఏఐఎంఎస్ యాప్‌లో నమోదు అయి ఉండాలి. ..రైతు సేవా కేంద్రాల ద్వారా పర్యవేక్షణ:.. మండలంలోని రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువుల నిల్వలను పర్యవేక్షిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా నిరంతరం సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాము. ..భూమి ఆధారంగానే ఎరువులు:.. రైతుల భూ విస్తీర్ణం, వారు సాగు చేసే పంటల ఆధారంగా శాస్త్రీయంగా ఎంత ఎరువు అవసరమో, అంత మాత్రమే ఈ యాప్ ద్వారా కేటాయిస్తారు. ..వెబ్‌ల్యాండ్ అనుసంధానం:.. రైతుల ఆధార్ నంబర్ నమోదు చేయగానే వెబ్‌ల్యాండ్ డేటా ఆధారంగా వారి భూమి వివరాలు డిజిటల్ స్క్రీన్‌పై కనిపిస్తాయి. దీనివల్ల నకిలీ కొనుగోళ్లకు తావుండదు. ..అక్రమ నిల్వలకు చెక్:.. ఈ విధానం వల్ల ఎరువుల అక్రమ రవాణా, నిల్వలు మరియు కృత్రిమ కొరతను అరికట్టడమే ప్రధాన లక్ష్యం. మండల వ్యవసాయ అధికారి సూచన:..రాజుపాలెం మండలంలోని రైతులు మరియు కౌలు రైతులందరూ తమ ఈక్రాప్ బుకింగ్ పూర్తి చేసుకోవాలని, ఆధార్ వివరాలను యాప్‌లో నమోదు చేసుకుని, తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాల ద్వారా పారదర్శకంగా ఎరువులు పొంది, ఈ డిజిటల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పి. వెంకట నర్సయ్య ఈ కార్యక్రమం ద్వారా కోరారు.

## పొంచి ఉన్న ప్రమాదం నీట మునిగిపోబోతున్న ట్రాన్స్‌ఫార్మర్

రాజుపాలెం, జూన్ 24, ప్రభాతవార్త: మండల కేంద్రమైన రాజుపాలెం బ్రాహ్మణపల్లి వెళ్లే మార్గమధ్యంలో ఒక పెద్ద ట్రాన్స్‌ఫార్మర్ 11.2006న నిర్మించడం జరిగినది, ఆ ట్రాన్స్‌ఫార్మర్ లైను రాజుపాలెం నుంచి బ్రాహ్మణపల్లి నాగవరం ఇనిమెట్ల వరకు సరఫరా అవుతున్న ట్రాన్స్‌ఫార్మర్ పెద్ద ప్రమాదానికి గురి కాబోతున్నట్లు అటు వెళుతున్న ప్రజలు,ఈ రాజుపాలెం నుండి, బ్రాహ్మణపల్లి కి వెళ్లే ప్రయాణికులు ఆప్రాంతంలో పంట పొలాలు పండించే రైతులు సమాచారం ప్రభాతవార్త కి తెలియజేశారు. ముఖ్యంగా ఆ ట్రాన్స్‌ఫార్మర్ కింద పంట పొలాలు వెళ్లే ఎప్పుడు



ప్రమాదానికి చిన్న కాలువ ట్రాన్స్‌ఫార్మర్ పై ఎత్తున కడిగిపెయిన బ్రాహ్మణపల్లి నాగవరం మొక్కపాడు రెడ్డిగూడెం వెళ్లే మార్గమధ్యంలో ఇటువంటి ట్రాన్స్‌ఫార్మర్ ఈ విధంగా పాడైపోతే ఎంతో ప్రమాదకరమని అక్కడ రైతులు ప్రజలు భయబ్రాంతులకు గురవుతున్నారు మరియు ముఖ్యంగా ఈ మార్గంలో చిన్నపిల్లల స్కూల్ బస్సులు ప్రతిరోజు వెళుతూనే ఉన్నాయి ఏ టైంలో ఏం జరుగుతుందోనని వారి తల్లిదండ్రులు చాలా భయపడుతున్నారు, అసలే వర్షాకాలం కురుస్తున్న వానలకు ఏ టైంలో ఏం జరుగుతుందోనని పిల్లల తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఆ ట్రాన్స్‌ఫార్మర్ కు కట్టిన సిమెంట్ గోడలు పూర్తిగా పాడైపోయింది ఆ గోడ ఎప్పుడు కుప్పకూలిపోయిద్దో తెలియని స్థితిలో అది ఉండటంతో చాలా భయంకరంగా ఉంది ఇకనైనా జిల్లాస్థాయి అధికారులు దాన్ని పరిశీలించి దాన్ని పూర్తిగా తొలగించి కొత్తగా నిర్మించాలని అక్కడ పంట పొలాలు వేస్తున్న రైతులు అటువైపు ప్రయాణం చేస్తున్నా ప్రయాణికులు స్కూల్ పిల్లల తల్లిదండ్రులు, ఆ పనిని త్వరగా చేయించవలసినదిగా జిల్లా స్థాయి అధికారులను కోరుతున్నారు.

## కల్లు గీత కార్మికుడిపై కత్తితో దాడి

చిలకలూరిపేట, జూన్ 24, ప్రభాతవార్త: చిలకలూరిపేటలోని చెరువు సమీపంలో ఉన్న కల్లు చెట్ల వద్ద బుధవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల మధ్య తలెత్తిన వివాదం తీవ్రరూపం దాల్చి హత్యాయత్నానికి దారితీసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కల్లుగీత



కార్మికుడిగా పనిచేస్తున్న పోతులూరి రవిబాబుపై అతని సొంత బాబాయి కుమారుడైన పోతులూరి ఆంజనేయులు కత్తితో విచక్షణారహితంగా దాడి చేశాడు. కల్లు చెట్ల వద్ద ఇరువురి మధ్య మొదలైన వాగ్వాదం పెద్దది కావడంతో ఈ ఘర్షణ చోటుచేసుకుంది. ఈ దాడిలో రవిబాబు తల, నడుము, చేతులపై తీవ్రమైన కత్తి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావం కావడంతో బాధితుడి పరిస్థితి విషమంగా మారగా, వెంటనే ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం చిలకలూరిపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఏకాయేకిన జరిగిన ఘర్షణ కాకుండా, ఈ దాడికి నిందితుడు ముందు రోజే పక్కా ప్రణాళిక రచించి, బుధవారం అదను చూసి అమలు చేశాడని బాధిత కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఘటన అనంతరం నిందితుడు ఆంజనేయులు అక్కడినుంచి పరారయ్యాడు.

## నిజాయితీకి నిదర్శనం: ఆటోలో మర్చిపోయిన సెల్ ఫోన్‌ను యజమానికి అప్పగించిన ఆటో యూనియన్ ప్రెసిడెంట్

చిలకలూరిపేట, జూన్ 24, ప్రభాతవార్త: చిలకలూరిపేట, జూన్ 24: మానవత్వం ఇంకా బతికే ఉందని చిలకలూరిపేట ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజు నిరూపించారు. ఆటోలో ప్రయాణిస్తూ ప్రయాణికుడు మరచిపోయిన సెల్ ఫోన్‌ను ఎంతో నిజాయితీగా పోలీసులకు అప్పగించి, తిరిగి బాధితుడికి అందేలా చూశారు.సంఘటన వివరాలిలా ఉన్నాయి: నాదెండ్లకు చెందిన కంభంపాటి సురేష్ అనే వ్యక్తి బుధవారం చిలకలూరిపేట పట్టణంలోని ఎన్.ఆర్.టి సెంటర్ వద్ద ఆటోలో ప్రయాణించారు. ప్రయాణం



ముగిసిన అనంతరం పొరపాటున తన సెల్ ఫోన్‌ను ఆటోలోనే మరచిపోయారు. ఆటో దిగిన తర్వాత ఫోన్ లేదని గుర్తించిన సురేష్ ఆందోళన చెందారు.అయితే, ఆటోలో ఉన్న సెల్ ఫోన్‌ను గమనించిన ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజు, దానిని తన వద్ద ఉంచుకోకుండా వెంటనే స్థానిక పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న సిఐ సెల్ ఫోన్‌ను బాధితుడికి అప్ప గించాల్సిందిగా ఎస్ఐ సోమేశ్వరరావును ఆదేశించారు. దీనితో ఎస్ఐ సోమేశ్వరరావు సమక్షంలో, ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజు స్వయంగా సెల్ ఫోన్‌ను బాధితుడు కంభంపాటి సురేష్‌కు అందజేశారు. తన ఫోన్ తనకు తిరిగి దక్కడంతో బాధితుడు సురేష్ ఆనందం వ్యక్తం చేస్తూ, నిజాయితీని ప్రదర్శించిన ఆటో యూనియన్ ప్రెసిడెంట్ రాజును మరియు సకాలంలో స్పందించిన పోలీసు సిబ్బందిని అభినందించారు .

## డాక్టర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ భవన్‌ల సాధనలో అడపా మోహన్ మాదిగ కృషి

### -భూకేటాయింపునకు అధికారుల ఆదేశాలు

చిలకలూరిపేట, జూన్ 24, ప్రభాతవార్త: పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మరియు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ భవన్ల నిర్మాణానికి గాను ఒక ఎకరం ప్రభుత్వ



భూమిని కేటాయించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు అడపా మోహన్ మాదిగ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన చేసిన ఈ వినతిపత్రంపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బి. లావణ్య వేణి స్పందించారు. నరసరావుపేటలో ఈ భవనాల నిర్మాణం కోసం భూమిని కేటాయించే అంశాన్ని ఖిప్రభుత్వ భూ కేటాయింపు విధానంఖి (జిఓఎంఎస్ నెం. 571) ప్రకారం పరిశీలించి, తగిన తదుపరి చర్యలు తీసుకోవాలని పల్నాడు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా మేజిస్ట్రేట్ కు జూన్ 16, 2026 తేదీన ఆమె అధికారిక లేఖ ద్వారా ఆదేశాలు జారీ చేశారు. దళిత మహనీయుల భవనాల సాధన కోసం అడపా మోహన్ మాదిగ పట్టుదలతో తీసుకున్న ఈ చొరవతో భూ కేటాయింపు ప్రక్రియ ఒక అడుగు ముందుకు పడింది.

## ప్రతిష్టాత్మకంగా ఓటర్ సమగ్ర సర్వే ప్రక్రియ

### అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు : యూనిట్ ఇంచార్జ్ అబ్దుల్ మజీద్

చిలకలూరిపేట, జూన్ 24, ప్రభాతవార్త: చిలకలూరిపేట: మాజీమంత్రి స్థానిక శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియను తెలుగుదేశం పార్టీ బూత్ కన్వీనర్లు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారని టిడిపి నాయకులు యూనిట్ ఇంచార్జ్ అబ్దుల్ మజీద్ పేర్కొన్నారు, మంగళవారం నాడు తెలుగుదేశం పార్టీ నాయకులు యూనిట్ ఇంచార్జ్ షేక్ అబ్దుల్ మజీద్,కో యూనిట్ ఇంచార్జ్ షేక్ మజారుద్దీన్ పట్టణంలోని 10,11 వార్డుల పరిధిలో జరుగుతున్న శీ.శి కార్యక్రమంలో పాల్గొన్నారు, ఈ సందర్భంగా అబ్దుల్ మజీద్ మాట్లాడుతూ మన శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు గారి ఆదేశాల మేరకు పట్టణంలో జరుగుతున్న ఓటర్ సమగ్ర సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా పరిశీలన, మార్పులుచేర్పులపై బూత్ కన్వీనర్లు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్నారని అన్నారు,ప్రతి



బూత్ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా బూత్ కన్వీనర్లు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల వివరాలు ఏ విధంగా నమోదు చేయాలో అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు, అనంతరం బి ఎల్ ఏ లను సర్వే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు ఓటర్ లిస్ట్ క్షుణ్ణంగా పరిశీలించి అర్హత లేని ఓట్లు,డబల్ ఎంట్రీలు ఉంటే బి ఎల్ ఓ ల దృష్టికి తీసుకువెళ్లి తొలగించాలని అలాగే గతంలో చనిపోయిన వ్యక్తుల ఓట్లను కూడా తొలగించాలని 18 సంవత్సరాల నిండిన యువతీ యువకులకు కొత్త ఓటు నమోదు చేసుకునే విధంగా చొరవ తీసుకోవాలని పోలింగ్ బూత్ ఏజెంట్లకు సూచించారు, శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు ఆదేశాల మేరకు పట్టణంలో జరుగుతున్న సమగ్ర ఓటర్ సర్వే కార్యక్రమాన్ని వివిధ హోదాలలో ఉన్న పార్టీ నాయకులు పర్యవేక్షిస్తున్నామన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోని టీడీపీ బూత్ ఏజెంట్లు బిఎల్ఓ లతో కలిసి ఇంటింటికి తిరుగుతూ ఎనిమిరేషన్ పారాలను పంపిణీ చేస్తున్నారు అన్నారు. ఈ కార్యక్రమంలో కో యూనిట్ ఇంచార్జ్ షేక్ మజారుద్దీన్,10 వవార్డు సెక్రటరీ షేక్ దరియా వలి, బూత్ కన్వీనర్ అబ్దుల్ రెహమాన్,బూత్ కన్వీనర్ షేక్ కరిముల్లా.11 వ వార్డు సెక్రటరీ పఠాన్ సుభాని, బూత్ కన్వీనర్ బాజీ , ఐ టీడీపీ నాయకులు మహమ్మద్ రఫీ,షేక్ సాదిక్, 10 11 వార్డుల పరిధిలో బిఎల్ వో లు తదితరులు పాల్గొన్నారు

## ఆయిల్‌పామ్ తోటలను పరిశీలించిన ఉద్యాన, పట్టుపరిశ్రమల శాఖ డైరెక్టర్

చిలకలూరిపేట, జూన్ 24, ప్రభాతవార్త: ఉద్యాన మరియు పట్టు పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు పల్నాడు జిల్లా, నాదెండ్ల మండలంలోని నాదెండ్ల గ్రామంలో మిర్చి షేడ్‌నెట్ నర్సరీలను మరియు ఆయిల్ పామ్ తోటలను సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు మరియు రైతులకు మిర్చి పంట యాజమాన్య పద్ధతులపై పలు సూచనలు చేశారు. గతేడాది తో



పోలిస్తే ఈ ఏడాది మిర్చి సాగుకు రైతులు మొగ్గు చూపుతున్నారు. రైతులు పండించిన మిర్చి పంటలో పురుగు మందుల అవశేషాలు ఎక్కువగా కనిపిస్తునావి గనుక రైతులు పురుగు నందులు ఎక్కువగా కొట్టకుండా నాచురల్ ఫామింగ్ పద్ధతిలో మిర్చి పంటను సాగు చేయాలని రైతులకు సూచించడం జరిగింది. మిర్చి సాగుకు ముందు తప్పనిసరిగా కిట్లను వినియోగించాలని సూచించారు. మిర్చి నర్సరీ పెంపకంలో తిశిదివినీ (ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్) విధానాలను అవలంబించాలని రైతులకు తెలియజేశారు. మిర్చి పొలాల్లో రసాయన ఎరువులు మరియు పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, జీవ మరియు యాంత్రిక నియంత్రణ పద్ధతులను అనుసరించాలని సూచించారు.అదేవిధంగా, రసాయన మందుల పిచికారీల మధ్య విరామ కాలాన్ని పెంచాలని, ప్రతి గ్రామం నుండి కనీసం ఐదుగురు రైతులను తిశిదివినీ పద్ధతులను అవలంబించేలా ప్రోత్సహించాలని సూచించారు.ఆయిల్ పామ్ తోటలలో సూక్ష్మ పోషకాల లోపాలను నివారించేందుకు మెగ్నీషియం సల్ఫేట్ మరియు బోరాన్ వంటి సూక్ష్మ పోషకాలను సకాలంలో అందించాలని రైతులకు సూచించారు. జిల్లా ఉద్యాన అధికారి ఐ వెంకట్రావు , హార్టికల్చర్ ఆఫీసర్ చిలకలూరిపేట శ్రీ లక్ష్మి మండల రైతు అధ్యక్షులు యనమదల సూర్యనారాయణ , రైతు సేవ కేంద్ర సిబ్బంది, గోద్రెజ్ కంపెనీ ఆయిల్ ఫామ్స్ సిబ్బంది ,నాదెండ్ల గ్రామ రైతులు పాల్గొన్నారు.

## క్రీడారంగంలో విప్లవాత్మక మార్పులు : మంత్రి మండిపల్లి

సచివాలయం,జూన్ 24,ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ళలో ఆంధ్రప్రదేశ్ క్రీడారంగంలో గణనీయమైన మార్పులు తీసుకొచ్చామని రాష్ట్ర యువజన,క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు.రెండేళ్ళ సుపరిపాలన సందర్భంగా నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మార్గదర్శకత్వంలో క్రీడాకారులకు ప్రోత్సాహం,మౌలిక వసతుల కల్పన,ఉద్యోగ అవకాశాల విస్తరణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని మంత్రి తెలిపారు.విజయనగరం డిఎస్ఏ స్టేడియాన్ని రూ.6కోట్లతో మల్టిపర్పస్ ఇండోర్ స్టేడియంగా అభివృద్ధి చేసి ప్రారంభించామని,తిరుపతిలోని శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రూ.5.7కోట్లతో మల్టిపర్పస్ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను పూర్తి చేశామని వెల్లడించారు.కేంద్రం ఖేలో ఇండియా పథకం కింద రాష్ట్రానికి రూ.75కోట్ల నిధులు మంజూరు చేసిందని,వాటితో విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రూ.19కోట్లతో 400మీటర్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్,ఆర్టిఫిషియల్ గ్రాస్ ఫుట్‌బాల్ ఫీల్డ్,టెన్నిస్,బాస్కెట్‌బాల్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు."ఆడుదాం ఆంధ్ర కార్యక్రమానికి సంబంధించిన అంశాలపై కూడా మంత్రి స్పందించారు.దీనికి సంబంధించిన నివేదిక దాదాపు సిద్ధమైందని,త్వరలో ముఖ్యమంత్రి వద్దకు వెళ్లనున్నదని చెప్పారు.4,5రోజుల్లో ప్రభుత్వం ఆ నివేదికను బహిర్గతం చేసే అవకాశం ఉందని వెల్లడించారు.క్రీడా సర్టిఫికేట్ల జారి వ్యవస్థలో పారదర్శకత,ప్రామాణికత కోసం అథెంటికేషన్ విధానాన్ని బలోపేతం చేయనున్నట్లు తెలిపారు.
గ్రామీణ స్థాయి నుండి అంతర్జాతీయ స్థాయి వరకు క్రీడాకారులను తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్ర మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు.సీఎం చంద్రబాబు నాయుడు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఆయన స్పష్టంచేశారు.

## సైడ్ ఎఫెక్ట్స్‌లేని శారీరక వైద్యమే ఫిజియోథెరఫీ

గుంటూరు కల్చరల్,జూన్ 24,ప్రభాతవార్త : ఫిజియోథెరపి ఒక శారీరక చికిత్స మాత్రమేనని,ఇందులో ఎలాంటి మందుల ప్రమేయం ఉండదని,ఏదేని అనారోగ్యం లేదా గాయం తర్వాత శరీరం తిరిగి మాములై రోగి తన విధులను సక్రమంగా చేసుకునేలా చేయగలిగేది ఫిజియోథెరపీ అని అవగాహన సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఆరోగ్యసభలో సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ ఎం.లక్ష్మీ లావణ్య మాట్లాడుతూ అన్నారు.సంస్థ కార్యాలయంలో "నొప్పుల నివారణ ఫిజియోథెరపీ పాత్ర"అనే అంశంపై ఆరోగ్యసభ జరిగింది.ఆరోగ్యసభలో డాక్టర్ లావణ్య మాట్లాడుతూ నాడీ వ్యవస్థ లోపాలు,కండరాల లోపాలు,శ్వాసకోశ రుగ్మతలు,గుండె సంబంధిత వ్యాధి తదితర సమస్యలు ఉన్నప్పుడు ఫిజియోథెరఫీ బాగా ఉపకరిస్తుందన్నారు.సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ లావణ్య చిరోప్రాక్టిక్ సర్దుబాటు కైరో ప్రాక్టిక్ చికిత్సలను అద్భుతంగా అందిస్తూ అన్ని రకాల నొప్పుల నుండి విముక్తి కలిగిస్తూ అందరి అభిమానం పొందుతున్నారన్నారు.ఆరోగ్యసభలో విస్తృతంగా ఫిజియోథెరపీ సేవలందిస్తూ అందరి అభిమానం పొందుతున్న డాక్టర్ లక్ష్మీ లావణ్యను అవగాహన సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు.సభలో అనవేమా ట్రస్ట్ అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి,యోగాచార్యులు అచ్యుత ఇందుశేఖర్,,సీనియర్ వైద్యులు డాక్టర్ రవీంద్రకుమార్,తదితరులు ప్రసంగించారు.

## సంగీత సాధన ఓ దివ్య తపస్సు

గుంటూరు కల్చరల్,జూన్ 24,ప్రభాతవార్త : సంగీత సాధన ఓ దివ్య తపస్సు వంటిదని,సంగీత సాధనలో ఈదిన వారికి శారీరక,మానసిక,భావోద్వేగ,ఆధ్యాత్మిక సామాజిక సమతుల్యత సిద్ధిస్తుందని అవగాహన మనమూ పాడుదాం రండి బృంద సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ సంగీత దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న సంగీత విద్వాంసులు,గాయకులు మాట్లాడుతూ అన్నారు.కార్యక్రమంలో సంగీత విద్వాంసులు గాయకులు పిఎస్ మూర్తి మాట్లాడుతూ సంగీత సాధన ద్వారా ఏకాగ్రత,మనోవికాసం పెరుగుతాయన్నారు.సంగీతం ఒక విశ్వభాష అని,సంగీతానికి పేద,ధనిక,కుల,మత,ప్రాంత సరిహద్దులు వర్గ విపక్షాలు,భాషా బేదాలు ఉండవన్నారు.సంగీత విద్వాంసులు విఎస్ఎస్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ కష్టాల నుండి సుఖాలకు,మానసిక ఒత్తిడి నుండి ప్రశాంతత వైపుకు చీకటి నుండి వెలుతురు వైపు నడిపించే పవిత్ర మాధ్యమమే సంగీతం అన్నారు.1982నుంచి ప్రతి ఏడాది జూన్ నెలలో ప్రపంచ సంగీత దినోత్సవం నిర్వహిస్తున్నారన్నారు.కార్యక్రమంలో గాయనీ గాయకులు వై.లక్ష్మీ,రాజశేఖర్,సాయిబాబులు మంచి సంగీత ప్రధానమైన గీతాలు ఆలాపించారు.

గుంటూరు కల్చరల్,జూన్ 24,ప్రభాతవార్త : కాలిబాటలపై నడవటాన్ని పౌరుల ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు ఇటీవల ప్రకటించటాన్ని అవగాహన సంస్థ హర్షం ప్రకటిస్తుంది.రోడ్డంటూ ఉంటే నడిచే వాళ్ళకి ప్రత్యేకించి బాట చూపటాన్ని ఒక విధిగా పాటించాలని పట్టణాభివృద్ధి సంస్థల,పురపాలక సంస్థల,పంచాయితీలకు సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందని పాదాచారుల హక్కులకు సంబంధించి ఒక భారతీయ కోర్టు ఇలా నిర్ద్వంద్వంగా పేర్కొన్న తీర్పు ఇదేనని అవగాహన సంస్థ హర్షం ప్రకటిస్తుంది.కాలి బాటలను మెరుగుపరిచ నడక వసతులను కల్పిస్తే ప్రజారోగ్యం మెరుగు పడటమే కాకుండా పౌరుల ధనం ఆదా అవుతుందని,శరీరాన్ని చురుగ్గా ఉత్తమమార్గమైన నడకను ప్రొత్సహించే విధానాలు ప్రభుత్వాలు ఆచరించాలని అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

## ఘనంగా ముగిసిన శ్రీ పోలేరమ్మ అమ్మవారి కొలుపులు

యడ్లపాడు, జూన్ 24, ప్రభాతవార్త : మండలంలోని వంకాయలపాడులో గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న శ్రీపోలేరమ్మతల్లి కొలుపుల మహోత్సవం బుధవారం ఘనంగా ముగిసింది. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారాలను అనుసరించి డప్పు వాయిద్యాలతో గ్రామదేవతలను ఊరేగింపు నిర్వహించారు. గ్రామ పొలిమేరల వద్ద పూజలు చేశారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణ గావించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా



సమర్పించారు. గ్రామంలో అధ్యాత్మిక శోభ నెలకొంది. భారీ అన్నసంతర్పణ చేశారు. గ్రామపెద్దలు కార్యక్రమాలను పర్యవేక్షి ంచారు.

## లకలూరిపేటలో ప్రజానాట్యమండలి ద్వితీయ మహాసభలు

యడ్లపాడు, జూన్ 24, ప్రభాతవార్త : వీధినాటకాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలతో కళా వైభవం కళాకారులు, విద్యార్థులతో జులై 5,6 తేదీల్లో కళక సినీరంగ ప్రముఖులు గుమ్మడి గోపాలకృష్ణ, శివాజీ, బొర్రా సాయిమాధవ్, దర్శకుడు వి సముద్ర, తెలుగు నాటకరంగ రచయిత, సాహితీవేత్త



డాక్టర్ కందిమళ్ల సాంబశివరావులకు ఘన సత్కారకళ కళకోసం కాదు.. ప్రగతి కోసం! మెప్పు కాదు మార్పు కావాలి.. రేపటి కోసం అనే లక్ష్యంతో పల్నాడు జిల్లా ప్రజానాట్యమండలి ద్వితీయ మహా సభలను జూలై 5, 6 తేదీలలో చిలకలూరిపేటలోని ఎన్‌వీ(నన్నపనేని వెంకటరత్నం)కన్వెన్షన్‌లో నిర్వహించనున్నట్లు ఆహ్వాన కమిటీ అధ్యక్షులు, వేదిక(తెలుగు నాటక పరిషత్తుల సమ్మేళన సంఘం) అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. యడ్లపాడులోని వేదిక సంస్థ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి టి పెద్దిరాజు, రాష్ట్ర రైతుసంఘ నాయకులు వై రాధాకృష్ణ తో కలిసి వివరాలను వెల్లడించారు. జిల్లా నలుమూలల నుంచి కళాకారులు, కళాభిమానులు, వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులు భారీ సంఖ్యలో ఈ మహాసభల్లో పాల్గొననున్నారని చెప్పారు. సాంప్రదాయ, జానపద కళారూపాలకు వేదికగా నిలిచే ఈ మహాసభల్లో వీధినాటకాలు, నృత్య ప్రదర్శనలు, కోలాటాలు, డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని తెలిపారు. రెండురోజుల పాటు చిలకలూరిపేట కళా సంబరాలతో కళకళలాడనుందని పేర్కొన్నారు. ఈ మహాసభలకు ఏపీ సాంస్కృతిక తెలుగు అకాడమీ చైర్మన్, నేషనల్ సామాజిక సాంస్కృతిక నాటక అవార్డు గ్రహీత గుమ్మడి గోపాలకృష్ణకు, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తెలుగు సాంస్కృతిక నాటకరంగ అభివృద్ధి కమిటీ డైరెక్టర్లుగా ఇటీవల నియమితులైన సినీహీరో శొంఠినేని శివాజీ, ప్రముఖ సినీ కథారచయిత బొర్రా సాయిమాధవ్, ప్రముఖ దర్శకుడు వి సముద్ర, తెలుగు నాటకరంగ రచయిత, సాహితీవేత్త డాక్టర్ కందిమళ్ల సాంబశివరావులకు ప్రజానాట్యమండలి వేదిక తెలుగు నాటకరంగ పరిషత్తుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఘనసత్కారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు, రాజ్యసభ సభ్యులు భాష్యం రామకృష్ణ, మాజీఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రజానాట్యమండలి రాష్ట్రనాయకులు, వేదిక కార్యవర్గ సభ్యులు హాజరుకానున్నట్లు వెల్లడించారు. మహాసభ ఆహ్వాన కమిటీ సభ్యులుగా అధ్యక్షులు డాక్టర్ కొల్లా అమర్, అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి తాళ్లూరి పెద్దిరాజు, కోశాధికారి ఎంవీ శివయ్య, ఉపాధ్యక్షులు ముత్తవరపు రామారావు, పోపూరి నాగేశ్వరరావు, గుదె పాండురంగారావు, ముత్తరపు పద్మారావు, జరుగుల శంకరరావు, తోకల కోటేశ్వరరావు, నంబూరి శ్రీనివాసరావు, కె శ్రీనివాసరెడ్డి, నల్లమోతు రఘురామయ్య, టి ప్రతాపరెడ్డి, దార్ల బుజ్జిబాబు, స్నేహలత, షేక్ ఫైరోజ్, పి శ్రీనివాసరావు, చాగంటి అమరమ్మ, నల్లమోతు జగన్నాథమ్మ వ్యవహరిస్తారన్నారు. సమావేశంలో సీపీఎం రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి వై రాధాకృష్ణ, ముత్తవరపు పద్మారావు, తాళ్లూరి పెద్దిరాజు వేదిక, ప్రజానాట్యమండలి ఆహ్వాన కమిటీ, కళాకారులు పాల్గొన్నారు.

## పత్యేక అవసరాల చిన్నారులకు ట్రైసైకిల్ పంపిణీ



యడ్లపాడు, జూన్ 24, ప్రభాతవార్త : యడ్లపాడు మండలం బోయపాలెం భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు కలిగిన 15 మంది దివ్యాంగ విద్యార్థులకు ఎంఈఓ ఆధ్వర్యంలో అత్యాధునిక ట్రై సైకిల్ సీపీ చైర్స్‌ఖి, ప్రత్యేక లెర్నింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండలంలో ఉన్న 160 మంది పిల్లలకు నాణ్యమైన విద్య, వైద్యం అందిస్తూ సమాజంలో భాగస్వాములను చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఐఈఆర్పీ సిబ్బంది తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ రాజేష్, ఐఈఆర్పీ సిబ్బంది సామ్రాజ్యం, ఖుథాబీ, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ సైబర్ క్రైం, పిల్లల భద్రత గురించి తెలుసుకోవాలి

నిజాంపట్నం, జూన్ 24, ప్రభాతవార్త: ప్రతి ఒక్కరూ సైబర్ క్రైం, పిల్లల భద్రత గురించి తెలుసుకోవాలని సిడిపిఓ అనసూయ అన్నారు. బుధవారం మండలంలోని గోకర్ణమఠం అంగన్‌వాడీకేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మహిళలకు పోక్సో యాక్ట్, చిన్నపిల్లల వివాహాలు, పిల్లల భద్రత, బాధ్యత, సంక్షేమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లల కోసం డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం లీగల్ ఆఫీసర్ మౌనిక, ఒఆర్‌డబ్ల్యు సుస్మిత, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తదితరులు పాల్గొన్నారు.



## నేడు ప్రత్యేక పిజిఆర్ఎస్

రేపల్లె, జూన్ 24, ప్రభాతవార్త:పట్టణంలోని బి.వి.శేషగిరిరావు మినీ పంక్షన్ హాలులో గురువారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు స్పెషల్ పిజిఆర్ఎస్ కార్య క్రమం జరుగుతుంది.ప్రజల నుంచి బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ అర్జీలను స్వీకరిస్తారు.శుక్రవారం ప్రభుత్వ సెలవు కావడంతో పిజిఆర్ఎస్ కార్యక్రమాన్ని ముందు రోజుకు మార్చారు.రేపల్లె నియోజకవర్గ స్థాయిలో జరిగే కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేపల్లె ఆర్‌డీవో బి.శ్రీదేవి బుధవారం కోరారు.

## ఆర్టీసీ కార్మికుల ధర్నా

రేపల్లె, జూన్ 24, ప్రభాతవార్త:ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బుధవారం రాష్ట్ర ఎపి పిటిడి జెఏసి పిలుపు మేరకు రేపల్లె ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదుట ధర్నా చేశారు.కార్మికుల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు.ఈ కార్యక్రమంలో జెఏసి నాయకులు పి.కమలాకర్ రావు,ఆకురాతి రంగనాథ్,ఎన్.విద్యాసాగర్,జి.శ్రీనివాసరావు,సిపిఐ కార్యదర్శి కన్నెగంటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## జూలై 7న మాదిగల మహోత్సవం

రేపల్లె, జూన్ 24, ప్రభాతవార్త:ఈదుమూడులో జూలై 7వ తేదీ జరిగే మాదిగల మహోత్సవానికి సంబంధించిన పోస్టర్ను బుధవారం రేపల్లె నియోజకవర్గ మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి సమావేశంలో ఆవిష్కరించారు.ఎమ్మార్పీఎస్ జాతీయ సహాయ కార్యదర్శిగా దున్న రాబర్ట్‌ను ఎన్నుకుని ఘనంగా సన్మానించారు.జాతీయ అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో జరిగే మాదిగల మహోత్సవాన్ని జయప్రదం చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వేటుకూరి విజయ్‌కుమార్ మాదిగ,జిల్లా అధ్యక్షుడు కిన్నెర నాగరాజు,ఆలూరు బాబూజీ,ఆలూరు ఆదాము,రవి,పి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## నవోదయ విద్యాలయ పరీక్షల్లో విశ్వశాంతి విద్యార్థుల ప్రతిభ

రేపల్లె, జూన్ 24, ప్రభాతవార్త:నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షలలో భట్టిప్రోలులోని విశ్వశాంతి ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారని కరస్పాండెంట్ ఎం.పి.వెంకట్రావు బుధవారం తెలిపారు.6వ తరగతి ప్రవేశ పరీక్షలో మోహిత్, హర్షిత,9వ తరగతి ప్రవేశ పరీక్షలో మత్తి భవ్య పద్మరూపశ్రీ,మేక తక్షిత్‌లు అర్హత సాధించారని ఆయన వివరించారు.అత్యుత్తమ విద్యాప్రమాణాలు కలిగిన నవోదయ విద్యాలయంలో తమ విద్యార్థులకు సీట్లు లభించడం అభినందనీయమని చెప్పారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి వెంకటప్పయ్య,ప్రధానోపాధ్యాయుడు టి.ఫణిపార్థసారధి తదితరులు పాల్గొన్నారు.



## ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

రేపల్లె, జూన్ 24, ప్రభాతవార్త:ప్రతి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని ఎపిఎం శ్రీమన్నారాయణ అన్నారు.బుధవారం భట్టిప్రోలులో మండల సమాఖ్య కార్యనిర్వాహక సభ్యులు,యానిమేటర్లు,సిసిలకు వార్షిక ఆర్థిక ప్రణాళికపై విజన్ బిల్డింగ్ మండల సమాఖ్య కోశాధికారి కె.జ్యోతి అధ్యక్షతన శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ విద్య,వైద్యం,ఆరోగ్యం,వ్యవసాయం,సామాజిక భద్రత,ఆస్తుల సృష్టి,ప్రవర్తనలో మార్పు,సుస్థిర జీవనోపాధి,సామర్థ్యాల పెంపు తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో హనోక్,రజినికుమారి,నరేంద్ర,సాంబశివారెడ్డి,శిరీష తదితరులు పాల్గొన్నారు.




## హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రేపల్లె, జూన్ 24, ప్రభాతవార్త:రాష్ట్ర పౌర సరఫరాల హమాలీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బాపట్ల జిల్లా ఎఐటియుసి యూనియన్ సీనియర్ నాయకుడు కన్నెగంటి రమేష్‌బాబు డిమాండ్ చేశారు.బుధవారం పట్టణంలోని సివిల్ సప్లయిస్ కార్యాలయం వద్ద హమాలీ కార్మికులు ధర్నా చేశారు.ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ ప్రతి నెల 10వ తేదీలోపు ఎత్తుడు,దింపుడు బిల్లులను ఎంఎల్ఎస్ పాయింట్లకు మంజూరు చేయాలన్నారు.జిల్లాలోని బాపట్ల,చీరాల,రేపల్లె ఎంఎల్ఎస్ పాయింట్ల నుండి తాగుసిటీ బిల్లులు ఇవ్వడం లేదన్నారు.హమాలీ వ్యక్తిగత వివరాలను కంప్యూటర్లో పొందుపరిచి పిఎఫ్,కంట్రిబ్యూషన్ సదుపాయం కల్పించాలని ఆయన కోరారు. ప్రతి కార్మికుడికి యూనిఫాం,బూట్లు పంపిణీ చేయాలని చెప్పారు.రాష్ట్ర పౌరసంబంధాల శాఖ ప్రధాన కార్యాలయం నుండి జనవరి నుంచి రావాల్సిన చెల్లింపులను వెంటనే అమలు చేయాలన్నారు.సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఇసుకపల్లి హమాలీ కార్మికులు కె.రవిబాబు,టి.రామయ్య,ఎ.రవీంద్ర, సిహెచ్.సునీల్,ఎ.చంటి,బి.రత్నకిరణ్,ఎం.వసంతరావు తదితరులు పాల్గొన్నారు.



## అన్నా క్యాంటీన్‌లో పరిశుభ్రత పాటించాలి

రేపల్లె, జూన్ 24, ప్రభాతవార్త:అన్నా క్యాంటీన్‌లో పరిశుభ్రత,నాణ్యతపై ప్రత్యే క దృష్టి కేంద్రీకరించాలని మున్సిపల్ కమిషనర్ కర్నాల సాంబశివరావు ఆదేశించారు.బుధవారం పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోజనశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు.అన్నా క్యాంటీన్‌లో అందించే ఆహారాన్ని బయటకు తీసుకువెళ్ళేందుకు అనుమతించరాదని స్పష్టం చేశారు.భోజనానికి వచ్చే వారి పట్ల మర్యాదతో ప్రవర్తించాలని ఆయన చెప్పారు.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కొండపల్లి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తున్నందున ప్రజలకు ప్రయోజనం కలుగుతున్నదని చెప్పారు.అన్నా క్యాంటీన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.స్వర్గీయ నందమూరి తారకరామారావు ఆశయాలకు అనుగుణంగా పేదలకు తక్కువ ఖర్చుతో భోజనం అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు,రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌లు అన్నా క్యాంటీన్లను ప్రజలకు చేరువలోకి తీసుకువెళ్ళారని ఆయన తెలిపారు.ప్రజల సంక్షేమం,అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కృషి అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.



## అర్హులందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి

పొన్నూరు, జూన్ 24,ప్రభాతవార్త: అర్హులందరికీ ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహాయం చేస్తున్నారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నరేంద్రకుమార్ మాట్లాడుతూ పేద ప్రజలు కార్పొరేట్ వైద్యం చేయించుకునేందుకు ఈ ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతగానో దోహదపడుతుందన్నారు. గత ప్రభుత్వాలు చేయని రీతిలో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఎంతో మంది పేదలకు సీఎం చంద్రబాబునాయుడు సహాయాన్ని చేస్తున్నారన్నారు. పొన్నూరు రూరల్ మండలంలో 12మంది లబ్ధిదారులకు రూ.4,40,174, పట్టణంలోని వివిధ వార్డులకు సంబంధించిన 13మంది లబ్ధిదారులకు రూ.3,90,358 అందజేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మినారాయణపాడే, ఖాజా పిరోజ్‌ఖాన్, ఆకుల సాంబశివరావు, షేక్ బాజీసాహెబ్, బండ్లమూడి బాబూరావు, మాదల వెంకటేశ్వరరావు, గణిపిశెట్టి రామకృష్ణ, బొర్రు రామారావు, బుద్దా వీరయ్య, జాగర్లమూడి సుధీర్, ఎద్దు సోంబాబు, యరసాని శ్రీరామమూర్తి, తాళికొండ దుర్గయ్య, యక్కటి పద్మారావు తదితరులున్నారు.



## మరణించిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి ఏఆర్ పోలీస్ సిబ్బంది అండ

బాపట్ల,జూన్24,ప్రభాతవార్త,ప్రతినిధి: అనారోగ్యంతో మరణించిన పోలీస్ శాఖ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి కుటుంబానికి జిల్లా ఏఆర్ పోలీస్ సిబ్బంది, అధికారులు మానవత్వాన్ని చాటుకున్నారు. జిల్లా ఏర్పడినప్పటి నుంచి పోలీస్ బ్యాండ్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా విధులు నిర్వహిస్తూ, జూన్ 2వ తేదీన కన్నుమూసిన కందుకూరి కోటేశ్వరరావు కుటుంబానికి అండగా నిలిచేందుకు ఏఆర్ విభాగం సిబ్బంది అంతా కలిసి రూ.1,10,000/ నగదును సేకరించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈ ఆర్థిక సహాయాన్ని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్, చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ కోటేశ్వరరావు కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తోటి ఉద్యోగి అకాల మరణంతో ఆ కుటుంబం ఇబ్బందుల్లో పడకుండా ఆర్థిక భరోసా కల్పించేందుకు ఏఆర్ సిబ్బంది అంతా ముందుకు రావడం అభినందనీయమన్నారు. పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరూ ఐకమత్యంతో ఉంటూ, తోటి సిబ్బందికి ఏ కష్టం వచ్చినా తమ సొంత సమస్యగా భావించి సహాయం చేయడానికి ముందుకు రావాలని ఎస్పీ ఆకాంక్షి ంచారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఏఆర్ డీఎస్పీ పి.కృష్ణంరాజు, అడ్మిన్ ఆర్ఐ షేక్. మోలుద్దీన్, ఆర్ఎస్ఐలు కళ్యాణరావు, సుధాకర్, రామలింగేశ్వరరావు, ఏఆర్ విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయిలో ఓటర్ల జాబితా సవరణ పరిశీలన

బాపట్ల,జూన్24,ప్రభాతవార్త,ప్రతినిధి: జిల్లాలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓ) నిర్వహిస్తున్న ఓటర్ల ప్రత్యేక సంక్షి ప్త సవరణ జాబితా ప్రక్రియను జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ బుధవారం క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించారు. బాపట్ల పట్టణంలోని కన్యకాపరమేశ్వరి ఆలయం పక్కన గల గవర్నమెంట్ హాస్పిటల్ రోడ్డులో జరుగుతున్న ఎన్యుమరేషన్ ఫారం ఆధారిత కుటుంబ సభ్యుల ఆన్‌లైన్ మ్యాపింగ్ ప్రక్రియను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీల్లో భాగంగా డోర్ నెంబర్ 103100 నివాసితులైన సంక వెంకట రామకుమార్, సంక నాగ వెంకట లక్ష్మీ మ్మ సునీత, సంక వెంకట చలపతి శివ సాయి శరవణ్, సంక జ్ఞాన శివ సాయి జయలక్ష్మి మ్మల వివరాలను కలెక్టర్ పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారంలో నమోదు చేసిన వివరాలను వారి ఓటర్ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డులలోని అంశాలతో సరిపోల్చి చూశారు. ఫారంలోని సమాచారాన్ని బీఎల్ఓలు ఆన్‌లైన్‌లో ఏ విధంగా మ్యాపింగ్ చేస్తున్నారనే సాంకేతిక ప్రక్రియను కలెక్టర్ దగ్గరుండి గమనించారు.ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలన్నారు.ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ప్రాధాన్యతను సంక కుటుంబ సభ్యులకు కలెక్టర్ వివరించారుఓటర్ల జాబితాలో ఏమైనా తప్పులు ఉన్నాయా? గతంలో ఎక్కడ ఓటు హక్కు వినియోగించుకున్నారు,బీఎల్ఓలు అందిస్తున్న సేవలపై అవగాహన ఉందాఅని వారిని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల సవరణ ప్రక్రియ ద్వారానే ప్రజాస్వామ్యం మరింత మెరుగుపడుతుందని, ఈ విషయాన్ని బంధుమిత్రులకు కూడా తెలియజేసి బీఎల్ఓలకు పూర్తిస్థాయిలో సహకరించేలా చూడాలని ఆయన కోరారు.పర్యటనలో భాగంగా ఆ కుటుంబ ఆర్థిక, సామాజిక స్థితిగతులను అడిగి తెలుసుకున్న కలెక్టర్, పిల్లల విద్యాభ్యాసంపై ఆరా తీశారు. వారి కుమారుడు శివ సాయి శరవణ్ ప్రస్తుతం సివిల్స్ (ఐఏఎస్)కు ప్రిపేర్ అవుతున్నాడని, అతనికి తగిన సలహాలు, సూచనలు ఇవ్వాలని కుటుంబ సభ్యులు కలెక్టర్‌ను అభ్యర్థించారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. శరవణ్‌కు సివిల్స్ ప్రిపరేషన్‌లో ఏ అంశాలపై సందేహాలు ఉన్నాయో వాటన్నింటినీ ఒక నోట్‌బుక్‌లో రాసుకుని కలెక్టరేట్‌కు రావాలని సూచించారు. అతనికి మార్గదర్శకత్వం చేసేందుకు ప్రత్యేకంగా సమయం కేటాయిస్తానని జిల్లా కలెక్టర్ భరోసా ఇచ్చారు.ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో బాపట్ల ఆర్డీఓ ఏ.హరికుమార్, మున్సిపల్ కమిషనర్ ఎం.హాసిని, ఎస్ఐఆర్ సూపర్‌వైజర్ సుధీర్, బీఎల్ఓ రవిచంద్ తదితర అధికారులు పాల్గొన్నారు.



## అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

బాపట్ల,జూన్24,ప్రభాతవార్త,ప్రతినిధి: బాపట్ల పట్టణంలోని 11వ వార్డు పరిధిలో గులాం హుస్సేన్ తోట వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి వారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మంగళవారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేద పండితులు శాస్త్రోక్తంగా అంకురార్పణ, మేదినీ పూజ, యాగశాల ప్రవేశం, మండపారాధన, నవగ్రహ ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు.బుధవారం ఉదయం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు భక్తిశ్రద్ధలతో క్షీ రాధివాసం, జలాధివాసం, పంచగవ్య అధివాసాలు, అధివాస హోమం, నవగ్రహ హోమం, పంచసూక్త హోమాలను నిర్వహించారు. అనంతరం నీరాజనం, మంత్రపుష్పం సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ప్రముఖ యాగ్నికులు నెమలికంటి హనుమంతరావు పర్యవేక్షణలోపరాశరం రఘురామ్, రొంపిచర్ల కేశవాచార్యుల ఆధ్వర్యంలో వైదిక క్రతువులు శాస్త్రోక్తంగా సాగాయి. రుత్వికులు కౌండిన్య శర్మ, గూడూరు సాయి వెంకట్, ప్రసన్న, సూర్య, చరణ్ పాల్గొన్నారు.ఉత్సవ నిర్వాహకులు ఉప్పాల హరికృష్ణ, ఉప్పాల శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మహోత్సవాల్లో స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాల సందర్భంగా గులాం హుస్సేన్ తోట ప్రాంతం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## సాల్వేషన్ ఆర్మీ స్థలాలపై రైల్వే కన్ను!

బాపట్ల,జూన్24,ప్రభాతవార్త,ప్రతినిధి: కేంద్ర ప్రభుత్వ రైల్వే శాఖ తీసుకున్న ఒక నిర్ణయం ఇప్పుడు బాపట్లలోని క్రైస్తవ సాల్వేషన్ ఆర్మీ (రక్షణ సైన్య) వర్గాల్లో తీవ్ర ఆందోళన రేకెత్తిస్తోంది. రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం సాల్వేషన్ ఆర్మీకి చెందిన విలువైన స్థిరాస్తులను కేటాయించాలంటూ రైల్వే శాఖ నోటీసులు జారీ చేయడం స్థానికంగా కలకలం సృష్టిస్తోంది. ఈ నేపథ్యంలో రక్షణ సైన్య ప్రతినిధులు మేజర్ వంపుగూడి ఏసుపాదం,బాపట్ల మండల నాయకులు, సభ్యులు బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం అవరణంలో ఆర్‌డివోకు వినతి పత్రాన్ని అందించారు.ఈ సందర్భంగా ఏసుపాదం మాట్లాడుతూ బాపట్ల పరిధిలో సాల్వేషన్ ఆర్మీ ఆధ్వర్యంలో నడుస్తున్న మూడు కీలకమైన సేవా ప్రాంతాలపై రైల్వే శాఖ కన్ను పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం నోటీసులు ఇచ్చిన వాటిలో చిన్నపిల్లల హాస్టల్ మరియు స్కూల్ స్థలాలు ఉన్నాయన్నారు.ఈ మూడు ప్రాంతాల మధ్యలోనే సబ్‌స్టేషన్ నిర్మిస్తామని, అందుకోసం స్థలాలు కావాలని రైల్వే అధికారులు ఒత్తిడి తెస్తున్నారన్నారు. స్థలాలు ఇచ్చే ప్రసక్తే లేదని కమిటీ తీర్మానం చేయడం జరిగిందన్నారు. రైల్వే నోటీసులపై సాల్వేషన్ ఆర్మీ నాయకులు, సంఘ సభ్యులు అత్యవసరంగా సమావేశమై సుదీర్ఘంగా చర్చించారని భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆ స్థలాలు తమకు ఎంతో అవసరమని, రైల్వే వారికి ఇచ్చే ప్రసక్తే లేదని కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించిందన్నారు.క్రైస్తవులకు సమాధుల తోట ఎంతో పవిత్రమైనది, ముఖ్యమైనదని భవిష్యత్ అవసరాలకు అది మాకు ఎంతగానో అవసరమన్నారు. అలాగే సమాజంలో అట్టడుగున ఉన్న లెప్రసీ బాధితుల చికిత్సా కేంద్రం, నిరుపేద చిన్నపిల్లల చదువు కోసం ఏర్పాటు చేసిన హాస్టల్ స్థలాలను వేరే అవసరాలకు బదలాయిస్తే ఎంతోమంది నిరాశ్రయులవుతారన్నారు.తమ స్థలాలు కోల్పోతే భవిష్యత్తులో సేవా కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం కలుగుతుందన్నారు.కంద్ర రైల్వే శాఖ ప్రత్యామ్నాయంగా వేరే ఎక్కడైనా ప్రభుత్వ స్థలాలను చూసుకోవాలని, సాల్వేషన్ ఆర్మీకి చెందిన ఈ మూడు సేవా ప్రాంగణాలు దక్కేలా జిల్లా యంత్రాంగం చొరవ చూపాలని వారు విజ్ఞప్తి చేశారు.ఈకార్యక్రమంలో టిస్సోట్ బాయ్స్ హాస్టల్ ఇంచార్జ్ మేజర్. పి. కోటయ్య,జూనియర్ కాలేజీ కరస్పాండెంట్ మేజర్. టి. శేఖర్,కాలేజీ కరస్పాండెంట్ మేజర్. ఎం. మల్లి బాబు,లెప్రసీ హోమ్ ఇంచార్జ్‌మేజర్. జి. రూతమ్మ,గేరా ఆనంద బెనర్జీ మీనన్, పసుమర్తి రవి మెజెస్, దాసరి శ్యామ్ లివింగ్‌స్టన్, కాణిత వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ కేసులో ముగ్గురి అరెస్ట్

నరసరావుపేట క్రైమ్ , జూన్ 24, ప్రభాతవార్త:: , ఇటీవల సంచలనం సృష్టించిన ఎండిఎంఏ డ్రగ్ అక్రమ రవాణా కేసులో పట్టణానికి చెందిన ముగ్గురు నిందితులను ఈగల్ బృందం, చిలకలూరిపేట పట్టణ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించి పట్టణానికి చెందిన మరికొందరు నిందితులప్రమేయం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. మహారాష్ట్రలో వైద్యశాస్త్రం అభ్యసిస్తున్న పట్టణానికి చెందిన ఓ ప్రముఖుని కుమారుడు ఈవ్యవహారంలో కీలక పాత్ర పోషించాడు. బెంగళూరు నుండి చిలకలూరిపేటకు సదరు యువకుడు ఎండిఎంఏ డ్రగ్ ను తరలిస్తుండగా సమాచారంతో ఈగల్ ప్రత్యేక బృందం చిలకలూరిపేట పట్టణ పోలీసులు సంయుక్తంగా దాడినిర్వహించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు వారి వద్ద నుండి ఎండిఎంఏ డ్రగ్ను స్వాధీనం చేసుకున్నారు. సదరు డ్రగ్ బెంగళూరులో ఎక్కడి నుంచి వస్తుంది నిందితులు ఎంత కాలం నుంచి ఈ దందాను నడుపుతున్నారు పట్టణంలో ఎవరెవరికి దీంతో ప్రమేయం ఉంది అనే అన్ని కోణాల్లో పోలీసులు క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో కీలక నిందితులను తప్పించడానికి రాజకీయంగా పలు ప్రయత్నాలుచోటుచేసుకున్నాయి.కానీ ఎస్పి పట్టుబట్టి నిందితులను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. పట్టణానికి , బెంగళూరుకుచెందిన మరికొందరు నిందితుల పాత్ర పై పోలీసు దర్యాప్తు కొనసాగుతుంది. త్వరలోనే డ్రగ్స్ రాకెట్ కు చెక్ చెప్పే విధంగా పల్నాడు పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు.

## సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డా.గోపిరెడ్డి

నరసరావుపేట,జూన్ 24 ప్రభాతవార్త :: పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్థానిక బరంపేట లోని 32, 33 ,34, 1వ వార్డులో జరుగుతున్న సర్ కార్యక్రమం ను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో కలిసి ఎన్యుమరేషన్ ఫారములు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నా రు. బిఎల్ఏలు 100 ఎన్యుమరేషన్ ఫారాలు ఓటర్లకు అందే విధంగా పనిచేయాలని సూచించారు.

## ఆర్టీసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

పొన్నూరు, జూన్ 24,ప్రభాతవార్త: ఆర్టీసీ ఉద్యోగులకు సంబంధించిన పెండింగ్‌లో ఉన్న అన్నీ సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఆర్టీసి జెఏసి నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్ర జెఏసి పిలుపు మేరకు బుధవారం ఆర్టీసి డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యుత్ బస్సులను ఆర్టీసియే నడిపేవిధంగా ఆలోచన చేయాలన్నారు. మూసివేసిన డిపోలను తెరిపించాలన్నారు. పినాకిల్ కంపెనీలతో ఒప్పందాలు వద్దని కోరారు. పిఆర్సీ కమిటీ వేయాలని, ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. డిఏలు, బకాయిలు చెల్లించాలన్నారు. స్త్రీ శక్తి సమస్యలను పరిష్కరించాలన్నారు. కొత్త బస్సులు నాలుగువేలు ఆర్టీసి సంస్థకు కొనుగోలు చేయాలన్నారు. సంస్థలో ఖాళీగా ఉన్న 15వేల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. సమస్యలు పరిష్కారం అయ్యే వరకు విడతల వారీగా ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళనలు తమ సమస్యల పరిష్కారానికే తప్ప ప్రభుత్వం పైన వ్యతిరేకత కోసం కాదన్న విషయాన్ని ప్రభుత్వ పెద్దలు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎంఎస్ రెడ్డి, జిల్లా కో కన్వీనర్ రవిశంకర్, డిపో జెఏసి కన్వీనర్లు ఎం.నాగేశ్వరరావు, ఎఎబేగ్, ఇతర ముఖ్య నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.




## సివిల్ సప్లై ముఠా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పొన్నూరు, జూన్ 24,ప్రభాతవార్త: రెక్కాడితేకానీ డొక్కాడని శ్రామికులు సివిల్ సప్లయిస్ కార్మికులకు ప్రతి నెలా 10వ తేదీ లోపు బిల్లులు చెల్లించాలని ఎఐటియుసి నాయకుడ ఆరేటి రామారావు డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కారం కోరుతూ నిడుబ్రోలు సివిల్ సప్లయిస్ ఆఫీసు వద్ద, ఐలాండ్ సెంటర్‌లో ధర్నా చేశారు. ఆరేటి రామారావు మాట్లాడుతూ ప్రతి నెలా 10వతేదీ లోపు బిల్లులు చెల్లించాల్సి ఉన్నప్పటికీ అధికారులు కార్మికులను ఇబ్బంది పెట్టేందుకు చూస్తున్నారన్నారు. సివిల్ సప్లయిస్ కార్మికులు తమ రెక్కల కష్టంతో సరఫరా చేసే రేషన్ బియ్యం, వగైరా బస్తాలను ఎగుమతి దిగుమతి ద్వారానే ప్రజలు రేషన్ అందించడం జరుగుతుందన్నారు. అలాంటి కార్మికులకు సక్రమంగా బిల్లులు ఇవ్వకపోవడం సరైన విధానం కాదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో యూనియన్ అధ్యక్షుడు పులుగు విద్యాసాగర్, పులుగు కోటేశ్వరరావు, పులుగు రవిశరత్, కె.పాల్, పిచ్చయ్య తదితరులున్నారు.




## మలేరియా అంతం...మనందరి పంతం

పొన్నూరు, జూన్ 24,ప్రభాతవార్త: చేబ్రోలు మండల పరిధిలోని శలపాడు గ్రామంలో మలేరియా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మలేరియా అంతం...మనందరి పంతం కావాలని తెనాలి మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ అందె బాలచంద్రవాళి పిలుపునిచ్చారు. దోమల ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఉందన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే తక్షణమే ప్రభుత్వ వైద్యశాలలోని డాక్టర్లను సంప్రదించి వారి సూచనలు, సలహా మేరకు మాత్రమే మందులు వాడాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇండ్లలో ఒకటి రెండు రోజులకు ఒకసారి నీటి నిల్వలను మార్చుకోవాలన్నారు. నీటి నిలువలపై మూతలు పెట్టి ఉంచాలన్నారు. దోమతెరలు వాడడం, పూర్తి వస్త్రధారణ ధరించుట, ఉదయం సాయంత్రం సమయాల్లో తలుపులు, కిటికీలు మూసుకొని ఉంచడం వంటి కార్యక్రమాలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వేజండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య విస్తరణాధికారి కర్రి రామయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు క్రోసూరి వెంకటరమణకుమారి, హెల్త్ అసిస్టెంట్ వజ్జా రామారావు, సోమిశెట్టి సాయిబాబు, సచివాలయ ఆరోగ్య కార్యదర్శి యు.లావణ్య, ఎంఎల్‌హెచ్‌పి సృజన, ఆశాకార్యకర్తలు, ఎ.రజని, అతిథి కుమారి, గ్రామస్తులు పాల్గొన్నారు.



## డిజిటైజేషన్‌పై బిఎల్వోలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

### -నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఐ.పద్మావతి

పొన్నూరు, జూన్ 24,ప్రభాతవార్త: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు సంబంధించి బిఎల్వోలు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీతోపాటు వాటిని డిజిటైజేషన్ చేసే విధానంపై కూడా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి ఇదుపులపాటి పద్మావతి ఆదేశించారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ దాదాపుగా పూర్తి అయిన నేపథ్యంలో బిఎల్వోలు డిజిటైజేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వేగాన్ని పెంచాలన్నారు. నియోజకవర్గంలో మొత్తం 2,28,214మంది ఓటర్లకు సంబంధించి ఇప్పటి వరకు 2,20,598మందికి ఎన్యుమరేషన్ ఫారాలను అందజేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు 12,825 ఫారాలుమాత్రమే డిజిటైజేషన్ చేయడం జరిగిందన్నారు. ఓటర్ల కూడా బిఎల్వోలకు సహకరించి పూర్తి చేసిన ఫారాలను అందజేయాలన్నారు. ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను అందించినట్లయితే బిఎల్వోలు డిజిటైజేషన్ ప్రక్రియను కూడా వేగవంతంగా చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందులో ఎలాంటి అపోహలకు తావులేదన్నారు. సక్రమంగా విధులు నిర్వహించని బిఎల్వోలపై చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.


## ప్రతి అంశాన్ని వివాదాస్పదం చేస్తున్న వైకాపా: కన్నా

సత్తెనపల్లి, జూన్ 24, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం రఘురామ్ నగర్ కార్యాలయం నందు మీడియా సమావేశం లో తెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నా లక్ష్మీ నారాయణ. వైసీపీ ప్రతి అంశాన్ని వివాదాస్పదం చేస్తోంది ..కులాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం వైకాపా చేస్తోందన్నారు. రాష్ట్రంలో వ్యవస్థలను నాశనం చేసిన జగన్ అని అన్నారు. వైసీపీ హయాంలో కుల వ్యవస్థను నాశనం చేసిన ఆ పార్టీ వైసీపీ హయాంలో కమ్మ కులస్థులతో చంద్రబాబు పై విమర్శలు చేస్తోందన్నారు.కులాలను రెచ్చగొట్టటం జగన్ అలవాటు అని అన్నాం



## పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే 'కన్నా'

సత్తెనపల్లి, జూన్ 24, ప్రభాతవార్త: సత్తెనపల్లి నియోజకవర్గంసత్తెనపల్లి నియోజకవర్గం , పట్టణంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనతెలుగుదేశం పార్టీ జాతీయ ఉపాధ్యక్షులు శాసన సభ్యులు కన్నాలక్ష్మీనారాయణ పాల్గొనానరు. అచ్చంపేట రోడ్ శివాలయం నందు ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు . ముప్పాళ్ళ మండలం మాదల గ్రామం నందు రెడ్డి శ్రీనివాస్ వారి వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు ముప్పాళ్ళ మండలం దమ్మాల పాడు గ్రామం నందు చింతపల్లి వారి వివాహ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు సత్తెనపల్లి రూరల్ మండలం దూళిపాళ్ళ గ్రామం నందు కొరటాల వారి నూతన వస్త్ర బహుకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు ఈ కార్యక్రమంలో వివిధ హోదాలో ఉన్న రాష్ట్ర జిల్లా నియోజకవర్గ పట్టణ మండల గ్రామ తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



### విదేశంలో ఉద్యోగం అయినా స్వదేశంపై మమకారం

## భరతమాత అన్నప్రసాధ వితరణ పథకం 815 వ రోజు సహకారం

సత్తెనపల్లి, జూన్ 24, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణంలోని యానాది కాలనీలో, బుధవారం సత్తెనపల్లి పట్టణానికి చెందిన గోశాల మాజీ అధ్యక్షులు దివంగత ఆత్మకూరి రాములు కుమారుల్లో ఒకరు ఎన్. ఆర్. ఐ అయిన ఆత్మకూరి హర్నిశ్చంద్ర ప్రసాద్ ధర్మపత్ని గౌరీ వెంకట అంజనీ శిరీష వివాహ వార్షికోత్సవ శుభ సందర్భంగా వీరి యొక్క ఆర్థిక సహాయంతో 121మంది నిరుపేదలకు పైగా ఉచితంగా భోజనం అందించటం జరిగింది. ఈ సందర్భంగా దివ్వెల శ్రీనివాసరావు మాట్లాడుతూ భరతమాత అన్నప్రసాధ వితరణ పథకము నకు ఇతర దేశాల్లో నుంచి సహకారం లభించటం అది సుదీర్ఘ కాలంగా కొనసాగటం దాతల యొక్క ధాత్రుత్వం ప్రధాన కారణం అని అన్నారు. ఈనాటి దాతలు గతంలో కూడ పలుసార్లు సహాయం అందించారు. ఈనాటి దాతలకు మరియు వీరి కుటుంబ సభ్యులకు, ఈనాటి కార్యక్రమంలో సేవలు అందించిన దమ్మాలపాటి బాల వెంకటేశ్వర్లు టీం కు దివ్వెల శ్రీనివాసరావు హృదయ పూర్వక ధన్యవాదములు తెలిపారు.



## వసతి గృహాలన్నింటినీ గురుకులాలుగా మార్చండి: కేసన శంకరరావు

తాడేపల్లి, జూన్ 24, ప్రభాతవార్త: 50 ఏళ్లకు పైబడి ప్రభుత్వ హాస్టళ్ల అరకొర వసతులతో బీసీ విద్యార్థులకు సేవలందించాయని, ఇకపై సంపూర్ణ మౌలిక వసతులతో నాణ్యమైన విద్య నందించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రెసిడెన్షియల్ పాఠశాలలు/కళాశాలలు నెలకొల్పి, వసతి గృహాలన్నింటిని గురు కులాలుగా మార్చాలంటూ, ఆంధ్ర ప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకరరావు ఒక ప్రకటనలో కోరారు. కొత్తగా 4,800 సీట్లతో 10 బీసీ గురుకులాలు,5 బాలురకుమరో 5 బాలికలకు అందుబాటులోనికి తెస్తున్న ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో అభినందిస్తూ ఆ మేరకు డిమాండ్ చేశారు. ఇంకా వారు ప్రస్తుతం 86 నియోజకవర్గాల పరిధిలో ఉన్న గురుకులాలు చక్కటి వసతులతో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తూ,ప్రజల మెప్పు పొందేలా సక్రమంగా సిబ్బంది అధికారుల నిర్వహణ పర్యవేక్షణలు ఉన్నాయన్నారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత చొరవతో గురుకుల విద్యాలయ వ్యవస్థ సక్రమంగా నిర్వహించబడుతుందన్నారు. ఆమె ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థుల బాగోగులతో పాటు మరిన్ని గురుకులాల ఏర్పాట్లలో భాగంగా ఈ పదింటిని 8 జిల్లాల పరిధిలో ఏర్పాటుకు ప్రభుత్వ అనుమతి తీసుకోవడం బీసీల విద్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుందన్నారు. భవిష్యత్తులో మరిన్ని గురుకులాలు ఏర్పాటు చేస్తూ మొత్తం వసతి గృహ వ్యవస్థ స్థానంలో గురుకులాల వ్యవస్థను మారుతున్న కాలానికి అనుగుణంగా అభివృద్ధి పరచాలన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ హాస్టళ్లకు సమీపం లోనే గురుకులాలను ఏర్పాటు చేసి దరిదాపుల్లో ఉన్న వసతి గృహాల విద్యార్థులందరినీ గురుకులాల్లోకి మార్చాలన్నారు. ఆ మేరకు వసతి గృహాల నిర్వహణ వ్యయం తగ్గి, విద్యార్థులకు మెరుగైన వసతులతో నాణ్యమైన విద్య గురుకులాల్లో అందేలా చూడాలన్నారు. భవిష్యత్తులో అన్ని గురుకులాలను ప్రైవేటు భవనాల స్థానంలో ప్రభుత్వమే పక్క భవనాలు నిర్మించి నిర్వహించాలని శంకరరావు ఆకాంక్షించారు.

## వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో ఉచిత బెంచీల ఏర్పాటుచేసిన పారేపల్లి



అమరావతి, జూన్ 24,ప్రభాతవార్త : మండలంలోని అమరావతి గ్రామ అభివృద్ధి ప్రజల సౌకర్యార్థం శ్రీ వాసవి క్లబ్ వనిత ఆధ్వర్యంలో అధ్యక్షులు పారేపల్లి రాధాకృష్ణ పుష్పలత ఆధ్వర్యంలో ఉచితంగా బెంచీలు ఏర్పాటు చేశారు శ్రీ అమరలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో మరియు పోస్ట్ ఆఫీస్ ప్రాంగణంలో ప్రజలు విశ్రాంతి తీసుకోవటానికి ఏర్పాటు చేశారు. ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ వాసవి క్లబ్ వనిత సభ్యులను అభినందించారు

## పాస్టర్లకు నూతన దుస్తులు పంపిణీ

తెనాలి జూన్24(ప్రభాతవార్త): స్థానిక ఆలపాటి నగర్ సుల్తానాబాద్ లో గల రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో జగదభి సుజి కొణజాల రూపేష్ దంపతులు పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. బుధవారం సుజీ రూపేష్ ల వివాహ వేడుకను రత్న ఫార్చ్యూన్ కల్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. సేవకులను సంతోషపరుచుట వలన మెండైన ఆశీర్వాదాలు పొందవచ్చు



అన్న అభిప్రాయంతో ఆ దంపతులు వివాహ వేడుకను పురస్కరించుకొని నూతన వస్త్రాలు పంపిణీ చేసామన్నారు. వివాహ వేడుక, నూతన వస్త్రాలు పంపిణీ కార్యక్రమాలను బిషప్ గద్దం సాధుతామస్ తేజ దంపతులు పర్యవేక్షించారు. పట్టణంలోని పాస్టర్లకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, హైకోర్టు న్యాయవాది ఆలూరి నాంచారయ్య, టౌన్ పాస్టర్ స్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిపూడి అబ్రహం, పాస్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ తెనాలి అధ్యక్షులు బిషప్ డాక్టర్ పాముల ఐజయ్య, పాస్టర్ విశ్వప్రసాద్, తెదేపా సీనియర్ నాయకుడు గొల్లపూడి రాజు, బిషప్ గద్దం సుధీర్ కుమార్, ఏ భాను ప్రసాద్, విలియం కేరి ఐజక్ నల్లూరి రామారావు అతిథులుగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.

## రేషన్ పంపిణీ సక్రమంగా నిర్వహించాలి: తహశీల్దార్ కెవి.గోపాలకృష్ణ

తెనాలి మున్సిపాలిటీ జూన్24(ప్రభాతవార్త): ప్రజా పంపిణి వ్యవస్థ (రేషన్) నిర్వహణలో ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని తెనాలి తహశీల్దార్ కె.వి. గోపాలకృష్ణ రేషన్ డీలర్లకు సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పట్టణ పరిధిలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు అర్హులైన లబ్ధిదారులకు రేషన్, సరుకులను



సకాలంలో పంపిణి చేయాలని పేర్కొన్నారు.ముఖ్యంగా 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇబ్బందులు కలగకుండా వారి ఇళ్లకే వెళ్లి రేషన్ అందజేయాలని చేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, రేషన్ పంపిణి ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ లబ్ధిదారుల సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నిర్లక్ష్యం లేదా అవకతవకలు గుర్తించినట్లయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో రేషన్ డీలర్లు, తహశీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గున్నారు.

## పల్స్ పోలియో నిర్వహణపై అవగాహనా సదస్సు

తెనాలి మున్సిపాలిటీ జూన్ 24(ప్రభాతవార్త): జాతీయ పల్స్ పోలియో రీఓరియంటేషన్ శిక్షణ కార్యక్ర మాన్ని మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు.జూన్ 28వ తేదిన జరిగే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన రీఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ



అధికారి డా. కె. విజయలక్ష్మి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రోగనిరోధక టీకాల అధికారి డా. ఎ. శ్రావణ్ బాబు, ఉప జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారి డా. ఈ. అన్నపూర్ణ, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. ఎం. యేసుబాబు, అలాగే తెనాలి పట్టణంలోని అన్ని అర్బన్ హెల్త్ సెంటర్ల వైద్య అధికారులు, సిబ్బంది, వ్యాక్సినేటర్లు మరియు రూట్ సూపర్వైజర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డా. కె. విజయలక్ష్మి మాట్లాడుతూ, పల్స్ పోలియో కార్యక్రమంలో ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయాలని, క్షేత్రస్థాయిలో సమగ్ర ప్రణాళికతో పని చేసి 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. వ్యాక్సిన్ నిర్వహణ, బూత్ నిర్వహణ, ఇంటింటి సందర్శనలు, పర్యవేక్షణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.తెనాలి పట్టణం లో మొత్తం 5 సం లోపు పిల్లలు 11632 మంది , పల్స్ పోలియో బూత్స్ 57, బస్టాండ్, రైల్వే స్టేషన్ లో 4 బూత్స్,మొబైల్ టీమ్స్ 3 కలవు జిల్లాలో పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఆరోగ్య కార్యకర్త బాధ్యతాయుతంగా పనిచేసి జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## అత్యంత వైభవంగా మహా కుంభాభిషేకం

నరసరావుపేట, జూన్ 24 ప్రభాతవార్త : నరసరావుపేట మండలం పమిడిపాడు గ్రామం ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. గ్రామంలోని శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ వల్లభరాజ స్వామివారి దేవస్థానంలో నిర్వహిస్తున్న మహా కుంభాభిషేక మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. బుధవారం ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వల్లభరాజ స్వామివారిని ఎమ్మెల్యే అరవిందబాబు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, సమృద్ధి కోసం ప్రార్థనలు చేశారు. భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మహోత్సవాల విశిష్టతను తెలుసుకుని నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో జనసేన నరసరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి సయ్యద్. జిలాని , కూటమి నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రవీణ్ సహకారంతో బుచ్చిపాలెం గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతున్న పరుచూరి నాని



పెదకూరపాడు, జూన్ 24, ప్రభాతవార్త : మండలంలోని బుచ్చయ్య పాలెం గ్రామంలో గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రామంలో అన్ని రకాల మౌలిక వసతులతో గ్రామాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టిస్తున్న పెదకూరపాడు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు పరుచూరి నాని. ఎమ్మెల్యే సహకారంతో సిమెంట్ రోడ్లు,24 గంటల విద్యుత్తు, గ్రామ సందుల్లో కొత్త స్తంభాల విద్యుత్ లైన్ , ఏర్పాటు మంచినీటి సరఫరా, డ్రైన్స్ నిర్మాణం మొదలగు అభివృద్ధి పనులు చేపట్టి గ్రామ రూపురేఖలు మార్చారనిగ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

## ఎస్ఆర్ఎం, హరుకా క్లీన్ ఎనర్జీల ఎంవోయూ

మంగళగిరి, జూన్ 24, ప్రభాతవార్త : ఏపీ ఎస్ఆర్ఎం విశ్వవిద్యాలయం బుధవారం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రీన్ హైడ్రోజన్ తయారీ రంగంలో అనుభవమున్న ముంబయికి చెందిన హరుకా క్లీన్ ఎనర్జీ ప్రైయివేట్ లిమిటెడ్ తో వ్యూహాత్మక అవగాహన ఒప్పందం (ఎంవోయూ) చేసుకుంది. బుధవారం సాయంంత్రం యూనివర్సిటీలో జరిగిన అవగాహన ఒప్పంద కార్యక్రమానికి హరుకా ఎనర్జీస్ డైరెక్టర్లు రవీంద్ర మదన్మోహన్ సిన్హా, కవీంద్ర సిన్హా, సలహాదారు డాక్టర్ రవి వేదంలు హాజరై ఎస్ఆర్ఎం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య సతీష్ కుమార్, ఎస్ఆర్ఎం గ్రూప్ విద్యా సంస్థల



ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ఆచార్య డి నారాయణ రావులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వీధి లైట్లను గ్రీన్ హైడ్రోజన్తో వెలిగించే సాంకేతికతను ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ తరహా సాంకేతికతను అభివృద్ధి పర్చడంలోనూ, వీధిలైట్లకు గ్రీన్ హైడ్రోజన్ ను అనుసంధానం చేసి వెలుగులు నింపే ప్రక్రియను ప్రవేశ పెట్టే విషయంలోనూ పరస్పర సహకారం కోరుకుంటూ రెండు సంస్థల మధ్యా అవగాహన ఒప్పందం జరిగినట్లు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు పేర్కొన్నారు. ప్రస్తుతం మన దేశంలో వీధి లైట్లను విద్యుత్తు సరఫరా ద్వారా వెలిగిస్తున్నారు. కొన్ని చోట్ల సోలార్ పవర్ ద్వారా వీధి లైట్లను వెలిగిస్తున్నారు. అయితే గ్రీన్ హైడ్రోజన్ వాడకం ద్వారా సరసమైన ధరకే వీధి లైట్లకు విద్యుత్తు సరఫరా చేయవచ్చని హరుకా ఎనర్జీ కంపెనీ పేర్కొంటుంది. ఈ టెక్నాలజీని అభివృద్ధి చేయడానికి ఎస్ఆర్ఎం వర్సిటీ సహకారాన్ని కోరింది. దీనికి అంగీకరించిన ఎస్ఆర్ఎం వర్సిటీ యాజమాన్యం ఎంవోయూకి ఆమోదం తెలిపింది. బుధవారం జరిగిన ఎంవోయూ కార్యక్రమంలో యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య సీహెచ్ సతీష్ కుమార్ ఎంవోయూ ఉద్దేశాన్ని వివరించారు. అనంతరం యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వినాయక్, హరుకా ఎనర్జీస్ డైరెక్టర్ రవీంద్ర సిన్హాలు ఎంవోయూ పత్రాలపై సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జతింద్ర కుమార్ దాస్ , హరుకా ఎనర్జీ ముఖ్య సలహాదారు డాక్టర్ రవి వేదం పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలలో అవగాహన ర్యాలీ, ప్రచార రథం

మంగళగిరి, జూన్ 24, ప్రభాతవార్త: డాన్ బోస్కో నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలు కార్యక్రమాలలో భాగంగా బుధవారం మంగళగిరి మండలం ఆత్మకూరులోని నిర్మలా ఫార్మసీ కళాశాలలో మాదక ద్రవ్యాల నివారణపై విస్తృత అవగాహన కార్యక్రమం, ప్రచార రథం మరియు విద్యార్థుల ర్యాలీ ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో నిర్మల ఫార్మసీ కళాశాల జాతీయ సేవా పథకం, డిపార్ట్మెంట్ ఆఫ్ బీ ఫార్మసీ మరియు ఫార్మకాలజీ ఫార్మసీ ప్రాక్టీస్ విభాగములు పాల్గొన్నాయి. నిర్మలా ఫార్మసీ కళాశాల ప్రాంగణం



నుండి ప్రారంభమైన ర్యాలీ సాయిబాబా టెంపుల్ జంక్షన్ వరకు కొనసాగింది. విద్యార్థులు, అధ్యాపకులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొని మాదక ద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక మరియు ఆర్థిక దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ ఈగల్ విభాగం డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ టి. త్రినాధరావు మాట్లాడుతూ యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక అని, మాదక ద్రవ్యాలు వారి జీవితాలను నాశనం చేసే ప్రమాదకరమైన సామాజిక వ్యాధిగా మారాయని పేర్కొన్నారు. డ్రగ్స్ కు దూరంగా ఉండటమే కాకుండా, వాటి అక్రమ రవాణా లేదా వినియోగంపై సమాచారం తెలిసిన వెంటనే 1972 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని ఆయన సూచించారు. మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని పిలుపునిచ్చారు. ఇంకా ఈ కార్యక్రమంలో జిల్లా వృద్ధులు, వికలాంగులు, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎన్. వెంకట రమణప్ప, నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫా. జోసెఫ్ తంబి, నిర్మలా ఫార్మసీ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ రెవ. సిస్టర్ జి. నిర్మల జ్యోతి, కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. పాముల రెడ్డి తదితరులు గ్రీన్ జెండా ఊపి ప్రచార రథం మరియు అవగాహన ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంగళగిరి ఇన్స్పెక్టర్ జి. వీరాంజనేయులు, సబ్ ఇన్స్పెక్టర్లు కె. రవికుమార్, ఎ. పద్మజ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. రేఖా నరేష్ బాబు, ఫార్మకాలజీ అండ్ ఫార్మసీ ప్రాక్టీస్ డిపార్ట్మెంట్ విభాగాధిపతి డాక్టర్ షేక్ ఆలీ, డిపార్ట్మెంట్ ఆఫ్ బి ఫార్మసీ విభాగాధిపతి డాక్టర్ ఎం సుధీర్ తదితరులు పాల్గొన్నారు..

## అక్రమ రేషన్ బియ్యం వ్యాపారిని అరెస్ట్ చేసిన తెనాలి రూరల్ పోలీసులు

తెనాలి జూన్24(ప్రభాతవార్త): అక్రమంగా రేషన్ బియ్యన్ని తరలిస్తున్న వ్యాపారి గొంది అశోక్.ని తెనాలి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు.అతను 16 అక్రమ రేషన్ బియ్యం క్రిమినల్ కేసులున్న పాత నేరస్థుడు. పోలీసుల కథనం ప్రకారం, తెనాలి మండల పరిధిలో పేద ప్రజలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ, బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తున్న ముఠా గుట్టును తెనాలి తాలూకా పోలీసులు గట్టు రట్టు చేశారు.జూన్ 13వ తేదీ తెల్లవారుజామున ఉదయం 5 గంటల సమయంలో, అందిన సమాచారం మేరకు అంగలకుదురు గ్రామం సెంటర్లో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు.తనిఖీల్లో భాగంగా ఏపీ 39టీక్యు 5875 నెంబర్ గల బొలెరో వాహనాన్ని అదుపులోకి తీసుకోగా, అందులో అక్రమంగా తరలిస్తున్న 79 బస్తాల రేషన్ బియ్యం లభ్యమయ్యాయి.తెనాలి టౌన్ ఐతనగర్ ఏరియాలోని రేషన్ షాప్ నుండి వట్టిచెరుకూరు మండలం, అనంతవరప్పాడు గ్రామంలోని ఒక రైస్ మిల్లుకు ఈ బియ్యాన్ని తరలిస్తున్నట్లు డ్రైవర్ ఇచ్చిన ప్రాథమిక సమాచారంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా



23వ తేది సాయంత్రం 5 గంటల సమయంలో పెదరావూరు గ్రామంలోని మెయిన్ సెంటర్ వద్ద నిఘా ఉంచి, ప్రధాన నిందితుడైన గొంది అశోక్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.నిందితుడు అశోక్ గత కొంతకాలంగా మండల పరిధిలోని వివిధ గ్రామాల నుండి పేద ప్రజల రేషన్ బియ్యాన్ని అక్రమ మార్గాల్లో సేకరించి, రైస్ మిల్లులకు తరలిస్తూ భారీగా లాభాలు గడిస్తున్నాడు. ఇతనిపై ఇప్పటివరకు రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి మొత్తం 16 క్రిమినల్ కేసులు నమోదయ్యాయని,ప్రస్తుత కేసు తెనాలి రూరల్ పోలీస్ స్టేషన్లో ఇతనిపై నమోదైన ..6వ కేసని,ఇది కాకుండా వట్టిచెరుకూరు, తెనాలి పట్టణ, కొల్లూరు, కొల్లిపర పోలీస్ స్టేషన్లలో కూడా ఇతనిపై కేసులు ఉన్నాయని రూరల్ ఎస్సై ఆనంద్ తెలిపారు.అరెస్ట్ చేసిన నిందితుడు గొంది అశోక్ను కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనికి14 రోజుల రిమాండ్ విధించింది. కోర్టు ఆదేశాల మేరకు నిందితుడిని గుంటూరు జిల్లా జైలుకు తరలించడం జరిగిందని,అలాగే ఈ అక్రమ రవాణా నెట్వర్క్తో సంబంధం ఉన్న రేషన్ షాప్ డీలర్ నిరంజన్ ని అలాగే అనంతవరప్పాడు గ్రామానికి చెందిన రైస్ మిల్లు ఓనర్ హరీష్ ఇద్దరినీ త్వరలోనే అరెస్ట్ చేసి రిమాండ్కు పంపిస్తామని, తెనాలి రూరల్ పోలీసులు స్పష్టం చేశారు.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తిచేస్తూ, తెనాలి మండల పరిధిలో ఎక్కడైనా పేదలకు చెందవలసిన రేషన్ బియ్యాన్ని ఎవరైనా అక్రమంగా నిల్వ చేసినా లేదా తరలిస్తున్నా వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా కోరుతున్నామన్నారు.

## "నేల తల్లిని సంరక్షించుకోవడం రైతుల బాధ్యత

పెదనందిపాడు జూన్ 24 (ప్రభాతవార్త) మండలం లోని రావిపాడు గ్రామంలో కేత్ బచావో అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు, వ్యవసాయానికి ప్రధాన ఆధారమైన నేలను సంరకించుకునే బాధ్యత రైతులు అందరి మీద ఉందని భూముల సంరక్షణ, నేల ఆరోగ్యం పరిరక్షణ రైతుల్లో స్థిరమైన వ్యవసాయ పద్ధతులపై అవగాహన కలిగి ఉండాలని ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ జి.వెంకటేశ్వరావు అన్నారు,అధిక మోతాదు లో రసాయన ఎరువులు వినియోగిస్తే నేలలో పోషకాల సమతుల్యత తగ్గి చౌడుబారి, పంట దిగుబడులు తగ్గే అవకాశం ఉందని తెలియచేశారు.భూసార పరీక్షల ద్వారా ఎరువులు వేసుకోవాలని తెలిపారు, పచ్చిరొట్ట విత్తనాలు చల్లు కొని భూసారాన్ని పెంచుకోవచ్చునని తెలిపారు, భాస్వరం ఎరువులు దుక్కిలోనే వేసుకోవాలన్నారు. గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.మోహనరారావు మాట్లాడుతూ ఈ



ఖరీఫ్ లో రైతులకు ఏపీ ఏ ఐ ఎం ఎస్ ఏ 2.వీ యాప్ ద్వారా రైతులకు యూరియా, డిఏపి సరఫరా గురించి తెలియచేశారు, మండల వ్యవసాయ అధికారి ఐ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడుకోవాలి అని యూరియా మరియు డిఏపి నిల్వల గురించి రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదని అవసరం ఐన మేరకు రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు, ప్రకృతి వ్యవస్నాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.రాజకుమారి ప్రకృతి వ్యవసాయం యొక్క ప్రాముఖ్యతను, మరియు పి ఎం డి ఎస్ కిట్స్ ద్వారా ఉపయోగాలు గురించి రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికారక సంస్థ నుండి కె. గోపి , వి హెచ్ ఏ, జి. ఇనోష్. పలువురు ఆదర్శ రైతులు,గ్రామ రైతులు పాల్గొన్నారు.

## పెదనందిపాడు ఎస్ఐగా ఏక్నాథ్ బాధ్యతల స్వీకారం



పెదనందిపాడు జూన్ 24 (ప్రభాతవార్త) పెదనందిపాడు నూతన ఎస్ ఐ గా. పి ఏక్ నాథ్ బుధవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. వీరు గుంటూరు పట్టాభిపురం నుండి బదిలీపై పెదనందిపాడు రాగా. ఇక్కడ ఇప్పుడు వరకు పనిచేసిన సత్యనారాయణ బదిలీపై తాడేపల్లి వెళ్లారు. సందర్భంగా ఎస్ ఐ .ఏక్ నాథ్ విలేకరులతో మాట్లాడుతూ లార్డ్ ప్రకారం బహిరంగ మద్యం సేవించరాదని అలాంటి సంఘటనపై కఠిన చర్యలు తీసుకుంటామని. పేకాట నిరోధించటం. ట్రాఫిక్ కంట్రోల్ చేయటం కార్యక్రమాలతో పాటు తన పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా ముందు జాగ్రత్తగా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

## విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానానికి ఎదగాలి

పెదనందిపాడు జూన్ 24 (ప్రభాతవార్త) విద్యార్థులు దాతల సహకారంతో బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని పెదనందిపాడు ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి వీర రాఘవయ్య అన్నారు. బుధవారం స్థానిక జడ్పీ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న 45 మంది విద్యార్థులకు దాత కమ్మ సాంబశివరావు అమరేశ్వరి దంపతులు ఉచితంగా బుక్స్ జామెంట్రీ బాక్సులు పెన్సిల్స్ తదితర విద్య సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమా వేశానికి ఉపాధ్యా యులు చక్రవర్తి అధ్యక్షత వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వీరరాఘవయ్య



మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధి ద్వారా అభివృద్ధి పొందిన వారు. తర్వాత తరం వారికి చేయూతనియటం మంచి సాంప్రదాయమని ఈ సందర్భంగా దాతలను అభినందించారు. విద్యార్థులు మాదక ద్రవ్యాల జోలికి పోకుండా ఆరోగ్యకరమైన వాతావరణంలో చదువుకుని ఉన్నత స్థానాలు ఎదగాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు మాట్లాడుతూ. దాతల సహాయం పొందిన వారు బాగా చదువుకొని మంచి మార్కులు సాధించినప్పుడే దాతల ఆశయాలు నెలకొల్పినట్టు అవుతుందని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి హెచ్ఎం పి మల్లికార్జునరావు. శైలజ పలువురు పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదు

నగరం, జూన్ 24, ప్రభాతవార్త: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించరాదని నగరం ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సీఐ మార్టూరి శ్రీరామ్ ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం కొనుగోలు చేసిన వారు బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదని, పర్మిట్ రూంలోనే మాత్రమే సేవించాలని తెలిపారు. అనధికారికంగా మద్యం అమ్మకాలు నిర్వహించినట్లయితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం మద్యం దుకాణం యజమానులు మద్యం అమ్మకాలు జరపాలని ఆదేశించారు.



## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన తెదేపా నేతలు

తెనాలి మున్సిపాలిటీ జూన్24(ప్రభాతవార్త): మానవత్వమే ధ్యేయంగా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆర్థిక చేయూత అందించిన తెలుగుదేశం పార్టీ నాయకులు. తెనాలి పట్టణం, మారీసు పేటకు చెందిన షేక్ కరీముల్లా భాష వైద్య చికిత్స కోసం, తెనాలి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ , మాజీ మంత్రి ,ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ చొరవ మరియు ప్రత్యేక సహకారంతో ముఖ్యమంత్రి



సహాయనిధి లెటర్ అఫ్ క్రెడిట్నుంచి రూ. 1,10,829/ మంజూరైంది.ఈ ఆర్థిక సహాయానికి సంబంధించి మంగళవారం బాధిత కుటుంబీకులకి 1,10,829/ ల చెక్కును అందజేసిన తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు ఎండి.ఖుద్దుస్,ఐ టీడీపీ తెనాలి పట్టణ అధ్యక్షులు సయ్యద్ షావుల్, మల్లవరపు విజయ్,జి. కన్నయ్య. ఆపద సమయంలో ఆదుకున్నందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి,అలాగే ప్రజల కోసం నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ కి బాధిత కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలి :ఎమ్మెల్యే

నరసరావుపేట, జూన్ 24 ప్రభాతవార్త : వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని నవయుగ కన్వెన్షన్ హాల్లో బుధవారం నిర్వహించిన పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ విస్తృతస్థాయి సమావేశంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి. ఆంజనేయులు ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, జిల్లా అధ్యక్షులు షేక్. జానీ సైదా తో కలిసి ఎమ్మెల్యే అరవింద బాబు హాజరై మాట్లాడారు. పార్టీ నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి బుధవారం క్యాడర్ సమావేశాలను నిర్వహిస్తూ ప్రజా



సమస్యలు, ప్రభుత్వ కార్యక్రమాలపై చర్చిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై వైసీపీ నాయకులు కావాలనే అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. మెగా డీఎస్సీ ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నప్పటికీ దానిపైనా దుష్ప్రచారం చేయడం వైసీపీ వైఖరికి నిదర్శనమని తెలిపారు. ప్రజలకు మేలు చేసే ప్రతి కార్యక్రమాన్ని రాజకీయ కోణంలో చూస్తూ అపోహలు సృష్టించడం ఆ పార్టీకి అలవాటుగా మారిందన్నారు. తెలుగుదేశం పార్టీ మహిళా నాయకులను, మహిళలను అవమానించే విధంగా వైసీపీ నేతలు వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే ఆక్షేపించారు. ఇటువంటి చర్యలను ప్రజలు గమనిస్తున్నారని, దుర్మార్గపు ఆలోచనలతో వ్యవహరించే వైసీపీ ఎప్పటికీ మారదని విమర్శించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ. ఆంజనేయులు, జిల్లా పార్టీ అధ్యక్షులు జాన్ సైదా, మర్రి రాజశేఖర్ లు పాల్గొని పార్టీ బలోపేతంపై సూచనలు చేశారు., ప్రభుత్వ పథకాల ప్రచారంపై నాయకులు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సౌరశక్తి విస్తరణతో హరిత ఉద్యోగాలు



### యువ నిపుణులు, సాంకేతిక కార్మికులకు స్థిరమైన ఉపాధి
### కలిసిరానున్న ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం
### గ్రామీణ ఆర్థిక వ్యవస్థలు బలోపేతమయ్యే అవకాశం

**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రస్తుతం అందుబాటులో ఉన్న విద్యుత్ వనరులలో రూఫ్‌టాప్ సోలార్ ఇప్పటికే అత్యంత చవకైన వాటిలో ఒకటిగా ఉంది. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో, సౌరశక్తి పెరుగుదల పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో చిన్న తరహా పరిశ్రమల స్థాపనను కేంద్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. భారతదేశంలో సౌరశక్తి విస్తరణ కొత్త తరం హరిత ఉద్యోగాలను సృష్టిస్తోంది. ఈ రంగానికి శిక్షణ పొందిన టెక్నీషియన్లు, ఇన్‌స్టాలర్లు, ఎలక్ట్రీషియన్లు, నిర్వహణ నిపుణులు, బ్యాటరీ నిర్వహణ నిపుణులు, ఎనర్జీ ఆడిటర్లు అవసరం.

పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో సోలార్ సహకార సంఘాలు విస్తరిస్తున్న కొద్దీ, ప్రత్యేక నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతూనే ఉంటుంది, ఇది యువ నిపుణులకు, సాంకేతిక కార్మికులకు స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని తాజాగా ఓ నివేదిక వెల్లడించింది.

జాతీయ సౌరశక్తి హక్కు, దానికి తోడుగా సహాయక ఆర్థిక సహాయం, సామాజిక భాగస్వామ్యం, భారతదేశంలో ఇంధన ఖర్చులను తగ్గించడానికి, ఇంధన భద్రతను బలోపేతం చేయడానికి, లక్షలాది హరిత ఉద్యోగా లను సృష్టించడానికి, స్థితిస్థాపక, భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సమాజాలను నిర్మించడానికి సహాయపడనున్నాయి. స్వచ్ఛ ఇంధన విప్లవం ఇకపై సుదూర దృష్టి కాదు. సోలార్ కమ్యూనిటీల ద్వారా, ఇది భారతదేశంలోని ప్రతి గ్రామంలో, ప్రతి పరిసర ప్రాంతంలో, ప్రతి ఇంటి పైకప్పుపై ప్రారంభం కావచ్చుని అభిప్రాయం ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు.

సరసమైన ధరలో లభించే హరిత విద్యుత్తు అందుబాటులోకి రావడంవల్ల పిండి మిల్లులు, వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ యూనిట్లు, గ్రైండింగ్ మిల్లులు, ఇతర సూక్ష్మ పరిశ్రమల వంటి సంస్థలు ఆకర్షితులవుతాయి. ఈ అనుసంధానాలను సులభతరం చేయడంలో పంచాయతీలు, స్థానిక సంస్థలు కీలక పాత్ర పోషించగలవు. తద్వారా అదనపు ఉపాధిని సృష్టించి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలను బలోపేతం చేయగలవని అభిప్రాయం వ్యక్తమవుతోంది. అనేక నివాస సముదాయాలు అపార్ట్‌మెంట్ భవనాలు, పార్కింగ్ నిర్మాణాలు, ఉమ్మడి సౌకర్యాలపై రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నాయని కూడా ఇంధనరంగ నిపుణులు చెబుతున్నారు.

ఈ విధంగా ఉత్పత్తి అయిన విద్యుత్తు లిఫ్టులు, నీటి పంపులు, లైటింగ్ వ్యవస్థలు, భద్రతా మౌలిక సదుపాయాలకు శక్తిని అందిస్తుంది, తద్వారా నిర్వహణ ఖర్చులను తగ్గించి, నివాసితుల విద్యుత్ బిల్లులను తగ్గిస్తుంది.

శిలాజ ఇంధన ఆధారిత విద్యుత్తు స్థానంలో పునరుత్పాదక సౌరశక్తిని ఉపయోగించడం ద్వారా, సమాజాలు గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను, వాయు కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించగలవని అభిప్రాయం వ్యక్తమవుతోంది. సౌర సమాజాలు స్థానిక పర్యావరణ నాణ్యతను మెరుగుపరుస్తూనే, జాతీయ వాతావరణ లక్ష్యాలకు నేరుగా దోహదం చేస్తాయి.

సామాజిక ప్రయోజనాలు కూడా అంతే ముఖ్యమైనవి. సామాజిక యాజమాన్యంలోని ఇంధన వ్యవస్థలు పౌర భాగస్వామ్యాన్ని ప్రోత్సహిస్తాయి, సామాజిక సహకారాన్ని బలోపేతం చేస్తాయి. తక్కువ ఆదాయ వర్గాలకు, వెనుకబడిన వర్గాలకు స్వచ్ఛమైన, సరసమైన ఇంధన లభ్యతను మెరుగుపరుస్తాయని ఇంధనరంగ నిపుణులు పేర్కొంటున్నారు.



## ప్రైవేటు కళాశాలల్లో ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్
### ఫీజుల వ్యవహారంలో జోక్యం చేసుకోం: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ప్రవేశాల విషయంలో ఆర్థికంగా బలహీన వర్గాల (ఇడబ్ల్యుఎస్) నిబంధనను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ప్రైవేట్ వైద్యకళాశాలలు లక్షలరూపాయల ట్యూషన్ ఫీజులు వసూలు చేస్తున్నప్పుడు, ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకున్న రూ.8 లక్షల వార్షిక ఆదాయ పరిమితి అర్థరహితం అవుతుందన్న వాదనను అంగీకరించడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. ప్రైవేట్ వైద్య కళాశాలల ఫీజుల నిర్మాణం, ఆర్థికంగా బలహీన విద్యార్థులకు ఇడబ్ల్యుఎస్ రిజర్వేషన్‌ను కేవలం ఒక భ్రమగా మారుస్తోందని వాదించిన రాజస్థాన్ నివాసి అభ్యర్థి హర్షవర్ధన్ సింగ్ దాఖలు చేసిన సవాలును తిరస్కరించిన రాజస్థాన్ హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి జస్టిస్ బి.వి. నాగారత్న, జయమాల్య బాగ్చీలతో కూడిన ధర్మాసనం నిరాకరించింది. విచారణ సందర్భంగా, కేవలం ఇడబ్ల్యుఎస్ అభ్యర్థులకు సీట్లు రిజర్వ్ చేయబడ్డాయన్న కారణంతో, స్వయంనిధులు సమకూర్చుకునే ప్రైవేట్ సంస్థలను ప్రభుత్వ వైద్య కళాశాలలతో సమానంగా ఫీజులు వసూలు చేయమని బలవంతం చేయలేమని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం మౌఖికంగా వ్యాఖ్యానించింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ప్రభుత్వ కళాశాలలు ప్రభుత్వ ఖజానా నుండి ఆర్థిక సహాయం పొందుతుండగా, ప్రైవేట్ కళాశాలలు స్వీయనిధుల నమూనాపై పనిచేస్తాయని వ్యాఖ్యానించింది.

"ఇవి స్వీయనిధుల సంస్థలు. ప్రభుత్వ సంస్థలు రాష్ట్ర ప్రభుత్వం నుండి గ్రాంట్లు పొందుతాయి. రెండింటి మధ్య కీలకమైన వ్యత్యాసం ఉంది" అని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. క్యాపిటేషన్ ఫీజులు నిషేధించబడినప్పటికీ, వర్తించే నియంత్రణ చట్రంకింద నిర్ణయించిన సాధారణ ట్యూషన్ ఫీజు లను ప్రైవేట్ కళాశాలలు వసూలు చేయలేరని దీని అర్థం కాదనికూడా అది స్పష్టంచేసింది.

ఏటారూ.8 లక్షలకంటే తక్కువసంపాదించే కుటుంబాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఇడబ్ల్యుఎస్) అభ్యర్థులు, ప్రైవేట్ వైద్య కళాశాలల్లో రూ.18 లక్షల నుంచి రూ.25 లక్షల వరకు ఉండే వార్షిక ట్యూషన్ ఫీజులను వాస్తవంగా భరించలేరని పిటి షనర్ వాదించగా, ఆర్థిక సహాయ యంత్రాంగాలు అందుబాటులో ఉన్నాయని సుప్రీంకోర్టు సూచిం చింది. "మీరుచెల్లించలేకపోతే, స్కాలర్‌షిప్ పొందండి" అని జస్టిస్ నాగారత్న నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది.



### సిఎం సువేందును కొనియాడిన మహువా మొయిత్రా

**కోల్‌కత్తా,జూన్ 24:** పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి ప్రకంపనలు మొదలయ్యాయి. తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) ఎంపి మహువా మొయిత్రా, రాష్ట్ర ముఖ్యమంత్రి, బిజెపి నేత సువేందు అధికారిపై ప్రశంసలు కురిపించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ఆయనతో తనకు ఉన్న వ్యక్తిగత అనుబంధాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. పార్టీలో తిరుగుబాటు, ఎన్నికల్లో ఓటమితో టిఎంసి తీవ్ర సంక్షోభంలో ఉన్న తరుణంలో మహువా చేసిన ఈ వ్యాఖ్యలు రాజకీయ ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. బిబిసి ఇంటర్వ్యూలో మహువా మొయిత్రా మాట్లాడుతూ, సువేందు అధికారితో నాకు వ్యక్తిగతంగా మంచి సంబంధాలుఉన్నాయి. మేమిద్దరం టిఎంసిలో ఉన్నప్పుడు ఆయన నాకు ఎంతో మద్దతుగా నిలిచారు. 2016 అసెంబ్లీ ఎన్నికల్లో తాను కరింపూర్ నుంచి పోటీ చేసినప్పుడు, సీనియర్ నేతలెవరూ రాకపోయినా సువేందు తన తొలి ర్యాలీలో పాల్గొన్నారని ఆమె గుర్తు చేసుకున్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి చేతిలో టిఎంసి ఓటమి పాలైనవిషయం విదితమే. సువేందు అధికారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగా, మమతా బెనర్జీ సైతం పరాజయాన్ని చవిచూశారు. ఎన్నికల అనంతరం టిఎంసిలో సంక్షోభం మరింత ముదిరింది. రితబ్రత బెనర్జీ నేతృత్వంలోని తిరుగుబాటు వర్గం తమకు సుమారు 60 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని ప్రకటించింది. పలువురు ఎంపీలుకూడా బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే కూటమికి మద్దతు ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీలో టిఎంసి విలీనంఅవుతుందన్న వార్తల్లోను మహువా మొయిత్రా కొట్టిపారేశారు. మమతా బెనర్జీకి అత్యంత నమ్మకస్తురాలిగా పేరున్న మహువా, ఇప్పుడు ప్రత్యర్థి పార్టీకి చెందిన ముఖ్యమంత్రిని కొనియాడటం పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీసింది.

## హర్మూజ్ సుదీర్ఘ మూసివేతతో రూ.10.4 లక్షల కోట్ల సరకు నిలిపివేత




**టెహ్రాన్, వాషింగ్టన్,జూన్ 24:** ప్రపంచంలోనే అత్యంత రద్దీ సముద్ర రవాణా మార్గమైన హర్మూజ్ జలసంధి సుదీర్ఘకాలం మూసివేతతో అంతర్జాతీయ వాణిజ్యం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పర్షియన్ గల్ఫ్‌లో దాదాపు 125 బిలియన్ డాలర్లు అంటే సుమారు రూ. 10.4 లక్షల కోట్లు విలువైన సరుకుతో ఉన్న 1,200కి పైగా సరుకు రవాణా నౌకలు అక్కడే నిలిచిపోయినట్లు సముద్ర బీమా సంస్థలు, షిప్పింగ్ డేటా నివేదికలు వెల్లడించాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఈ అంతర్జాతీయ జలమార్గం గుండా రవాణా పూర్తిగా నిలిచిపోయింది. ప్రపంచవ్యాప్తంగా సరఫరా అయ్యే ముడి చమురు, ద్రవీకృత సహజ వాయువు (ఎల్ఎన్జీ)లో ఐదో వంతు వాటా ఈ ఇరుకైన జలసంధి గుండానే సాగుతుంది. ఫిబ్రవరి 2026 చివరలో ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులు చేయడంతో ఈ సంక్షోభం ప్రారంభమైంది. జూన్ మధ్యలో అమెరికా ఇరాన్ మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినప్పటికీ కాల్పుల విరమణ ఉల్లంఘనలు జరిగాయంటూ ఇరాన్ చేసిన తాజా ప్రకటనలు మళ్లీ ఆందోళనలను పెంచాయి. అలియాంజ్ కమర్షియల్ సేఫ్టీ అండ్ షిప్పింగ్ నివేదిక ప్రకారం జూన్ మధ్య నాటికి సుమారు 29 మిలియన్ గ్రాస్ టన్నుల బరువున్న 1,150 నుండి 1,200 సరుకు రవాణా నౌకలు నిలిచిపోయాయి. వీటితో పాటు దాదాపు 20,000 మంది నావికులు నెలల తరబడి సముద్రంలోనే చిక్కుకుపోయారు. ఆహార కొరత, మానవీయ సంక్షోభం ఎదుర్కొంటున్న ఈ సిబ్బందిని సురక్షితంగా తరలించేందుకు ఒమన్ దేశం సమన్వయంతో ఒక ప్రత్యేక తరలింపు కారిడార్‌ను ఏర్పాటు చేశారు. ఉద్రిక్తతలు గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో జరిగిన దాడుల్లో 40కి పైగా నౌకలు దెబ్బతినగా, కనీసం 14 మంది నావికులు మరణించారు. ఈ జలసంధి మూసివేత వల్ల ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు ఒక్కసారిగా పెరిగాయి. ముడి చమురు ధర కొన్ని సందర్భాల్లో బ్యారెల్‌కు 100 డాలర్లు దాటిపోయింది. నౌకలను ఆఫ్రికా చుట్టూ లేదా ప్రత్యామ్నాయ భూమార్గాల ద్వారా మళ్లించాల్సి రావడంతో రవాణా ఖర్చులు భారీగా పెరిగి, సరుకు సరఫరా ఆలస్యమవుతోంది. దాదాపు మూడు లక్షల కంటైనర్ కార్గో ఇంకా అక్కడే చిక్కుకుపోవడంతో ప్రాంతీయ ఓడరేవులపై తీవ్ర ఒత్తిడి పడుతోంది. ఉష్ణోగ్రతలకు దెబ్బతినే వస్తువులు, పాడైపోయే ఆహార పదార్థాల వల్ల బీమా క్లెయిమ్‌లు భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. జూన్ చివరి వారంలో గల్ఫ్ నుండి నౌకల రాకపోకలు కొంతవరకు పెరిగినట్లు షిప్పింగ్ డేటా సూచిస్తోంది. లెబనాన్‌లో జరిగిన ఉల్లంఘనల కారణంగా ఈ మార్గాన్ని మళ్లీ మూసివేస్తామని ఇరాన్ ప్రకటించడం అనిశ్చితిని పెంచింది. హర్మూజ్, సూయజ్ కాలువ వంటి కీలక జలమార్గాలపైనే పూర్తిగా ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కోవాల్సిన అవసరాన్ని ఈ సంక్షోభం గుర్తుచేస్తోందని షిప్పింగ్ రంగ ప్రముఖులు అభిప్రాయపడుతున్నారు.

## టెహ్రాన్‌కు ప్రయాణాలు రద్దుచేసుకోండి
### విదేశాంగశాఖ అడ్వయిజరీ జారీ

**టెహ్రాన్,జూన్ 24:** ఇరాన్‌లో భద్రతా పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భారత ప్రభుత్వం మరోసారి కీలక ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం విడుదల చేసిన తాజా సూచనల ప్రకారం, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు భారత పౌరులు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించింది. ఇటీవల పరిస్థితులు కొంత మెరుగుపడినప్పటికీ, పూర్తిస్థాయిలో సాధారణ స్థితి నెలకొనలేదని రాయబార కార్యాలయం పేర్కొంది. రాయబార కార్యాలయంప్రకారం, అవసరం లేకపోతే ప్రస్తుతం ఇరాన్‌కు ప్రయాణించకపోవడమే మంచిదని సూచించింది.

ప్రాంతీయ భద్రతా పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని, పరిస్థితులకు అనుగుణంగా తదుపరి సూచనలు జారీచేస్తామని వెల్లడించింది. ప్రస్తుతం ఇరాన్‌లో నివసిస్తున్న లేదా అక్కడికి అత్యవసరంగా వెళ్లాల్సిన భారతీయులు అప్రమత్తంగా ఉండాలి. స్థానిక అధికారుల సూచనలను పాటించాలి. తాజా భద్రతా సమా చారం కోసం అధికారిక ప్రకటనలను గమనించాలి. భారత రాయబార కార్యాలయంతో నిరంతర టచ్‌లో ఉండాలి అని సూచించింది. రాయబార కార్యాలయంలో నమోదు తప్పనిసరి అని పేర్కొంది. ఇరాన్‌లో ఉన్న భారత పౌరులు, అలాగే త్వరలో అక్కడికి వెళ్లే వారు తమ వివరాలను టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో సహాయం అందించడానికి ఈ నమోదు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

## భారీ వర్షాలతో ముంబయి అతలాకుతలం



### మ్యాన్‌హోల్‌లో పడిపోయిన వ్యక్తిని రక్షించిన సిబ్బంది

**ముంబయి,జూన్ 24:** ఆర్థికరాజధాని ముంబయి మహానగరాన్ని భారీ వర్షాలు అతలాకుతలం చేసాయి. ముంబైను పలకరించిన రుతుపవనాలు తొలిరోజే నగరాన్ని అతలాకుతలంచేశాయి. రాత్రంతా కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీనికితోడు, ముంబైలో రుతుపవనాల కోసం తాము పూర్తిగా సిద్ధంగా ఉన్నామని, నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తామని మేయర్ రితూ తావడే ప్రకటించిన కొద్ది సేపటికే, అది కూడా ఆమె కళ్లెదుటే ఒక కార్మికుడు మ్యాన్‌హోల్‌లో పడిపోవడం పాలనాయంత్రాంగం వైఫల్యాన్ని ఎత్తిచూపింది. వెంటనే అప్రమత్తమైన పోలీసులు, పౌర సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి అతడిని సురక్షితంగా బయటకు తీయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు కొద్ది నిమిషాల ముందు గాంధీ మార్కెట్ వద్ద మేయర్ రితూ తావడే మాట్లాడుతూ నగరంలో పంపులన్నీ పనిచేస్తున్నాయని, రోడ్లు శుభ్రంగా ఉన్నాయని, అధికారులు క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. నాలాలు శుభ్రపరిచే పనులు దాదాపు పూర్తయ్యాయని, విమర్శలు చేస్తున్న వారు ఈ రోజు ఇళ్లలో కూర్చున్నారని ఆమె వ్యాఖ్యానించారు. అయితే, ఆమె ప్రకటనకు భిన్నంగా వాస్తవ పరిస్థితి కనిపించింది. సాధారణంగా జూన్ 10న ప్రవేశించాల్సిన రుతుపవనాలు ఈసారి 13 రోజులు ఆలస్యంగా ముంబైకి చేరాయి. రాత్రిపూట కురిసిన భారీ వర్షానికి నగరం గడిచిన 24 గంటల్లో సగటున 195 మిల్లీమీటర్ల వర్షపాతాన్ని నమోదు చేసింది. పశ్చిమ శివారు ప్రాంతాల్లో 208 మి.మీ., తూర్పు శివారు ప్రాంతాల్లో 167 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో అంధేరి సబ్‌వే, హింద్‌మాతా, కింగ్స్ సర్కిల్ వంటి ప్రాంతాలు నీటిలో మునిగిపోయాయి. ఉదయం వేళ ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల కారణంగా సబర్బన్ రైలు సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు కిక్కిరిసిపోయారు.



### టివికె ఎమ్మెల్యే బిడ్డకు టివికె పేరుపెట్టిన సిఎం

**చెన్నై,జూన్ 24:** టివికె చీఫ్, సిఎం జోసఫ్ విజయ్, టివికె ఎమ్మెల్యే ఎంఆర్ పల్లవికి పుట్టిన శిశువుకు అధికారికంగా తమిళ్ వెట్రికొండన్ అని నామకరణం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యే కుటుంబ సభ్యుల మధ్య పండగ వాతావరణంలో సచివాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఆ పసికందును ఆప్యాయంగా ఒడిలోకి తీసుకొని పేరు పెట్టి ముద్దు చేశారు. ఎంఆర్ పల్లవి తిరువికా నగర్ నియోజకవర్గం నుంచి టివికె తరఫున తొలిసారిగా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నిండు గర్భిణిగా ఉన్నప్పటికి ఇంటింటికి ప్రచారం చేసి ఆమె వార్తల్లో నిలిచారు. అయితే పల్లవి టివికె పార్టీ మొదటి అక్షరాలు కలిసొచ్చేలా బిడ్డకు పేరు పెట్టాలని బలంగా కోరుకున్నారు. ఇదే విషయాన్ని సిఎం విజయ్ దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన సిఎం టివికె పార్టీ స్ఫురించేలా తమిళ్ వెట్రికొండన్(టివికె) అని పేరు పెట్టారు. అయితే తమిళ వెట్రి కొండన్ అనే పేరు విజయ్ నటించిన రాబోయే జననాయగన్ చిత్రంలో విజయ్ పాత్ర పేరు కావడం విశేషం.

## నిర్మాణంలో ఉన్న గోడౌన్ కూలి ఎనిమిది మంది మృతి



### 45 మందికిపైగా శిథిలాల కిందనే

**కోల్‌కత్తా,జూన్ 24:** కోల్‌కతాలో కనీవినీ ఎరుగని ఘోర విషాదం చోటుచేసుకుంది. నిర్మాణంలో ఉన్న గిడ్డంగి పైకప్పు కూలిపోవడంతో ఘోర ప్రమాదం జరిగింది. 40నుంచి 45 మంది చిక్కుకుపోయినట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో 8 మంది చనిపోగా మరికొందరు తీవ్రగాయాల పాలైనట్లుగా తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలికి చేరుకుని సహాయ చర్యలు చేపట్టారు. కోల్‌కతాలోని తారతల పోలీస్ స్టేషన్ పరిధిలోని ట్రాన్స్‌పోర్ట్ డిపోరోడ్డులో నిర్మాణంలోఉన్న ఒకగిడ్డంగి పైకప్పుకూలిపోయింది. పెద్ద సంఖ్యలో కార్మికులు అందులో చిక్కుకుపోయినట్లు భావిస్తున్నారు. ఈ ఘటన గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, పరిపాలనా బృందాలు సంఘటనా స్థలానికి చేరుకున్నాయి. సహాయక, రెస్క్యూ ఆపరేషన్లు కొనసాగుతున్నాయి. స్థానికుల కథనం ప్రకారం నిర్మాణంలో ఉన్న భవనం పక్కన చాలా మంది పనిచేస్తున్నారు. సహాయక, రెస్క్యూ బృందాలు ఏడుగురిని రక్షించారు. స్థానికులు కూడా సహాయక చర్యలు ప్రారంభించారు. షెడ్లు, శిథిలాలకింద చిక్కుకున్న వారిని రక్షిస్తున్నారు. ఈ ఘటనలో పెద్ద సంఖ్యలో ప్రజలు గాయపడి ఉంటారని భావిస్తున్నారు. రక్షించబడిన వారిని పరిపాలనా బృందాలు ఆసుపత్రులకు తరలించాయి.

## సంక్షిప్త వార్తలు

### ఖొమేనీ అంత్యక్రియలకు ప్రధాని మోడీకి ఆహ్వానం



**టెహ్రాన్,జూన్ 24:** ఇరాన్ మాజీ సుప్రీంలీడర్ అలీ ఖొమేనీ అంత్యక్రియలకు హాజరుకావాలని భారత ప్రధాని మోదీకి ఇరాన్ ప్రత్యేక ఆహ్వానం పంపించింది. ఈ మేరకు ఆ దేశ అధ్యక్షుడు పెజెష్కియాన్ స్వయంగా లేఖ రాసినట్లు తెలుస్తోంది. మరి దీనిపై కేంద్రం ఎలా స్పందిస్తుందనేది ఆసక్తికరంగా మారింది. భారత్ ఇప్పటివరకు ఇరాన్ అమెరికా ఉద్రిక్తతల విషయంలో శాంతి, చర్చల ద్వారానే పరిష్కారం కావాలని తన వైఖరిని కొనసాగిస్తోంది. ఖొమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు జులై 4న ప్రారంభం కానున్నాయి. పలు దశల్లో జరిగే నివాళి కార్యక్రమాల అనంతరం జులై 9న ఆయన స్వస్థలమైన మష్హాద్‌లో ఖననం చేయనున్నారు. టెహ్రాన్, ఖోమ్ నగరాల్లో కూడా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

### పాక్ గగనతలంలోకి ఎయిరిండియా విమానం

**న్యూఢిల్లీ,జూన్ 24:** ఎయిర్ ఇండియాకు చెందిన ఎఐ321 ఢిల్లీ అమృత్‌సర్ విమానం పాకిస్థాన్ గగనతలంలోకి ప్రవేశించింది. దీంతో కొంత ఉద్రిక్త క్షణాలు నెలకొన్నాయి. అయితే పెహల్గామ్ ఉగ్రదాడి ఘటన తర్వాత రెండు దేశాల మధ్య సరైన సంబంధాలు లేని విషయం తెలిసిందే. సోమవారం రాత్రి ఎయిర్ ఇండియాకు చెందిన విమానం కొన్ని సెకన్ల పాటు పాక్ గగనతలంలోకి ప్రవేశించినట్లు తెలిసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఎయిర్ ఇండియా చెప్పింది. పాక్ వైమానిక క్షేత్రంలోకి ప్రవేశించిన విషయాన్ని పైలట్ గుర్తించాడని, పాకిస్థాన్ ఎయిర్ ట్రాఫిక్ అథారిటీ నుంచి పైలట్‌కు వార్నింగ్ మెసేజ్‌లు వచ్చినట్లు తెలిసింది.

### ఇరాన్‌పై సైనిక చర్యలు: ట్రంప్ అధికారాల కట్టడి

**వాషింగ్టన్,జూన్ 24:** ఇరాన్‌పై సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు స్వదేశంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇరాన్‌తో ఘర్షణలకు దిగకుండా అమెరికా బలగాలను ఉపసంహరించుకోవాలని ఆదేశిస్తూ యూఎస్ సెనేట్ మంగళవారం ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 50 ఓట్లు, వ్యతిరేకంగా 48 ఓట్లు వచ్చాయి. అధికార రిపబ్లికన్ పార్టీకి చెందిన నలుగురు సెనేటర్లు డెమొక్రాట్లతో కలిసి ఈ తీర్మానానికి మద్దతు తెలపడం గమనార్హం. ఇప్పటికే ప్రతినిధుల సభలోనూ ఇదే తరహా తీర్మానం ఆమోదం పొందింది. ఉభయ సభల ఆమోదం లభించిన నేపథ్యంలో, దీనికి అధ్యక్షుడి సంతకం అవసరం లేదు. ఇది చట్టబద్ధంగా ట్రంప్‌ను కట్టడి చేయలేకపోయినప్పటికీ, రాజకీయంగా ఆయనపై తీవ్ర ఒత్తిడి పెంచుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

### తమిళనాట నవజాత శిశువులకు బంగారు ఉంగరం

**చెన్నై,జూన్ 24:** తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ మరో సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తాయిమామన్ గోల్డ్ రింగ్ పథకాన్ని త్వరలోనే ప్రారంభించనున్నారు. ఈ పథకం కోసం బడ్జెట్ లో రూ. 755.83 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 22 నుంచి ప్రభుత్వ ఆస్పత్రిలో పుట్టిన బిడ్డలకు ఈ పథకం వర్తిస్తుందని స్పష్టం చేశారు. తాయిమామన్ గోల్డ్ రింగ్ స్కీమ్‌ను సెప్టెంబర్ 15న పెరియార్ అన్నా జన్మదినం సందర్భంగా ప్రారంభిస్తామని సిఎం విజయ్ పేర్కొన్నారు. ఇదే విషయంపై రాష్ట్ర ఆరోగ్య, మానవవనరుల శాఖ ప్రకటన చేసింది. తమిళనాడులో శాశ్వత నివాసం ఉన్న కుటుంబాలకు మాత్రమే ఈ పథకంవర్తిస్తుందని తెలిపింది.

### ఖతార్‌లో భారతీయుల మృతికి అమీర్ సంతాపం

**న్యూఢిల్లీ, జూన్ 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఖతార్ దేశ అమీర్ షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీ టెలిఫోన్‌లో సంభాషించారు. ఖతార్‌లోని రాస్ లఫాన్ ఇండస్ట్రియల్ సిటీలో ఆదివారం జరిగిన ప్రమాదంలో భారతీయులు మృతి చెందిన ఘటనపై అమీర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అలాగే గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబాల పట్ల సానుభూతి వ్యక్తం చేసినందుకు ప్రధాని మోడీ ఖతార్ అమీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి ఖతార్ ప్రభుత్వం వెంటనే వైద్య సహాయం అందించినందుకు ఆయన ప్రశంసించారు. ఈ సందర్భంగా ఇరు దేశాల నాయకులు తమ దేశ పౌరుల సంక్షేమం, భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని పునరుద్ఘాటించారు.



## సిఎం చంద్రబాబుకి ఉద్యోగ సంఘాల కృతజ్ఞతలు

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల దీర్ఘకాలిక డిమాండ్లను పరిష్కరిస్తూ రాష్ట్ర మంత్రిమండలి తీసుకున్న కీలక నిర్ణయాల పట్ల ఉద్యోగ సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపినందుకు ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా అభినందనలు తెలియజేశారు. పలు విభాగాల్లో ఉద్యోగుల పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచడం, పాత పెన్షన్ విధానం (ఓపిఎస్) వర్తింపజేయడం వంటి నిర్ణయాలు వేలాది మంది ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుస్తాయని నేతలు పేర్కొన్నారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం లభించడం పట్ల వారు సంతోషాన్ని వెలిబుచ్చారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) నోటిఫికేషన్‌కు ముందే నియామక ప్రక్రియ పూర్తయి, ఆ తర్వాత విధుల్లో చేరిన వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేస్తూ ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ప్రభుత్వ నిర్ణయాలు ఉద్యోగ వర్గాల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయని నేతలు అభిప్రాయపడ్డారు. సిఎం చంద్రబాబు గత రాత్రి స్వయంగా కలిసి కృతజ్ఞతలు తెలిపిన వారిలో ఎపి జెఎసి చైర్మన్ విద్యాసాగర్ తెలిపారు. ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఎపి సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నాపా ప్రసాద్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధి కోసం ఉద్యోగులందరూ కలిసికట్టుగా కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారికి సూచించారు.

## ప్రజల సమస్యలన్నింటిని నిర్దిష్ట విధానాల్లో, సంతృప్త స్థాయిలో పరిష్కరిస్తాం

• శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించడంలో గత ప్రభుత్వ విఫలమైందని రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖల మంత్రి పయ్యావుల కేశవ్ వ్యాఖ్యానించారు. అన్ని రంగాలను ఆ ప్రభుత్వ తన అనుచిత విధానాలతో నిర్వీర్యం చేసిందన్నారు. తమ ప్రభుత్వం పాలనా వ్యవస్థను సరిదిద్దిందన్నారు. ప్రజల సమస్యలన్నింటిని నిర్దిష్ట విధానాల్లో, సంతృప్త స్థాయిలో పరిష్కరిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారానికి మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజాదర్బార్' కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలను స్వయంగా కలుసుకుని, వారి సమస్యలు, వినతులను విని వారి నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమగ్రంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కారం అందించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడం కూటమి ప్రభుత్వ ప్రధాన బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి, సమర్థవంతమైన పాలన, పారదర్శకతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన స్పష్టం చేశారు.

## ప్రకృతి విపత్తుల నియంత్రణపై కొడూరులో అంతర్రాష్ట్ర మాక్ ఎక్సర్‌సైజ్

### దక్షిణాది రాష్ట్రాల విపత్తుల నివారణ ప్రతినిధులు హాజరు



**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రాల మధ్య విపత్తు సంసిద్ధత, పరస్పర సమన్వయం, అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలను మరింత బలోపేతం చేయాలనే లక్ష్యంతో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం ఆధ్వర్యంలో బుధవారం కృష్ణా జిల్లా కొడూరు మండలంలో దక్షిణ భారత స్థాయిలో అంతర్ రాష్ట్ర మాక్ ఎక్సర్‌సైజ్-2026 విజయవంతంగా నిర్వహించారు. ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాలకు అనుగుణంగా దక్షిణ ప్రాంతానికి సంబంధించి ఈ విన్యాసాన్ని నిర్వహించారు. ప్రధాన రాష్ట్రాల ఆంధ్రప్రదేశ్ జాతీయ విపత్తు నియంత్రణ సంస్థ గుర్తించింది. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ హరీష్‌కుమార్ గుప్తా మార్గ దర్శకత్వంలో ఎన్.మధుసూదన రెడ్డి, అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్), డా. ఫక్కీరప్ప కాగినెల్లి డిఐజి (లా అండ్ ఆర్డర్), డి. ఉదయ్ భాస్కర్, డిఐజి (ఏపీఎస్పీ బెటాలియన్స్), ప్రఖర్ జైన్‌మేనేజింగ్ డైరెక్టర్, డి.కె. బాలాజీ, జిల్లా కలెక్టర్, కృష్ణా జిల్లా, వి. విద్యాసాగర్ నాయుడు, పోలీస్ సూపరింటెండెంట్, వి.వి.ఎస్. ప్రసన్న కుమార్, కమాండెంట్, 10వ బెటాలియన్, ఎన్డీఆర్ఎఫ్ వారి సహకారంతో, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ ఆధ్వర్యంలో ఎపిఎస్‌డిఎంఎ, జిల్లా యంత్రాంగం, ఎన్డీఆర్ఎఫ్, ఇతర భాగస్వామ్య శాఖల సమన్వయంతో దక్షిణ ప్రాంత సంయుక్త విపత్తు నిర్వహణ విన్యాసం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ఎపిఎస్పి బెటాలియన్స్, ఎపిఎస్‌డిఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి. రాజకుమారి, ప్రధాన సమన్వయకర్తగా వ్యవహరించారు. విన్యాసానికి సంబంధించిన అన్ని ప్రణాళికలు, సమన్వయ చర్యలు, కార్యాచరణ ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ శాఖల మధ్య సమర్థవంతమైన సమన్వయాన్ని నిర్దేశించారు. ఈ విన్యాసానికి ముందస్తు సన్నాహక కార్యక్రమాలలో భాగంగా ఇటీవల సన్నాహక సమావేశం నిర్వహించారు. అనుసరణగా టేబుల్‌టాప్ ఎక్సర్‌సైజ్ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. ప్రధాన విపత్తులు, అత్యవసర పరిస్థితుల్లో ప్రాంతాల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం, విపత్తు సంసిద్ధతను పెంపొందించడం, ఉమ్మడి ప్రతిస్పందన వ్యవస్థలను మెరుగుపరచడం ఈ విన్యాసం ముఖ్య ఉద్దేశ్యం. ఈ మాక్ ఎక్సర్‌సైజ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎస్‌డిఆర్ఎఫ్ జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక శాఖ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ శాఖ, విద్యుత్ శాఖ, మత్స్యశాఖ, పశు సంవర్ధక శాఖ, నీటిపారుదల శాఖ, సముద్ర శాఖ, స్థానిక పోలీసులు, పంచాయతీ రాజ్ శాఖ, హోం గార్డులు, వాలంటీర్లు, స్థానిక ప్రజలు, ఇతర భాగస్వామ్య సంస్థలు చురుకుగా పాల్గొన్నాయి. వరద పరిస్థితుల్లో నిర్వహించాల్సిన శోధన, రక్షణ చర్యలు, ప్రభావిత ప్రజల తరలింపు, వైద్య సహాయం, సహాయక శిబిరాల నిర్వహణ, కమ్యూనికేషన్ వ్యవస్థల సమన్వయం, వివిధ శాఖల సమగ్ర ప్రతిస్పందన విధానాలను ఈ విన్యాసంలో ప్రదర్శించారు. ఈ విన్యాసం ద్వారా రాష్ట్రాల మధ్య పరస్పర సహకారం, వనరుల భాగస్వామ్యం, అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాలు, విపత్తు నిర్వహణలో భాగస్వామ్య సంస్థల మధ్య సమన్వయం మరింత బలోపేతం అవుతుందని అధికారులు తెలిపారు. వాతావరణ మార్పుల ప్రభావంతో వరదలు, తుఫానులు వంటి ప్రకృతి వైపరీత్యాలు తరచూగా సంభవిస్తున్న నేపథ్యంలో, ఇటువంటి మాక్ ఎక్సర్‌సైజ్‌లు విపత్తు సంసిద్ధతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు పేర్కొన్నారు. ఆధునిక సాంకేతికతల వినియోగం, సమర్థవంతమైన సమన్వయ వ్యవస్థలు, ముందస్తు సంసిద్ధత చర్యల ద్వారా ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విపత్తు నిర్వహణ వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని డిజిపి హరీష్‌కుమార్ గుప్తా పునరుద్ఘాటించారు.

## శివయ్య సన్నిధిలో నటి హన్సిక పూజలు



**శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త:** సినీ నటి హన్సిక బుధవారం శ్రీకాళహస్తీశ్వరాలయంలో రాహుకేతుదోష నివారణ పూజలు జరిపించుకున్నారు. ఆమె తమ బంధువులతో రాగా దక్షిణ గోపురం వద్ద బిజెపి యువ నాయకుడు కటికం వందు స్వాగతం పలికారు. రాహుకేతుదోష పూజల అనంతరం ఆమెకు స్వామి అమ్మ వార్ల ఆలయంలో అంతరాలయ దర్శనం ఏర్పాటు చేశారు. తరువాత మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు అందించారు.



# అదిగదిగో పులి

• పాపికొండల్లో బెబ్బులి భయం • పర్యాటక రంగంపై ప్రభావం.

• పెద్ద పులి సంచారంతో గిరిజన గ్రామాల్లో ఆందోళన



**ఏలూరు, జూన్ 24 ప్రభాతవార్త బ్యూరో:** పాపికొండల అభయారణ్యం నుంచి బయటకు వచ్చిన పెద్దపులి సంచారం మరోసారి ఏలూరు జిల్లా అటవీ ప్రాంతాల్లో సంచరించడంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఉలిక్కి పడేలా చేసి ఈ వార్త చర్చనీయాంశంగా మారింది. మంగళవారం బుట్టాయగూడెం మండల పరిధిలో పులి కదలికలు నమోదవడంతో సమీప గిరిజన గ్రామాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. బుధవారం బుట్టాయగూడెం మండలం పులిరాముడు గూడెంలో పరిసరాల్లో ఉందని ఏలూరు జిల్లా అటవీ శాఖ అధికారి పీవీ సందీప్ రెడ్డి తెలిపారు. అయితే పులి దాడిలో రెండు ఆవులు మృతి చెందిన ఘటన స్థానికుల్లో మరింత ఆందోళన పెంచింది. మరోవైపు ఈ పరిణామాలు ప్రసిద్ధ పర్యాటక కేంద్రమైన పాపికొండల పర్యాటక రంగంపైనా ప్రభావం చూపుతున్నాయి.

**పశువులపై దాడి:** నిమ్మలగూడెం శివారులోని పాలకుంట చెరువు సమీపంలో మేతకు వెళ్లిన రెండు ఆవులపై పెద్దపులి దాడి చేసి చంపినట్లు సమాచారం. ఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీశాఖ అధికారులు పులి అడుగుజాడలను గుర్తించారు. పులి కదలికలను నిర్ధారించేందుకు రేడియో కాలర్ ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

**వెలవెలబోతున్న పాపికొండలు:** ప్రకృతి సౌందర్యం, గోదావరి విహార యాత్రలకు ప్రసిద్ధి చెందిన పాపికొండలకు ప్రతి సంవత్సరం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. అయితే ఇటీవల పులి సంచారం వార్తలు వెలుగులోకి రావడంతో కొంతమంది పర్యాటకులు పర్యటనలను వాయిదా వేసుకుంటున్నట్లు రాజమండ్రికి చెందిన టూరిజం నిర్వాహకులు చెబుతున్నారు. పులి జాడ తెలుసుకుని తమ భద్రతపై సందేహాల కారణంగా కుటుంబాలతో వచ్చే సందర్శకుల సంఖ్య తగ్గినట్లు తెలుస్తోంది.

**ప్రజల భద్రతపై దృష్టి:** సమీప అటవీ ప్రాంతాల్లో ఒంటరిగా తిరగవద్దని, రాత్రి వేళల్లో అడవుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని అటవీశాఖ అధికారులు సూచించారు. పశువులను అడవి అంచులకు మేతకు పంపే సమయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ పులి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం జిల్లా కలెక్టర్‌కు, స్థానిక అధికారులకు అందిస్తున్నారు.

**నిర్వహణపై ప్రశ్నలు:** వన్యప్రాణి మెడకు రేడియో కాలర్ అమర్చినప్పటికీ, అది జనావాసాలకు చేరుకోవడం స్థానికుల్లో పలు ప్రశ్నలను లేవనెత్తుతోంది. పులి కదలికలను ముందుగానే గుర్తించి గ్రామాలకు హెచ్చరికలు ఇవ్వడంలో వ్యవస్థ ఎంతవరకు సమర్థంగా పనిచేస్తోందనే చర్చ జరుగుతోంది. వన్యప్రాణుల సంరక్షణతో పాటు గ్రామీణ ప్రజల భద్రతకు కూడా సమాన ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

**మానవ- వన్యప్రాణి సంఘర్షణకు సంకేతమా?:** అటవీ ప్రాంతాల విస్తీర్ణం తగ్గడం, ఆహార లభ్యతలో మార్పులు, వన్యప్రాణుల సహజ సంచార మార్గాల్లో మానవ జోక్యం పెరగడం వంటి కారణాలతో పులులు జనావాసాల వైపు వచ్చే ఘటనలు పెరుగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. పాపికొండల పరిసరాల్లో తాజా పరిణామాలు కూడా మానవవన్యప్రాణి సంఘర్షణ సమస్యను మరోసారి తెరపైకి తెచ్చాయి. ప్రజల భద్రత, వన్యప్రాణుల సంరక్షణ రెండింటినీ సమన్వయం చేస్తూ దీర్ఘకాలిక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పర్యావరణ వర్గాలు సూచిస్తున్నాయి.

**బుట్టాయగూడెంలో పెద్దపులి సంచారం:** పాపికొండలు అభయారణ్యం నుంచి జనావాసాల్లోకి అడుగుపెట్టిన పులి బుధవారం బుట్టాయగూడెం మండలం పులిరాముడు గూడెం ప్రాంతంలో సంచరించినట్లు గురజాడలు గుర్తించామని ఏలూరు జిల్లా ఫారెస్ట్ అధికారి పివి సందీప్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుట్టాయ గూడెం మండలంలోని గుంజవరం, కన్నాపురం, చింతలగూడెం, బుట్టాయగూడెం, దొర మామిడి, కొవ్వాడ, లంకపాకల, వీరన్నపాలెం, మునులూరు, రవ్వారీ గూడెం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఈ మేరకు అటవీశాఖ అధికారులు అన్ని రకాల ముందస్తు రక్షణ చర్యలను చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాలలోని చేపల వేట, పశువుల మేత, అటవీ ప్రాంతంలో సంచరించుట వంటి చర్యలకు పాల్పడవద్దని స్థానిక ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా పులి రాత్రి వేళల్లో జనావాసాలకు దగ్గరగా వస్తున్నందున పశువులను బహిరంగంగా ఉంచవద్దని సూచించారు. అలాగే గ్రామంలోని లైట్లు వెలిగే ఉండాలని కోరారు. ప్రజలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా క్షేత్రస్థాయిలో తమ సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక బృందాలను పులి బోనులను ఏర్పాటు చేశారు. నిమ్మలగూడెంలో పులికి ఆహారమైన రెండు పశువుల యజమానులకు అటవీ శాఖ తరపున నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

# అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠా గుట్టురట్టు




**పలమనేరు, జూన్ 24 ప్రభాతవార్త:** కోట్ల రూపాయల డిమాండ్‌తో ఆరితేరిన అంతరాష్ట్ర కిడ్నాప్ ముఠాను చిత్తూరు జిల్లా పలమనేరు పోలీసులు ఛేదించారు. జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశాల మేరకు పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి తన సిబ్బందితో దాడిచేసి 11 మందిని అరెస్టు చేయగా మరో 11 మంది పరారీ అయ్యారు. బుధవారం డిఎస్పీ డేగల ప్రభాకర్ విలేకర్లకు తెలిపిన వివరాలు. గంగవరం మండలం గంగవరంకు చెందిన ఎంసి రవి (47)ను కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు ఈ నెల 7న పలమనేరు గుడియాత్తం రోడ్డులోని టి.వడ్డూరు క్రాస్ వద్ద కిడ్నాప్ చేశారు. కడప జిల్లా పులివెందులకు తీసుకు వెళ్ళి రవి కుటుంబ సభ్యులకు ఫోన్ చేశారు. రూ.2 కోట్లు అందజేయాలని లేదంటే చంపుతామని బెదిరించారు. దీంతో రవి కుటుంబ సభ్యులు ఈ నెల 8న ఉదయం చిక్‌బళ్ళాపూర్ హైవే వద్ద రూ.1 కోటి అందజేశారు. కిడ్నాపర్లు ఈ మొత్తం తీసుకొని బాధితుని వద్ద ఉన్న 900 గ్రాముల బంగారు ఆభరణాలు బలవంతంగా లాక్కొని బాధితుని అక్కడే వదిలి పరారీ అయ్యారు. బాధితుని ఫిర్యాదు మేరకు పలమనేరు సిఐ మోహన్‌రెడ్డి కేసు దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా కేరళకి చెందిన రోషన్ గ్యాంగ్ సభ్యులు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలకు చెందిన కొందరు వ్యక్తులు కలసి కుట్రపన్ని ఈ నేరం చేసినట్లు దర్యాప్తులో తేలింది. భానుప్రకాశ్ అనే వ్యక్తి బాధితుడు రవి కదలికలను ఎప్పటికప్పుడు నాగేశ్వరరెడ్డి అనే వ్యక్తి ద్వారా కిడ్నాప్ గ్యాంగ్‌కు తెలియజేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ నేపథ్యంలో రవిని కిడ్నాప్ చేయడానికి అవసరమైన వాహనాలు సమకూర్చుకొని గంగవరంలో ఓ లాడ్జిలో బసచేశారు. ఈ నెల 7న బాధితుని కదలికలు గమనించి టి.వడ్డూరు క్రాస్ వద్ద కిడ్నాప్ చేసి పులివెందులకు తరలించారు. దాంతో పోలీసులు సాంకేతిక ఆధారాలు సిసిటివి ఫుటేజీలు మొబైల్ కాల్‌డేటా వాహనాల కదలికలు ఇతర శాస్త్రీయ ఆధారాలతోఈ కేసులో వున్న కేరళకు చెందిన 7 మందిని ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన నలుగురిని అరెస్టు చేశారు. కిడ్నాప్‌కు ఉపయోగించిన వాహనాన్ని గంగవరం మండలం గండ్రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద సీజ్ చేశారు. నిందితులను అరెస్టు చేసి పలమనేరు కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించారు. నిందితుల నుండి రూ.22 లక్షలు నగదు, మూడు కార్లు మారుతీ స్విఫ్ట్ డిజైర్, జియా సోనెట్, ఇన్నోవా కారును స్వాధీనం చేసుకున్నారు. రోషన్ వర్గానికి చెందిన గ్యాంగ్‌లీడర్ రోషన్‌నర్గీస్ పరారీలో వున్నాడు. ఇక అరెస్టు అయిన వారిలో అప్పు అరుణ్, ఎడ్విన్ థామస్, దీపు మోస్, నితిన్‌జానీ, కెస్ అభయ్, రతీష్, లిబిన్ ఉన్నారు. అలాగే ఏపి, తెలంగాణాకు చెందిన వారిలో కడపజిల్లా సింహాద్రిపురం ఉప్పలూరుకు చెందిన నాగేశ్వరరెడ్డి, వనపర్తి జిల్లాకు చెందిన మహేష్ నాయుడు, ప్రొద్దుటూరుకు చెందిన పందేళ్ళపల్లెకు చెందిన రామిరెడ్డి, పొద్దుటూరుకు చెందిన గుండ్రా మహేష్‌రెడ్డి అరెస్టు అయిన వారిలో ఉన్నారు. ఇక పరారీలో వున్న వారు సచూ, అనూప్, నికిల్ మోహన్, స్వాజీ (జిత్తు), అరుణ్, సామి, అమీన్, జస్వంత్ (వరప్రసాద్), అనిల్, మరో వ్యక్తి ప్రణీత్ రెడ్డి స్నేహితుడు కృష్ణారెడ్డి పరారీలో వున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు రోషన్‌పై కేరళలోని వివిధ పోలీస్ స్టేషన్లలో హత్యాయత్నం, దాడులు, బెదిరింపులు, పేలుడు పదార్థాలు కలిగి వుండడం మొత్తం 15 క్రిమినల్ కేసులు ఉన్నాయి. ఈ కేసును ఛేదించిన సిఐ మోహన్‌రెడ్డి, సిబ్బందిని జిల్లా ఎస్పీ, డిఎస్పీ అభినందించారు.

## సుస్థిరత ప్రభావ మదింపులలో పద్మావతి వర్సిటీకి ఇంపాక్ట్ రేటింగ్స్

**తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం (ఎస్‌పిఎంవివి) సుస్థిరత ప్రభావ మదింపులులో 2026 విశ్వవిద్యాలయం ర్యాంక్ బ్యాండ్‌ను సాధించింది. ప్రపంచవ్యాప్తంగా విశ్వవిద్యాలయాలు పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యత, స్థిరమైన అభివృద్ధి లక్ష్యాల సాధన, సమాజానికి అందిస్తున్న సేవలు వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకింగ్స్‌ను ప్రకటిస్తారు. ఈ సందర్భంగా పద్మావతి మహిళ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య వెన్నం ఉమ,రిజిస్ట్రార్ ఆచార్య ఆర్. ఉషఆనందం వ్యక్తం చేశారు. ఈ ఘనత సాధించడంలో కీలక పాత్ర పోషించిన ర్యాంకింగ్ డైరెక్టర్ ఆచార్య పి. వెంకట కృష్ణతో పాటు ర్యాంకింగ్ బృంద సభ్యులందరినీ అభినందించారు. విశ్వవిద్యాలయం సుస్థిర అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, సామాజిక బాధ్యతల పట్ల చూపుతున్న నిబద్ధతకు ఈ ర్యాంకింగ్ నిదర్శనమని వారు పేర్కొన్నారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలను సాధించేందుకు విశ్వవిద్యాలయం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఈ విజయానికి సహకరించిన అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ఇతర భాగస్వాములందరికీ వారు అభినందనలు తెలియజేశారు.

## బ్రహ్మోత్సవాలకు ఉద్యానవనాలను సుందరంగా తీర్చిదిద్దాలి

- టిటిడి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి



**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రానున్న బ్రహ్మోత్సవాలకు తిరుమలలోని ఉద్యానవనాలను అత్యంత సుందరంగా తీర్చిదిద్దడంతో బాటు ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉన్న మొక్కలను పెంచేలా చర్యలు చేపట్టాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరిచెప్పారు. తిరుమలలో ఆధ్యాత్మిక వనాలను విరివిగా అభివృద్ధి చేయాలని సూచించారు. తిరుమలలో జిఎన్‌సి, గీత పార్క్, నామాల పార్క్ వంటి వివిధ ఉద్యానవనాలను ఆయన బుధవారం పరిశీలించి టిటిడి ఉద్యానవన, అటవీ శాఖల అధికారులతో కలసి తనిఖీ చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట అటవీశాఖ విభాగం డిప్యూటీ సిఎఫ్ ఫణి కుమార్ నాయుడు, ఉద్యానవన విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, పిఆర్ఒ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

# మోడీ విధానాలతోనే రూపాయి ఢమాల్!

• రాజ్యాంగాన్ని మార్చడానికి కుట్రలు, కుతంత్రాలు • బిజెపిదంతా మత విద్వేషాలు రెచ్చగొట్టడమే

• రాజధాని పేరుతో ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం • మండిపడ్డ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య




**ఉరవకొండ, జూన్ 24 ప్రభాతవార్త:** దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తామని గడిచిన 3 ఎన్నికల్లో వాగ్దానాలు చేస్తూ వస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అభివృద్ధి స్థానంలో ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టే కార్య క్రమాన్ని నూటికి నూరుపాళ్లు విజయవంతంగా అమలు చేస్తున్నారని సిపిఐ పార్టీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య అన్నారు. ఉరవకొండ పట్టణంలోని దేవాంగ కళ్యాణ మండపంలో ఈనెల 22వ తేదీ నుండి జరుగుతున్న సిపిఐ రాజకీయ సైద్ధాంతిక శిక్షణ తరగతుల చివరిరోజు బుధవారం ఆయన హాజరై ప్రసంగించారు.

రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య మాట్లాడుతూ పాకిస్థాన్, బంగ్లాదేశ్, శ్రీలంక రూపాయి పతనం కాలేదు కాని భారతదేశ రూపాయి విలువ పతనం అవుతోందని రూపాయి విలువ పెంచుతానని అధికారం చేపట్టిన మోదీ 12 సంవత్సరాల పాలనలో 56 రూపాయలుగా ఉన్న రూపాయి విలువను నేడు డాలర్‌తో పోల్చితే 96 రూపాయలకు పడిపోయేలా చేశారని విమర్శించారు. దేశంలో ఆర్‌ఎస్‌ఎస్ ఉన్మాదాన్ని పెంచి పోషిస్తున్న బిజెపి నేడు రాజ్యాంగాన్ని మార్చడానికి అనేక కుట్రలకు పాల్పడుతోందన్నారు. దేశంలో ఆదివాసులు, గిరిజనులు, ముస్లిం మైనార్టీలపై దాడులు అధికమయ్యాయని దేశ ప్రజల మధ్య ఐక్యతకు ముప్పు వాటిల్లుతోందన్నారు.

**కేంద్రం నుంచి నిధులు రాబట్టడంతో చంద్రబాబు సర్కార్ విఫలం:** రాష్ట్రంలోని చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీఏ కూటమి డబుల్ ఇంజన్ సర్కార్ కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో పూర్తిగా విఫలమైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య విమర్శించారు. ఎన్నికలల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు చేయకపోగా గడిచిన రెండేళ్లలో రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని, 20 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతోందని ఊకదంపుడు ఉపన్యాసాలు చేస్తున్న చంద్రబాబు ఎన్ని పరిశ్రమలు తెచ్చారో, ఎంతమందికి ఉద్యోగాలు ఇచ్చారో కల్పన కాకుండా కల్పించినవెన్నో వాస్తవాలు చెప్పాలన్నారు. ఎపి అంటే అమరావతి, పోలవరం అంటున్న చంద్రబాబు అమరావతి నిర్మాణానికి కేంద్రం నుండి ఎన్ని నిధులు తెచ్చారని ఆయన ప్రశ్నించారు. అమరావతిను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సిద్ధం చేస్తున్నారని విమర్శించారు. పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ఉన్నా పూర్తీ మాత్రం కావడంలేదని నిర్వాసితులకు పెండింగ్‌లో ఉన్న రూ.37వేల కోట్ల పరిహారం ఇవ్వమంటే ఎత్తు తగ్గిస్తామంటున్నారని ఎత్తు తగ్గించి చేపలు పట్టుకుంటారా అని ఈశ్వరయ్య దుయ్యబట్టారు.

**సంపద పునః పంపిణీ చేయాలి:** కార్పొరేట్ల సంపదను పునః పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యంలో ఆగస్టు 6 నుంచి 15 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్‌లోని 28 జిల్లాల్లో ప్రచార కార్యక్రమం చేపడుతున్నామని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీన దేశ వ్యాప్తంగా పాలక ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం చేయడానికి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తున్నామన్నారు.

ఈనెల 30వ తేదీన రైతాంగ సమస్యల పరిష్కారంకోసం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో ఛలో విజయవాడ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.జాఫర్, జిల్లా కార్యదర్శి పి.నారాయణస్వామి, సహాయ కార్యదర్శులు సి.మల్లికార్జున, జె.రాజారెడ్డి, కార్యదర్శివర్గ సభ్యులు బి.కేశవరెడ్డి, రామకృష్ణ, శ్రీరాములు, మల్లికార్జున, నియోజకవర్గ కార్యదర్శి చెన్నరాయుడు, సహాయ కార్యదర్శులు సుల్తాన్, నాగేంద్ర, నాయకులు బసవరాజు, గెన్నే మల్లేసి, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## దారిదోపిడి కేసులో 8మంది అరెస్టు

4 వాహనాలు, రూ.3 లక్షలు స్వాధీనం



**శ్రీకాళహస్తి, జూన్ 24 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తి-తిరుపతి జాతీయ రహదారిపై ఈ నెల 15న తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం అంజిమేడు వద్ద రవీంద్రరెడ్డి అనే వేణును బెదిరించి రూ.15 లక్షలు దోచుకున్న కేసులో బుధవారం 8 మందిని అదుపులో తీసుకొని వారి నుంచి నాలుగు వాహనాలను, రూ.3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎఎస్‌పి అర్లశ్రీనివాసులు మీడియాకు తెలిపారు. రవీంద్ర రెడ్డి రూ.15లక్షలతో తన వాహనంలో పయనిస్తుండగా ముందుగా గుర్తించిన ముఠా దారికాచి కత్తులతో బెదిరించి నగదును అపహరించినట్లు అందిన ఫిర్యాదు మేరకు జిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు సంబంధిత అధికారులను కేసుకు సంబంధించి ప్రత్యేక బృందాలను నియమించాలని ఆదేశించారు. ఈ మేరకు రేణిగుంట డియస్‌పి శ్రీనివాస్, ఏర్పేడు సిఐలు శ్రీకాంత్‌రెడ్డిలు సంయుక్తంగా ప్రత్యేక బృందాన్ని నియమించారు. కేసుల ఛేదనలో ఎంతో చాకచక్యం ఉన్న బృందం ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, రవిప్రకాష్ వారి సిబ్బంది గతంలో నేరాలకు పాల్పడిన వారిని పరిగణలోకి తీసుకొని విచారణ చేపట్టారు. వారి చొరవతో స్వల్ప కాలంలోనే నిందితులను అదుపులో తీసుకున్నారు. ఈ కేసులో మొదటి నిందితులుగా ఓ మహిళ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఆమె కోసం ప్రత్యేక బృందాన్ని నియమించారు. ఈ కేసులు 8మందిని అదుపులో తీసుకున్నట్లు వివరించారు. మొదటి నిందితులు లక్ష్మీకాంతమ్మ పరారిలో ఉండగా అదుపులో తీసుకున్న వారిలో బాలసాల దామోదరం (బంగారుపాళెం), వెంకటరమణ (శ్రీనివాస మంగాపురం), మునియప్ప వెంకటాచలపతి(కోలారు), నారాయణ స్వామి (కోలార్), సయ్యద్ రోషన్ (మొగిలి బంగారుపాళెం), అంజి (గంగవరం చిత్తూరు), గుణశేఖర్ (జీవకోన తిరుపతి), శ్రీనివాసులు (చిల్లకూరు నెల్లూరు జిల్లా) ఉన్నారు. ఈ కేసును ఛేదించటంలో ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌ఐలు శ్రీకాంత్‌రెడ్డి రవి ప్రకాష్, పోలీసులను జిల్లా అధికారులు ప్రశంసించారు.

25-6Pg7exHMNWJQE_25-6Pg7exHMNWJQE.qxd 24/Jun/26 11:47 PM Page 1



# గొడ్డలి పార్టీ నేతలకు దడ పుట్టిస్తాం

● వైసిపి ప్రభుత్వంలో జరిగిన కబ్జాలను వెలికి తీస్తాం ● రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

**తిరుపతి కలెక్టరేట్, జూన్ 24 ప్రభాతవార్త:** రానున్న మూడేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ నేతలకు దడ పుట్టిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సంచలన వ్యాఖ్యలు చేశారు. తిరుపతి కలెక్టరేట్లో బుధవారం సాయంత్రం 5 గంటలకు జిల్లా అభివృద్ధిపై, ప్రధానంగా తిరుపతి అర్బన్ రూరల్, చంద్రగిరి నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మీడియా మిత్రులను ఉద్దేశించి మాట్లాడుతూ కూటమి అధికారం లోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి ప్రధానంగా జిల్లా, చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధి శరవేగంతో దూసుకుని వెళుతుందన్నారు. ఈ నేపథ్యంలో దామినీడులో రెండేళ్ల కాలంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిపై విజయోత్సవ బహిరంగ జరిగిందని, ఈ సభ విజయోత్సవాన్ని జీర్ణించుకోలేని గొడ్డలి పార్టీ నేతలు కూటమి ప్రభుత్వంపై బురద జల్లడం జరుగుతుందని తెలియజేశారు. రానున్న మూడేళ్ల కాలంలో గొడ్డలి పార్టీ నేతలకు మన్యం చూపిస్తామని, గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన కబ్జాలను వెలికి తీసి, అందుకు బాధ్యులైన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ లెక్కదాఖల సర్వేనంబర్ 416/1 లో ఎ 3.17 సెంట్ల భూమిలో తన అనుచరులు కబ్జా చేసినట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదన్నారు. అసలు ఆ భూమికి, సంబంధిత వ్యక్తులకు ఎటువంటి సంబంధం లేదని త్రోసిపుచ్చారు. ఇదంతా గొడ్డలి పార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలు మాత్రమేనని, ఇందులో నా పాత్ర కానీ, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాత్ర గాని లేదన్నారు. సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు పేదల సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొని రావడం తప్ప మరోటి లేదని అన్నారు. ఇందులో భాగంగా శెట్టిపల్లి సమస్యలు పరిష్కరించి బాధితులకు పట్టాలు అందజేశామని, త్వరలో తిరుచానూరు మాస్టర్ ప్లాన్ రోడ్డు రానుందని, తిరుపతిని టూరిజం హబ్ గా మార్చనున్నామని, ప్రతి పేదవానికి ఇంటి స్థలాలు ఇవ్వడానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. జగన్ ప్రభుత్వం 2029 లో రాదని, 2039 లో కూడా రాదని, 2049 అయినా కూడా వైసీపీ ప్రభుత్వ రాదని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో, ప్రత్యేకంగా తిరుపతి జిల్లాలో ప్రధానంగా చంద్రగిరి నియోజకవర్గ పరిధిలోని హాథీ రాంజీ మఠానికి సంబంధించిన భూములను సంబంధిత పీఠాధిపతులతో మాట్లాడి బాధితులకు, పేదలకు అందించడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా జర్నలిస్టు సోదరులకు ఇంటి స్థలాలు ఇచ్చే కార్యక్రమానికి త్వరలో శ్రీకారం చుడతామని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత గొడ్డలి పార్టీ రాష్ట్ర ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని లేనిపోని ఆరోపణ చేస్తుందని, ఇక మూడేళ్ల కాలం కూటమి ప్రభుత్వానికి ఉందని గొడ్డలి పార్టీ నేతలకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు.

**కబ్జా భూములను బద్దలు కొడతాం:** చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన కబ్జాలను వెలికి తీసి, బాధ్యులైన వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని హెచ్చరించారు. తిరుపతి రూరల్ అవిలాల గ్రామం సర్వే నెంబర్ 416 /1 లోని ఏ 3.17 సెంట్ల భూమి కబ్జా జరగలేదని, అందులో తన పాత్ర కానీ, కూటమి పాత్ర లేదని స్పష్టం చేశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రగిరి నియోజకవర్గం అభివృద్ధి పథంలో జరిగిందని, తన నియోజకవర్గంలోని ఇంత అభివృద్ధి జరిగితే, రాష్ట్రంలో ఎంత అభివృద్ధి జరుగుతుందో అర్థం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా కలెక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి పాల్గొన్నారు.



తిరుపతి జిల్లా కలెక్టరేట్లో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని

## ఆర్టీసీ ఉద్యోగులకు ఒపిఎస్ అమలు చేయండి

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆర్టీసీ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ఏపి పిటిడి ఓసి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్పి. శేషగిరిరావు కోరారు. 2004 సెప్టెంబర్‌కు ముందు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన సుమారు 11,000 మంది ఉద్యోగులను (కాంట్రిబ్యూటరీ పెన్షన్స్‌కి) సిపిఎస్ నుంచి (ఓల్డ్ పెన్షన్ స్కీమ్‌ను) ఓపిఎస్‌కు మార్చే అందుకు అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు శేషగిరిరావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా 2020 నుంచి ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన ఏపిఎస్ఆర్టీసీ 2004 ముందు ఉద్యోగాలు పొందిన వారికి కూడా ఓపిఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీమ్)ను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.



## దుర్గమ్మ ఆలయ నిత్యాన్నదానానికి విరాళం

**ఇంద్రకీలాద్రి, జూన్ 24 ప్రభాతవార్త:** విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రూ.1లక్ష విరాళాన్ని బుధవారం విజయవాడకు చెందిన కె. కృష్ణకుమార్ అందించారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన ఐందుకూరి హేమ శిరీష రూ.1లక్ష విరాళాన్ని బుధవారం అందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు, అనంతరం దుర్గమ్మ చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



## విద్యుత్‌ను ఆదా చేయండి

**తిరుమల, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ధార్మిక సంస్థ టిటిడితో బాటు తిరుమలలోని అనేక విభాగాలు విద్యుత్ పొదుపుచేయాలని, ఇందుకోసం అనవసర సమయాల్లో లైట్లు, ఎసిలు, ఫ్యాన్లు ఆపివేయాలని ప్రత్యేక జిఒ జారీ అయ్యింది. ఇందుకు టిటిడి అధికారులు, సిబ్బంది సహకరించాలని, పొదుపు మంత్రం అమలుచేయాలని పేర్కొన్నారు. టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర పేరుతో వెలువడిన ఉత్తర్వుల్లో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. తిరుమలలోని టిటిడి కార్యాలయాలు, ఇతర అనుబంధ ఆలయాలు, కార్యాలయాల్లో విద్యుత్ పొదుపు చేయాలని, దీన్ని అందరూ పాటించాలని కీలక ఆదేశాలు వెలువడ్డాయి. కార్యాలయం పనివేళల్లో కూడా పొదుపు మంత్రం పాటించాలని, అనవసరంగా లైట్లు, ఫ్యాన్లు వాడుకోవద్దని పేర్కొన్నారు. ఉదయం 10,30గంటల నుండి మధ్యాహ్నం 1గంటవరకు, తిరిగి మధ్యాహ్నం 2గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే ప్రత్యేక సమయ పరిమితి ఉంటుందన్నారు. స్విచ్‌బోర్డులకు నంబరింగ్, గుర్తింపు మార్కింగ్ తప్పనిసరి అని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉద్యోగులు, సిబ్బందికి విద్యుత్ పొదుపుపై అవగాహన కల్పించాలని అన్ని విభాగాధిపతులకు ఆదేశాలిచ్చారు. ఈ ఉత్తర్వులు అమలులో నిబంధనలు ఉల్లంఘిస్తే తీవ్రంగా పరిగణించి చర్యలు తప్పవని హెచ్చరించారు.

## అటవీ ప్రాంతంలో మృతదేహం

### నెల్లూరు జిల్లా ఊటుకూరు వాసిగా గుర్తింపు

**దుత్తలూరు (నెల్లూరు), జూన్ 24 ప్రభాతవార్త:** నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలంలోని బండకిందపల్లి అటవీ ప్రాంతంలో మృతదేహం ఉన్న సంఘటన బుధవారం కలకలం రేపింది. స్థానిక బస్తాలో మృతదేహాన్ని అటవీ అధికారులకు సమాచారం అందించారు. అటవీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందించడంతో ఉదయగిరి సిఐ వెంకట్రావ్ పోలీసు అధికారులు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. గోనె సంచలో వరిగడ్డి వేసి అందులో మృతదేహాన్ని ఉంచి అనుమానస్పదంగా మృతి చెందినట్లు గుర్తించారు. క్లూస్ టీం సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరప్రాంతాల్లో ఆధారాలు సేకరించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. శవపంచనామా ద్వారా మృతుడు వింజమూరు మండలం ఊటుకూరుకు చెందిన దేవరకొండ గోవిందులు (55)గా నిర్ధారించారు. మృతదేహం పరిస్థితిని బట్టి నాలుగు నుండి 5రోజులు అయి ఉండడం వలన మృతదేహం కుళ్ళిపోయింది. దీంతో పోస్టుమార్టరం ఘటనా స్థలంలోనే నిర్వహించారు. పోస్టుమార్టరం నివేదికందగానే మృతికి గల కారణాలు ఇతర కారణాలను పూర్తి స్థాయిలో దర్యాప్తులో తేలనున్నాయి. దత్తులూరు ఎస్ఐ పి.ఆదిలక్ష్మి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధికారంలోకొచ్చాక ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం

● ప్రజల ఆశీస్సులతో మళ్లీ వచ్చేది మన ప్రభుత్వమే ● వైసిపి అధ్యక్షుడు, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి

**పులివెందుల, జూన్ 24 ప్రభాతవార్త:** ప్రజల ఆశీస్సులతో మళ్లీ మన ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని రాగానే ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం అని కార్యకర్తల సంక్షేమమే తన తొలి ప్రాధాన్యత అని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. పులివెందుల నియోజకవర్గంలో మూడు రోజుల పర్యటనలో భాగంగా రెండో రోజు వైఎస్ జగన్ పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం భాకరాపురం నుంచి బయలుదేరిన ఆయన వేముల మండలం భూమయ్యగారిపల్లి గట్టు వద్ద నూతనంగా నిర్మించిన శ్రీ నరసింహస్వామి ఆలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. జగన్మోహన్ రెడ్డికి మండల నాయకులు, గ్రామస్తులు గజమాలతో స్వాగతం పలికారు. వైఎస్ అవినాష్ రెడ్డితో కలిసి ఆలయ కలశాన్ని ఎత్తుకొని ఆలయ ప్రవేశం చేసిన జగన్ ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం పులివెందుల పట్టణంలోని యర్రగుడిపాలెంలో నిర్మించిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాలే తమ లక్ష్యమని తెలిపారు. పార్టీ కార్యకర్తలే పార్టీకి వెన్నెముక అని, వారి సంక్షేమానికి భవిష్యత్తులో ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి చొరవతో పట్టణంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను జగన్ ప్రారంభించారు. ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటి పూర్తి అయిన పనులే కాకుండా మరో రూ.110 లక్షల విలువైన అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. చిన్న రంగాపురం, పెద్ద రంగాపురం ప్రాంతాల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. పారిశుద్ధ్య నిర్వహణ కోసం రూ.18 లక్షలతో ట్రాక్టర్ కొనుగోలు, యుజిడి, రోడ్ల మరమ్మతుల కోసం రూ.70 లక్షల ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు తెలిపారు. కార్యకర్తలకు అండగా ఉంటూనే పులివెందుల అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తామని వారు తెలిపారు.


ఆలయ ప్రారంభోత్సవ పూజా కార్యక్రమంలో జగన్

## పొగాకు గిట్టుబాటు ధర కల్పించాలి

**ఒంగోలు (కలెక్టరేట్), జూన్ 24 ప్రభాతవార్త:** పొగాకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, పొగాకు కొనుగోళ్ల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.1000 కోట్లు కేటాయించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షల్లో పాల్గొన్న ఆయన రైతులను ఉద్దేశించి మాట్లాడారు. జిల్లాలో వేలాది మంది రైతులు పొగాకు సాగుపై ఆధారపడి జీవనం సాగిస్తున్నప్పటికీ గిట్టుబాటు ధరలు లేకపోవడం, కొనుగోళ్లలో జాప్యం, మార్కెట్‌లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితుల కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు అప్పులు చేసి సాగు చేసిన పంటకు సరైన ధర లభించకపోవడంతో అనేక కుటుంబాలు ఆందోళనలో ఉన్నాయని పేర్కొన్నారు. పొగాకు రైతుల వద్ద నిల్వ ఉన్న ఉత్పత్తిని వెంటనే కొనుగోలు చేసి పెట్టుబడులు, శ్రమ వృథా కాకుండా తగిన మద్దతు ధర కల్పించాలని కోరారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న సమయంలో రైతులకు అండగా నిలవడం ప్రభుత్వాల బాధ్యత అని ఆయన అన్నారు.

కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసి రైతుల పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రైతుల పరిస్థితిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్థం చేసుకుని అత్యవసరంగా నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పొగాకు బోర్డు కూడా రైతులకు అనుకూలంగా వ్యవహరించి కొనుగోళ్లలో పారదర్శకత పాటించాలని కోరారు. ఇదే సందర్భంగా ఒంగోలు కలెక్టర్ కార్యాలయం వద్ద పొగాకు పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని కిసాన్ మోర్చా అధ్యక్షుడు చుండూరి రంగారావు ఆధ్వర్యంలో రైతులు నిరసన దీక్ష చేపట్టారు.

## పోలీస్‌స్టేషన్‌కు అధిక ఫీజుల పంచాయితీ

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏ కొండూరు మండలం కృష్ణారావు పాలెం గ్రామానికి చెందిన 10వ తరగతి విద్యార్థి మైలవరం ఒక ప్రైవేట్ స్కూల్లో చదువు పూర్తి చేసుకున్నాడు. సర్టిఫికెట్ల కోసం స్కూల్ కి వెళ్లగా ఫీజులు 53000 కడితేనే ఇస్తామని యాజమాన్యం దురుసుగా ప్రవర్తించింది. మొదట 9వ తరగతికి 20000 అని తర్వాత 10000 కడితే సరిపోతుందని చెప్పారు. తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితి బాగోకపోవడంతో 10వ తరగతిలో 10000 మాత్రమే చెల్లించారు. 25000 కడతామని బ్రతిమిలాడినా యాజమాన్యం కనికరించలేదు. విద్యాశాఖ నుండి 55000 వసూలు చేసుకోవడానికి పర్మిషన్ ఉందని బెదిరించినట్లు తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో ఆందోళనకు గురై స్థానిక పోలీస్ స్టేషన్ ను ఆశ్రయించారు. ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దందాపై విద్యాశాఖ అధికారుల నిరక్ష ్యం స్పష్టంగా కనపడుతోందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. పుస్తకాలు యూనిఫాం అమ్మకాలు ఏడాదికి 20 నుండి 30 శాతం ఫీజులు పెంచి వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. స్కూల్ యజమాని డబ్బులు ఇచ్చి మేనేజ్ చేస్తామని సవాలు చేస్తున్నా జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించడం లేదని వాపోయారు.

## సాయికృష్ణ కేసులో సిట్ విచారణ డొల్ల

### - మాజీ మంత్రి పేర్ని నాని



**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** సాయికృష్ణ కేసులో సిట్ విచారణపై మాజీ మంత్రి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పేర్ని నాని తీవ్ర విమర్శలు చేశారు. అమరావతిలో మీడియాతో మాట్లాడిన ఆయన సాయికృష్ణ కస్టోడియల్ డెత్ కేసు విచారణపై తీవ్ర అనుమానలు వ్యక్తం చేశారు. సిట్ దర్యాప్తు పూర్తిగా లోప భూయిష్టంగా ఉందని ఆరోపించిన ఆయన ఈ కేసులో అనేక కీలక అంశాలను అధికారులు విస్మరించారని విమర్శించారు. సాయికృష్ణ ఘటన రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పరిస్థితిని బయటపెట్టిందని పేర్ని నాని అన్నారు. కస్టోడియల్ డెత్ జరిగిన తర్వాత కూడా శవం ఏమైందో అధికార యంత్రాంగం స్పష్టంగా చెప్పలేకపోవడం విచారకరమని పేర్కొన్నారు. ఈ కేసులో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించిన తర్వాతే ఛార్జ్‌షీట్ దాఖలైందని ఆరోపించారు. సిట్ విచారణపై ప్రశ్నలు లేవనెత్తిన ఆయన . మే 6న సాయికృష్ణను అదుపులోకి తీసుకున్న తర్వాత చట్టపరమైన విధానాలు పాటించలేదని అన్నారు. టాస్క్‌ఫోర్స్ అధికారులు, సంబంధిత ఉన్నతాధికారులు పాత్రపై కూడా దర్యాప్తు జరగాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. సాయికృష్ణను కొట్టి చంపింది ఒక్కరేనా? శవాన్ని ఎలా తరలించారు. సిసిటివి ఫుటేజీ ఎందుకు మాయమైంది? వంటి అనేక ప్రశ్నలకు సమాధానలు లేవని అన్నారు. సాయికృష్ణ తల్లి పలుమార్లు పోలీసులు ఆశ్రయించినా స్పందన రాలేదని, చివరకు హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. హైకోర్టు ఆదేశాలు వచ్చిన తర్వాత కూడా పోలీసులు తగిన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఈ కేసులో సిపి, డిసిపి, ఏసిపి స్థాయి అధికారులు పాత్రపైనా స్వతంత్ర విచారణ జరపాలని పేర్ని నాని డిమాండ్ చేశారు.

## 10 నూతన గురుకుల పాఠశాలలు ఏర్పాటు

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో 10 నూతన మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలు ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఎచ్చెర్ల, నక్కపల్లి, మాచర్ల, గుంతకల్లు, మంత్రాలయంలో బాలికల గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు. గిద్దలూరు, రాయచోటి, పత్తికొండ, పెనుగొండ, కదిరిలో బాలుర గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయనున్నారు.

## తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం

**తిరుపతిరూరల్, జూన్ 24 ప్రభాతవార్త:** తిరుపతి పరిసర ప్రాంత ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని విభజించి, తిరుచానూరులో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ప్రారంభించడం ద్వారా ప్రజలకు మరింత చేరువలో సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఎన్నోళ్లుగానో ఎదురుచూస్తున్న నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శ్రీనివాసపురం గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రెవెన్యూ, రిజిస్ట్రేషన్, స్టాంపులశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపుల శాఖ కమీషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, ఏంపి దగ్గుమల్ల ప్రసాదరావు, ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడ చైర్మెన్ డాలర్ దివాకర్‌రెడ్డి, తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, జనసేన నాయకులు డాక్టర్ హరిప్రసాద్, స్థానిక ప్రజాప్రతినిధులు గణపతినాయుడు, మునిశేఖర్, బడి సుధాయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**ఒంగోలు(క్రైమ్), జూన్ 24 ప్రభాతవార్త:** ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల దొంగిలించబడిన ఐ10 కారును ఛేధించిన ప్రకాశం జిల్లా పోలీసులు అంతర్రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలు, నిఘా సమాచారంతో దర్యాప్తు చేపట్టి నలుగురు నిందితులను పేర్నమిట్ట సమీపంలో అదుపులోకి తీసుకున్నారు.

జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు పర్యవేక్షణలో ప్రత్యేక బృందం నిర్వహించిన ఆపరేషన్‌లో ఈ అరెస్టులు జరిగినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.4 లక్షల విలువైన 10 కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఒక మొబైల్ ఫోన్, రూ.50 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.8 లక్షలు ఉంటుందని వెల్లడించారు. నిందితులు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. వారి నేర చరిత్రపై పోలీసులు ఆరా తీస్తుండగా, ఇతర జిల్లాలు, రాష్ట్రాల్లో నమోదైన కేసులతో సంబంధాలు ఉన్నాయా అనే కోణంలో కూడా విచారణ కొనసాగుతోంది. దొంగిలించబడిన వాహనాలను గుర్తించి బాధితులకు అప్పగించే ప్రక్రియ చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ ముఠాకు మరికొందరు సహకరించిన వ్యక్తులు ఉన్నారా అనే కోణంలో కూడా దర్యాప్తు సాగుతోంది. త్వరలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసును వేగంగా ఛేదించిన పోలీసు అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందిస్తూ వారి సేవలను ప్రశంసించారు. ప్రజలు తమ వాహనాలకు తగిన భద్రతా చర్యలు తీసుకోవడంతో పాటు అనుమానాస్పద వ్యక్తుల గురించి వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## తక్కువ వర్షపాతంలోనూ పంటలు పండించవచ్చు

**అనంతపురం, జూన్ 24 ప్రభాతవార్త బ్యూరో:** తక్కువ వర్షపాతంలోనైనా విత్తన గుళికలతో పంటలు పండించవచ్చని రైతు సాధికార సంస్థ గౌరవ ఉపాధ్యక్షులు టి.విజయ్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం మిడుతూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను రైతు సాధికార సంస్థ చీఫ్ టెక్నికల్, ఇన్నోవేషన్ అధికారి లక్ష్మా నాయక్‌తో కలసి సందర్శించారు. అనంతరం వారు రైతులు, సిబ్బందితో మాట్లాడుతూ.. గ్రామంలో రైతులందరు విత్తన గుళికలతో పిఎండిఎస్‌ను వేసుకోవాలని సూచించారు. రైతులు సమూహాలుగా ఏర్పడి కాంపాక్ట్ బ్లాక్ పద్ధతిలో సాగు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు సూరజ్ కుమార్, జెడిఏ సాల్ రెడ్డి, ఏ.డి.ఏ వెంకట్, రైతులు, రైతు సాధికార సంస్థ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి లోకేష్‌ను కలిసిన షట్లర్ సాత్విక్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు సాత్విక్ సాయిరాజ్ ఉండవల్లి నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తూ దేశానికి, రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచిన సాత్విక్ సాయిరాజ్‌ను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు. ఏపీలోని అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురానికి చెందిన సాత్విక్ సాయిరాజ్ అర్జున అవార్డుతో పాటు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డు పొందారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తూ ఎన్నో పతకాలు సాధించారు. ప్రస్తుతం పురుషుల డబుల్స్ విభాగంలో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 4వ స్థానంలో ఉన్నారు. 2023 అక్టోబర్ 10న డబుల్స్ విభాగంలో ప్రపంచ నంబర్1 ర్యాంకును సాధించారు. ఇటీవల జరిగిన థామస్ కప్ లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల మంత్రి లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్ లో సాత్విక్ సాయిరాజ్ మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. ప్రభుత్వపరంగా అన్ని విధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ ఎస్.భరణి పాల్గొన్నారు.



## ఎపిఎల్ టోర్నీ ఆరంభం

### - ట్రోఫీని ఆవిష్కరించిన సినీనటుడు రామ్ చరణ్

**విజయవాడ, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎపిఎల్ ట్రోఫీ ఫైనల్స్ మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా టాలీవుడ్ గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ బుధవారం మంగళగిరిలో సందడి చేశారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) చివరి దశ పోటీల ప్రారంభోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంగళగిరిలోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఏపీఎల్ ట్రోఫీని, జట్ల జెర్సీలను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా రామ్ చరణ్ మాట్లాడుతూ, ఏపీఎల్ యువ క్రికెటర్లకు ఒక గొప్ప అవకాశమని ప్రశంసించారు. రాష్ట్రంలో కొత్త ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి లీగ్‌లు ఎంతో దోహదపడతాయని అన్నారు. టోర్నీలో పాల్గొంటున్న క్రీడాకారులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రామ్ చరణ్ రాకతో స్టేడియంలో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమం అనంతరం భీమవరం బుల్స్, క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభమైంది. టాస్ గెలిచిన క్యాపిటల్ అమరావతి రాయల్స్ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), ఏసీఏ కార్యదర్శి సానా సతీశ్ (రాజ్యసభ సభ్యుడు), ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తదితరులు పాల్గొన్నారు. ఎపిఎల్ లీగ్ దశ మ్యాచ్‌లు జూన్ 27 వరకు జరుగుతాయి. ఆ తర్వాత ప్లేఆఫ్స్ ప్రారంభమై, జూన్ 30న ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ప్రస్తుతం 6 మ్యాచ్‌లలో 8 పాయింట్లతో భీమవరం బుల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.



## తెలుగు రాష్ట్రాల యాత్రికుల కోసం 3 ప్రత్యేక తీర్థయాత్ర టూరిస్ట్ రైళ్లు

### ఐఆర్‌సిటిసి జాయింట్ జనరల్ మేనేజర్ సోమశేఖర్ నాయుడు

**తిరుపతి, జూన్ 24 ప్రభాతవార్త ప్రతినిధి:** తెలుగు రాష్ట్రాల యాత్రికుల సౌలభ్యం కోసం ఐఆర్‌సీటీసీ జూలై-ఆగస్టు నెలల్లో భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు ద్వారా మూడు ప్రత్యేక తీర్థయాత్ర ప్యాకేజీలను హైదరాబాద్ నుంచి నిర్వహిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ జి. సోమశేఖర్ నాయుడు తెలిపారు. తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణతో కలసి మీడియాతో మాట్లాడారు. మొదటి ప్యాకేజీగా అయోధ్య- కాశీ- బైద్యనాథ్ ధామ్ యాత్ర జూలై 4 నుంచి 13 వరకు నిర్వహించనున్నారు. ఈ యాత్రలో గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్, బైద్యనాథ్ ధామ్ క్షేత్రాలను సందర్శించే అవకాశం ఉంటుంది. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.16,400లుగా నిర్ణయించారు. రెండో ప్యాకేజీ దివ్య దక్షి ణ యాత్ర జూలై 20 నుంచి 28 వరకు సాగుతుంది. ఈ యాత్రలో అరుణాచలం, చిదంబరం, తిరుచ్చి, తంజావూరు, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి తదితర ప్రముఖ పుణ్యక్షేత్రాలను దర్శించ వచ్చు. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.15,600లుగా ఉంది. మూడో ప్యాకేజీ అయోధ్య- కాశీ పుణ్యక్షేత్ర యాత్ర ఆగస్టు 4 నుంచి 13 వరకు నిర్వహించ నున్నారు. పూరి, కోణార్క్, గయా, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ ప్రాంతాలను ఈ యాత్రలో సందర్శించవచ్చు. ఈ ప్యాకేజీ ప్రారంభ ధర రూ.16,500లుగా నిర్ణయించారు. ఈ యాత్రలకు స్లీపర్, 3ఏసీ, 2ఏసీ తరగతుల్లో టికెట్లు అందుబాటులో ఉండగా, ధరలు రూ.15,600 నుంచి రూ.33,400 వరకు ఉన్నాయి. ప్రయాణికులకు రైలు, బస్సు, హోటల్ వసతి, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం, ఉచిత తాగునీరు, ప్రయాణ బీమా, సీసీ కెమెరాలు సెక్యూరిటీ సిబ్బందితో భద్రత, అలాగే దేవాలయాలకు ఉచిత రవాణా సౌకర్యాలు కల్పించనున్నారు. అదనంగా నేపాల్, సింగపూర్-మలేషియా, శ్రీలంక రామాయణ యాత్రలతో పాటు గంగా గయా సంగం, కేరళ, లేహ్, తమిళనాడు, మధ్యప్రదేశ్, గోవా, ఒడిశా, మహారాష్ట్ర, చార్‌ధామ్ యాత్రలకు విమాన పర్యటన ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. టికెట్ బుకింగ్ వివరాలుకోసం 92814 95853, 82879 32313 నంబర్లను సంప్రదించవచ్చు. ఈ కార్యక్రమంలో తిరుపతి స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ, ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎన్.

25-06pg10_25-06pg10.qxd 24/Jun/26 11:58 PM Page 1






# వన్డే ర్యాంకుల్లో తీన్‌మార్

**దుబాయ్, జూన్24:** వన్డే క్రికెట్ ర్యాంకింగులను ఐసీసీ విడుదల చేసింది. ఆఫ్ఘనిస్థాన్‌పై పరుగుల వరద పారించిన టీమిండియా కెప్టెన్ శుభమన్ గిల్ రెండో ర్యాంకులో నిలిచాడు. ఆఫ్ఘనిస్థాన్‌పై తొలి రెండు వన్డేల్లో 84, 154 రన్స్ సాధించిన గిల్‌కు మూడో వన్డేలో ఆడే అవకాశం రాలేదు. ఈ పరుగులతో గిల్ వన్డే ర్యాంకును మెరుగుపర్చుకున్నాడు. కాగా టాప్-4 ర్యాంకుల్లో మూడు టీమిండియా ఆటగాళ్లవే. గాయంతో ఆఫ్ఘనిస్థాన్‌తో సిరీస్‌కు దూరమైన విరాట్ కోహ్లీ 768 పాయింట్లతో మూడో స్థానంలో కొనసాగుతున్నాడు. ఇక రోహిత్ శర్మ నాలుగో స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. న్యూజిలాండ్ ప్లేయర్ డారిల్ మిచెల్ 815 పాయింట్లతో టాప్ ర్యాంకులో ఉన్నాడు. గిల్, మిచెల్ మధ్య కేవలం 24 రేటింగ్ పాయింట్స్ తేడా ఉన్నది. ఇతర భారత బ్యాట్స్‌మెన్లలో ఇషాన్ కిషన్ 21 స్థానాలు మెరుగుపర్చుకుని 43వ ర్యాంకుకు చేరుకున్నాడు. శ్రేయస్ అయ్యర్ 14వ ర్యాంకులో, కేఎల్ రాహుల్ 11వ ర్యాంకు దక్కించుకున్నారు.

బౌలింగ్ విభాగంలోనూ జస్ ప్రీత్ బుమ్రా టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. వన్డే బౌలర్లలో అర్షదీప్ సింగ్ 22, ప్రసిద్ధ కృష్ణ 58, వాషింగ్టన్ సుందర్ 71వ స్థానంలో ఉన్నారు. ఇక టెస్టుల్లో కివీస్ బౌలర్ మ్యాట్ హెన్రీ దూసుకొచ్చాడు. బుమ్రాతో కలిసి అతను నెంబర్ వన్ స్థానాన్ని ఆక్రమించాడు. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో మ్యాట్ హెన్రీ 11 వికెట్లు తీసుకున్నాడు.

# టీటీ సమాఖ్యకు మనికా బాత్రా హెచ్చరిక

**న్యూఢిల్లీ, జూన్ 24:** కామన్‌వెల్త్ క్రీడల గోల్డ్ మెడలిస్ట్, రెండుసార్లు ఒలింపియన్ మనికా బాత్రా... భారత టేబుల్ టెన్నిస్ సమాఖ్యపై లీగల్ ఫైట్‌కు సిద్ధమవుతోంది. ఆసియా క్రీడల్లో పాల్గొనే టేబుల్ టెన్నిస్ జట్టు నుంచి తనను తీసివేయడంపై అసహనం వ్యక్తం చేసింది. జట్టు నుంచి తొలగించడంపై సరైన కారణం చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటానని సమాఖ్యను హెచ్చరించింది. ఈ విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర క్రీడల మంత్రి మన్సుక్ మాండవీయ జోక్యం చేసుకోవాలని బాత్రా మరోసారి కోరింది. ఎంపిక ప్రక్రియలో పారదర్శకత, జవాబుదారీతనం కావాలన్నారు.

ఏ ప్రాతిపదికన జట్టులో నుంచి తీసేశారో తనకు లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాలని మాత్రమే కోరుతున్నట్లు బాత్రా చెప్పారు. నన్ను సెలక్ట్ చేయకపోవడానికి గల కారణాలను ఫెడరేషన్ తెలియజేయలేదు. టాప్50లో ఉన్న ప్లేయర్ ఒకటి, రెండు వారాల్లో 51వ ర్యాంకుకు పడిపోతే.. ఆసియా క్రీడలకు అర్హత కోల్పోయినట్టేనా? అని ప్రశ్నించారు. తనపై వేటు నిర్ణయానికి గల కారణాలపై సంతృప్తికర సమాధానాలు రాకపోతే టీటీ సమాఖ్యపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని మానికా బాత్రా స్పష్టం చేశారు. కాగా జపాన్ వేదికగా సెప్టెంబర్ 19 నుంచి అక్టోబర్ 4 వరకు ఆసియా క్రీడలు జరగనున్నాయి.



# ఇంగ్లండ్‌కు ఘనా షాక్ : నాకౌట్‌లో కొలంబియా

**ఫిలడెల్ఫియా, జూన్ 24:** ఫిఫా ప్రపంచ కప్‌లో కొలంబియా నాకౌట్ స్టేజ్‌కు చేరుకుంది. టైటిల్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్‌ను ఘనా నిలువరించగా...పనామాపై ఏకైక గోల్‌తో నెగ్గి క్రొయేషియా నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. క్రొయేషియా మిడ్ ఫీల్డర్ లుకా మోడ్రిక్ తన 200వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడాడు.

### ఇంగ్లండ్‌కు ఘనా అడ్డుకట్ట

సాకర్ ప్రపంచకప్ హాట్ ఫేవరెట్లలో ఒకటైన ఇంగ్లాండ్‌ను ఫుట్‌బాల్ కూన ఘనా చక్కగా నిలువరించింది. తొలి మ్యాచ్‌లో గెలిచి దూకుడు మీదున్న ఇంగ్లాండ్‌ను ఒక్క గోల్ కూడా చేసే అవకాశం ఇవ్వకుండా గోల్ లెస్ డ్రాగా ముగించింది. ఈ మ్యాచ్‌లో గెలిచి నాకౌట్ బెర్తు ఖాయం చేసుకుందామనుకున్న ఇంగ్లాండ్ ఆశలకు బ్రేక్ పడింది. గోల్ కోసం ఇరు జట్లూ తీవ్రంగా శ్రమించాయి. నాలుగు సార్లు గోల్ పోస్ట్ వైపు టార్గెట్ చేసినా ఇంగ్లాండ్‌కు కలిసి రాలేదు. ఘనా కేవలం ఒక్క సారి మాత్రమే గోల్ పోస్టును టార్గెట్ చేసింది. చివరికి 0-0తో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అయితే, మ్యాచ్ రిఫరీ ఎజ్రి కోన్సా తీరుపై ఘనా ఆగ్రహం వ్యక్తం చేసింది. పెనాల్టీ ఇవ్వకపోవడం వల్ల తాము నష్టపోయామని ఆ జట్టు మేనేజ్‌మెంట్ విమర్శించింది.

### పనామాపై క్రొయేషియా విజయం

గ్రూప్-ఎల్‌లో భాగంగా పనామాతో జరిగిన మ్యాచ్‌లో క్రొయేషియా విజయం సాధించింది. తొలి అర్ధభాగంలో ఇరు జట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. రెండో అర్ధభాగం 54వ నిమిషంలో యాంటే బుదిమిర్ అందించిన గోల్‌తో క్రొయేషియా 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ తర్వాత ఇరు జట్లూ గోల్స్ కోసం తీవ్రంగా శ్రమించాయి. ఓ దశలో పనామా గోల్ చేసినంత పనిచేసింది. అయితే క్రొయేషియా గోల్ కీపర్ దాన్ని అద్భుతంగా అడ్డుకోగలిగాడు. చివరికి క్రొయేషియా ఏకైక గోల్ తేడాతో పనామాపై విజయం సాధించింది. ఈ ఓటమితో పనామా ఇంటి ముఖం పట్టగా...ఇంగ్లాండ్, ఘనా, క్రొయేషియా మధ్య నాకౌట్ రేసు ఆసక్తిగా మారింది.



గోల్ కొట్టడంలో ఇంగ్లండ్ విఫలం





కొలంబియాకు గోల్ కొట్టిన డానిల్

### టాప్ ప్లేస్‌తో కొలంబియా

గ్రూప్-కేలో భాగంగా డీఆర్ కాంగోను 1-0 గోల్స్ తేడాతో కొలంబియా గెలుపొంది నాకౌట్‌కు చేరుకుంది. పోర్చుగల్‌కు కూడా రెండో స్థానంతో నాకౌట్ బెర్త్ ఖరారైంది. తొలి మ్యాచ్‌లో పోర్చుగల్‌ను నిలువరించిన డీఆర్ కాంగో జట్టు ఆటగాళ్ల ఈ మ్యాచ్‌లోనూ అద్భుత ఆట ప్రదర్శించారు. తొలి అర్ధభాగం ముగిసేవరకు కొలంబియాకు గోల్ చేసే అవకాశాన్ని ఇవ్వలేదు.

చివరకు 76వ నిమిషంలో గానీ కాంగో డిఫెన్స్‌ను చేధించలేకపోయింది. సహచరుడు ఇచ్చిన పాస్‌ను సర్కిల్‌లో ఉన్న డానిల్ మునోజ్ అందుకుని గోల్‌గా మలిచాడు. ఈ గోల్‌తోనే కొలంబియాకు విజయం దక్కింది. ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ గెలుపొందిన కొలంబియా.. ఆరు పాయింట్లతో గ్రూప్-కే నుంచి నాకౌట్ చేరిన తొలి జట్టుగా నిలిచింది.

# టిజి20లో వరంగల్ ఘనవిజయం



**హైదరాబాద్, జూన్ 24(వార్త క్రీడా ప్రతినిధి):** ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న తెలంగాణ 20 లీగ్‌లో సెంచరీల మోత మోగుతోంది. హర్షిత్ చౌదరనీ(62బంతుల్లో 121 నాటౌట్; 11 ఫోర్లు, 7 సిక్స్‌లు) మెరుపు సెంచరీతో అన్విత ఖమ్మం ఏస్‌పై వరంగల్ వారియర్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 203 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన వరంగల్.. 18.5 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి అందుకుంది. అమన్ రావు వికెట్ తొందరగానే కోల్పోయినా మరో ఎండ్‌లో హర్షిత్ చౌదరీ అదరగొట్టాడు. ఒంటిచేత్తో వరంగల్‌కు గెలుపందించాడు. మిగతా వారిలో సిసోదియా 27 రన్స్ చేశాడు. ఖమ్మం బౌలర్లలో మహేష్, మిలింద్, వేద్ రెడ్డి తలా ఓ వికెట్ తీశారు.

అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన ఖమ్మం ఏస్ 19.2 ఓవర్లలో 202 పరుగులకు ఆలౌటైంది. మయాంక్ గుప్తా (54), మిక్కిల్ జైస్వాల్ (54) హాఫ్ సెంచరీలతో రాణించారు. కచ్చి (17), హిమతేజ (23), వేద్ రెడ్డి (20), మిలింద్ (11), విద్యానంద రెడ్డి (6) పరుగులు చేశారు. వరంగల్ వారియర్స్ బౌలర్లలో అబ్దుల్ మాలిక్ 3, అభిషేక్ 3, పల్లెపాటి 2, హుస్సేన్ ఒక వికెట్ తీశారు.

# పోర్చుగల్‌కు బోణీ కొట్టిన క్రిస్టియానో రొనాల్డో

**హ్యూస్టన్ :** స్టార్ ప్లేయర్ క్రిస్టియానో రొనాల్డో రెండు గోల్స్‌తో మెరిసి సాకర్ ప్రపంచకప్‌లో పోర్చుగల్‌కు గెలుపు బోణీ చేశాడు. కాంగోతో మ్యాచ్ డ్రా చేసిన పోర్చుగల్.. రెండో మ్యాచ్‌లో ఉజ్బెకిస్థాన్‌పై 5-0 గోల్స్‌తో గెలుపొందింది. ఆరో నిమిషంలోనే గోల్ అందించి పోర్చుగల్‌ను ఆధిక్యంలో నిలిపిన క్రిస్టియానో రొనాల్డో మరో గోల్‌ను 39వ నిమిషంలో అందించాడు. ఈ రెండు గోల్స్‌తో ఫిఫా వరల్డ్‌కప్‌లో అరుదైన ఘనత సాధించాడు. 2006 నుంచి ఇప్పటివరకు ఆడిన ఆరు ఫిఫా ప్రపంచకప్‌లలోనూ గోల్స్ చేసిన ఏకైక ప్లేయర్‌గా రొనాల్డో నిలిచాడు. అర్జెంటీనా స్టార్ మెస్సీ కూడా ఆరు వరల్డ్ కప్స్ ఆడినా..2010టోర్నీలో గోల్ చేయలేకపోయాడు. ఈ మ్యాచ్‌లో రెండు గోల్స్ సాధించడం ద్వారా ప్రపంచకప్ చరిత్రలోనే అత్యధిక వయసులో ఒకే మ్యాచ్‌లో రెండు గోల్స్ చేసిన ఆటగాడిగా రొనాల్డో సరికొత్త ప్రపంచ రికార్డును తన పేరిట లిఖించాడు. తనలోని సత్తా ఇంకా తగ్గలేదని ఈ ప్రదర్శనతో ఆయన మరోసారి నిరూపించాడు. ప్రస్తుతం రొనాల్డో వయసు 41 సంవత్సరాల 138 రోజులు. అలాగే, ఉజ్బెకిస్థాన్‌పై చేసిన ఈ రెండు గోల్స్ ద్వారా రొనాల్డో... పోర్చుగల్ తరఫున మరో ఆల్‌టైమ్ రికార్డును సొంతం చేసుకున్నాడు. ప్రపంచకప్ చరిత్రలో పోర్చుగల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచాడు. రొనాల్డో ఇప్పటివరకు ఆడిన 24 ప్రపంచకప్ మ్యాచ్‌ల్లో మొత్తం 10 గోల్స్ సాధించాడు.



# భారీ లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

## ఐటి, ప్రైవేటు బ్యాంకింగ్ రంగాల మద్దతు



**ముంబై, జూన్ 24:** దేశీయ స్టాక్ మార్కెట్లు బుధవారం భారీ లాభాలతో ముగిశాయి. ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్‌మల్హోత్రా వడ్డీ రేట్ల పెంపుచర్చలు ఇప్పుడే అవసరం లేదని చెప్పడం, ముడి చమురు ధరలు బ్యారెల్‌కు 77 డాలర్ల దిగువకు రావడం, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల కొనుగోళ్లు, భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆశావహ సంకేతాలు మార్కెట్ సెంటిమెంట్‌కు బలాన్నిచ్చాయి. ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగాల షేర్లు ప్రధానంగా ర్యాలీకి మద్దతిచ్చాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 790.54 పాయింట్లు పెరిగి 76,991.22 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 197.55 పాయింట్లు లేదా 0.83 శాతం లాభపడి 24,021.65 స్థాయికి చేరుకుంది. దీంతో నిఫ్టీ మళ్లీ 24,000 మార్క్‌ను అధిగమించింది.

నిఫ్టీ పెరుగుదలకు ఐసీఐసీఐ బ్యాంక్ 2.59, ఇన్ఫోసిస్ 2.59, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్2.34శాం పెరిగి మద్దతిచ్చాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్ సూచీ 0.13 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 0.20 శాతం మేర పెరిగాయి. ఎన్‌ఎస్‌ఈలో 1,735 షేర్లు లాభపడగా, 1,566 షేర్లు నష్టాల్లో ముగిశాయి. 95 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. మార్కెట్ అస్థిరతను సూచించే ఇండియా విక్స్ సూచీ 3.99 శాతం తగ్గి 13.39కు చేరుకుంది. భారత్ 10 ఏళ్ల ప్రభుత్వ బాండ్ రాబడి 6.840 శాతం నుంచి 6.805 శాతానికి తగ్గింది. రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలపడింది. బంగారం ఆగస్టు ఫ్యూచర్స్ ధర 1.44 శాతం తగ్గి రూ.1,44,416 వద్దకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 1.38 శాతం తగ్గి 76.02 డాలర్లకు చేరింది.

ఆసియా మార్కెట్లు మిశ్రమ ధోరణిలో ముగిశాయి. టెక్నాలజీ, సెమీకండక్టర్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కొనసాగడంతో పెట్టుబడిదారుల్లో ఆందోళనలు నెలకొన్నాయి. యూరప్ మార్కెట్లు స్వల్ప లాభాల్లో ట్రేడయ్యాయి. అమెరికా మార్కెట్లు నష్టాలతో ముగిశాయి. ఎస్ అండ్ పీ 500 సూచీ 1.44 శాతం, నాస్‌డాక్ 2.21 శాతం పడిపోయాయి. డౌ జోన్స్ సూచీ కూడా స్వల్పంగా బలహీనపడింది. ప్రతి ఏటా 50 వెస్ట్ సైడ్, 200-250 జూడియో స్టోర్లను ప్రారంభించాలని యోచిస్తోంది. ఇదే సమయంలో చైర్మన్ నోయెల్ టాటా పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. టాటామోటార్స్ 3.21 శాతం లాభపడింది.

**ఐఆర్‌ఎఫ్‌సీ:** కేంద్ర ప్రభుత్వం 2 శాతం వాటాను విక్రయించేందుకు ఆఫర్ ఫర్ సేల్ ప్రకటించడంతో షేరు 6.83 శాతం క్షీణించింది. **టాన్‌ఫాక్ ఇండస్ట్రీస్:** క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ ప్లేస్‌మెంట్‌కు బోర్డు ఆమోదం తెలపడంతో షేరు 3.04 శాతం పెరిగింది. **ఇన్ఫోసిస్:** గ్లోబల్‌ఫౌండ్రీస్‌తో బహువార్షిక భాగస్వామ్యాన్ని విస్తరించినట్లు ప్రకటించడంతో షేరు 2.59 శాతం ఎగిసింది. హిందుస్తాన్ ఏరోనాటిక్స్ నుంచి రూ.1,347.71 కోట్ల ఆర్డర్లు పొందినట్లు ప్రకటించినప్పటికీ షేరు స్వల్పంగా 0.58 శాతం తగ్గింది. మొత్తంగా, వడ్డీ రేట్ల పెంపుపై భయాలు తగ్గడం, చమురు ధరల పతనం, విదేశీ పెట్టుబడుల ప్రవాహం కారణంగా దేశీయ ఈక్విటీ మార్కెట్లు బలంగా కోలుకుని పెట్టుబడిదారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయి.

# అదానీ గ్రూప్‌లో 'త్రిసూత్ర' ప్రణాళిక!

## ఎజిఎంలో గౌతమ్ అదానీ వెల్లడి




**ముంబయి, జూన్ 24:** దేశ నిర్మాణానికి దోహదపడే మౌలిక సదుపాయాలను నిర్మించడం, సమాజంలోని ప్రతి స్థాయిలో మానవ గౌరవాన్ని కాపాడే సంస్థలను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. కంపెనీ 34వ వార్షిక సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన ఆయన, వచ్చే దశాబ్ద కాలంలో సంస్థ విజన్‌ను అమలు చేసేందుకు మూడు కీలకమైన పునాది సూత్రాలను ఆవిష్కరించారు.

భవిష్యత్తులో మరింత ప్రతిష్ఠ, క్రమశిక్షణ, కార్యదక్షత అవసరమని అదాని పేర్కొన్నారు. పని విధానాన్ని సరళతరం చేస్తున్నామని, అధికార యంత్రాంగాన్ని తగ్గించి, జవాబుదారీతనాన్ని పదును పెట్టడానికి, నిర్ణయాలను అమలుకు మరింత చేరువ చేయడానికి మా ప్రధాన కార్యాలయాలు, సైట్‌లలో మూడుస్థాయిల నిర్మాణాన్ని అమలు చేస్తున్నామని, సంస్థలో ప్రతి పాత్ర, ప్రతి ప్రక్రియ విలువను జోడించేలా ఉండాలి. ప్రధానం కాని కార్యకలాపాలను మా గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్లకు లేదా నామినేటెడ్ భాగస్వాములకు బదిలీ చేస్తామఆయన వివరించారు.

కాంట్రాక్టర్లతో తమ పని విధానాన్ని మార్చుకుంటున్నట్లు అదానీ వెల్లడించారు. వారిని దేశ నిర్మాణంలో దీర్ఘకాలిక భాగస్వాములుగా చూస్తామన్నారు. వారి వృద్ధికి మద్దతునిచ్చే, వారి లాభా లను కాపాడే, మా ఆసక్తులతో వారి ఆసక్తులను ఏకీకృతం చేసే లోతైన, స్థిరమైన భాగస్వామ్యాలను నిర్మిస్తామన్నారు. ఇది ప్రా కార్మికుల ఆత్మగౌర వానికి తమసంస్థల్లో పెద్దపీట వేస్తున్నట్లు అదానీ నొక్కి చెప్పారు. మా సొంత, కాంట్రాక్టర్ల సిబ్బంది కలిపి దాదాపు నాలుగు లక్షల మంది ఉన్నారు. వీరిలో 85 శాతం మంది మా సైట్లలో క్షేత్రస్థాయిలో పనిచేసేవారే. మా ప్రణాళికలను వాస్తవరూపంలోకి తెచ్చేది వారే. ప్రతి కార్మికుడికి గౌరవం లభించేలా మేము కట్టుబడి ఉన్నాం. పరిశుభ్రమైన జీవన పరిస్థితులు, పరిశుభ్రమైన ఆహారం, వైద్య సహాయం, సురక్షితమైన పని వాతావరణం, సమయానికి సరైన వేతనాలు చెల్లించడం ఇందులో భాగం" అని ఆయన పేర్కొన్నారు.

సంస్థ వృద్ధితో పాటు అదానీ ఫౌండేషన్ కార్యకలాపాలు కూడా తమ లక్ష్యాలకు కేంద్రంగా ఉన్నాయని గౌతమ్ అదానీ తెలిపారు. డాక్టర్ ప్రీతి అదానీ సమర్థ నాయకత్వంలో ఫౌండేషన్ 30వ సంవత్సరంలోకి అడుగు పెడుతోందని, ప్రస్తుతం 22 రాష్ట్రాల్లోని 7,000 గ్రామాల్లో దాదాపు కోటి మందికి సేవలు అందిస్తోందని చెప్పారు.

అహ్మదాబాద్, ముంబైలలో 1000 పడకల మల్టీస్పెషాలిటీ ఆసుపత్రులు, వైద్య కళాశాలలతో కూడిన అదానీ హెల్త్ సిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇక నైపుణ్యాభివృద్ధిలో భాగంగా గ్రామీణ భారతదేశంలో 1.25 లక్షల మంది యువతకు శిక్షణ ఇస్తున్నట్లు, గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో కర్మ ఉత్సవ్ తో స్థానిక ఉపాధిని ప్రోత్సహిస్తున్నట్లు గౌతమ్ అదానీ వివరించారు.

## బ్యాంక్ ఆఫ్ ఇండియా కేసులో లండన్ కోర్టు తీర్పు

# నీరవ్‌మోడీ 100కోట్లు చెల్లించాల్సిందే



**లండన్, జూన్ 24:** భారత్ నుండి పరారైన ప్రముఖ వజ్రాల వ్యాపారి నీరవ్ మోడీకి లండన్ హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా దాఖలు చేసిన కేసులో నీరవ్ మోడీ తన కంపెనీ రుణం కోసం ఇచ్చిన వ్యక్తిగత గ్యారెంటీ కింద 10.7 మిలియన్ డాలర్ల సుమారు రూ.100 కోట్లు కంటే ఎక్కువ మొత్తాన్ని చెల్లించాల్సిందేనని కోర్టు తీర్పునిచ్చింది. లండన్ సర్క్యూట్ కమర్షియల్ కోర్ట్ జడ్జి జస్టిస్ సైమన్ టింక్లర్ తన తీర్పులో అసలు మొత్తం 4.1 మిలియన్ డాలర్లతో పాటు దానికి సంబంధించిన వడ్డీని కూడా నీరవ్ మోదీ నుంచి వసూలు చేయాలని ఆదేశించారు. ఈ గ్యారెంటీ చెల్లదని, తనకు సరైన డిమాండ్ నోటీసులు రాలేదని నీరవ్ మోడీ చేసిన వాదనలను కోర్టు పూర్తిగా తోసిపుచ్చింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా జులై 2012లో దుబాయ్ ఆధారిత ఫైర్‌స్టార్ డైమండ్ ఎఫ్‌జెడ్‌ఈ అనే నీరవ్ మోడీకి చెందిన సంస్థకు భారీ రుణాన్ని మంజూరు చేసింది. ఈ రుణ సదుపాయానికి గాను ఆగస్టు 3, 2013న నీరవ్ మోదీ వ్యక్తిగత పూచీకత్తు ఇచ్చారు. అయితే, 2018 ప్రారంభంలో పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో జరిగిన భారీ కుంభకోణం వెలుగులోకి రావడంతో, బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ రుణాన్ని వెనక్కి తీసుకుంది. మార్చి, ఏప్రిల్ 2018తో పాటు అక్టోబర్ 2025లో కూడా బ్యాంకు పంపిన డిమాండ్ నోటీసులను నీరవ్ మోడీ, అతడి కంపెనీ పట్టించుకోలేదు.

పీఎన్‌బీ కుంభకోణం కారణంగా ఫైర్‌స్టార్ గ్రూప్ కార్యకలాపాలు, నీరవ్ మోడీ అప్పులు తీర్చే సామర్థ్యం పూర్తిగా దెబ్బతిన్నాయని, అందువల్ల రుణాన్ని వెనక్కి తీసుకోవడం సమర్థనీయమేనని కోర్టు అభిప్రాయపడింది. భారతదేశంలో దాదాపు రూ. 13వేల కోట్ల పీఎన్‌బీ రుణ మోసానికి పాల్పడిన కేసులో ప్రధాన నిందితుడైన నీరవ్ మోదీ, మార్చి 2019లో అరెస్ట్ అయినప్పటి నుండి యూకే జైల్లోనే శిక్ష అనుభవిస్తున్నారు. మనీలాండరింగ్, మోసం కేసులను ఎదుర్కొనేందుకు వీలుగా తనను భారతదేశానికి అప్పగించాలన్న నిర్ణయంపై ఆయన ఇంకా చట్టపరమైన పోరాటం చేస్తూనే ఉన్నారు.

# భారత సంతతి సిఇఒకు 7789కోట్ల ప్యాకేజి



**వాషింగ్టన్, జూన్ 24:** అమెరికాకు చెందిన రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ వెల్‌టవర్ సీఈఓగా పనిచేస్తున్న శంఖ్ మిత్రా, ప్రపంచంలోనే అత్యధిక పారితోషికం అందుకుంటున్న ఎగ్జిక్యూటివ్ జాబితాలో రెండో స్థానంలో నిలిచారు. ఆయన 821 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.7,789 కోట్లు విలువైన వేతన ప్యాకేజీని అందుకుని చరిత్ర సృష్టించారు. టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ (158.4బిలియన్ డాలర్లు) తర్వాత అత్యధిక వేతనం పొందుతున్న వ్యక్తిగా శంఖ్ మిత్రా రికార్డులకెక్కారు.

శంఖ్ మిత్రా ప్యాకేజీలో 99శాతం స్టాక్ గ్రాంట్ల రూపంలోనే ఉంది. అక్టోబర్‌లో ఆయనకు 789 మిలియన్ డాలర్ల విలువైన స్టాక్స్ కేటాయించారు. ఈ ప్యాకేజీకి కొన్ని కఠినమైన షరతులు ఉన్నాయి. కంపెనీలో ఆయన2031 వరకు కొనసాగితేనే సగం షేర్లను పొందుతారు. మిగిలిన సగం పొందాలంటే, ఐదేళ్ల వ్యవధిలో వెల్‌టవర్ మార్కెట్ విలువ 45శాతం పెరగాలి. అంతేకాకుండా పలు స్టాక్ ఇండెక్స్‌ల కంటే కంపెనీ షేర్ల పనితీరు మెరుగ్గా ఉండాలి. ఆయన నాయకత్వంలో కంపెనీ వృద్ధి సాధిస్తేనే ఈ భారీ మొత్తం ఆయనకు దక్కుతుంది. ఇది ఆయన గత ప్యాకేజీ కంటే 40 శాతం అధికం కావడం గమనార్హం. భారత్‌లోనే పుట్టి పెరిగిన శంఖ్ మిత్రా, జాదవ్ పూర్‌యూనివర్సిటీ నుంచి ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్‌లో బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. ఆ తర్వాత ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి, కొలంబియా బిజినెస్‌స్కూల్‌లో అప్లైడ్ వ్యాల్యూ ఇన్వెస్టింగ్‌లో ఎంబీఏ పట్టా పొందారు.

కెరీర్‌ను ప్రైస్ వాటర్ హౌస్ కూపర్స్‌లో ప్రారంభించి, ఫిడిలిటీ ఇన్వెస్ట్‌మెంట్స్, సిటాడెల్ ఇన్వెస్ట్‌మెంట్, మిలీనియం పార్ట్‌నర్స్ వంటి ప్రముఖ సంస్థల్లో రియల్ ఎస్టేట్ సెక్యూరిటీస్, పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ విభాగాల్లో కీలక పాత్రలు పోషించారు. 2016లో ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా వెల్‌టవర్‌లో చేరి తన ప్రతిభతో ఉన్నత స్థానాలకు ఎదిగారు. చీఫ్‌ఆపరేటింగ్ ఆఫీసర్, చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ ఆఫీసర్‌గా పనిచేసి, 2020 అక్టోబర్‌లో కంపెనీకి సీఈఓగా నియమితులయ్యారు.

# ట్రెంట్ చైర్మన్ పదవికి నోయెల్ టాటా గుడ్‌బై



**ముంబయి, జూన్ 24:** టాటా గ్రూప్‌కు చెందిన రిటైల్ దిగ్గజం ట్రెంట్ చైర్మన్‌గా దాదాపు మూడు దశాబ్దాల పాటు సేవలందించిన ప్రముఖ వ్యాపారవేత్త నోయెల్ టాటా తన పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించారు. కంపెనీ 47వ వార్షిక సర్వసభ్య సమావేశంలో వాటాదారులను ఉద్దేశించి మాట్లాడుతూ, చైర్మన్‌గా ఇదే తన చివరి సమావేశమని ఆయన స్పష్టం చేశారు. టాటా గ్రూప్ గవర్నెన్స్ మార్గదర్శకాల ప్రకారం.. నాన్‌ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ల పదవీ విరమణ వయసు 70 ఏళ్లుగా నిర్దేశించారు. ఈ ఏడాది నవంబర్‌లో నోయెల్ టాటాకు 70ఏళ్లు నిండనున్న నేపథ్యంలో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ రిటైర్మెంట్ ప్రకటనతో టాటా గ్రూప్ రిటైల్ విభాగంలో ఆయన పోషించిన కీలక పాత్రకు ముగింపు పలికినట్లయింది. నోయెల్ టాటా ప్రస్థానం ట్రెంట్ కంపెనీతో విడదీయరానిది. ఆయన తల్లి సిమోన్ టాటా, ల్యాక్మేను విక్రయించిన తర్వాత ట్రెంట్ కంపెనీని స్థాపించారు. 1998లో నోయెల్ టాటా ఈ కంపెనీ బోర్డులో డైరెక్టర్‌గా చేరారు. ఆమరుసటి ఏడాదే, 1999 జూన్‌లో కంపెనీకి తొలి ఎండీగా బాధ్యతలు స్వీకరించి, దేశంలో రిటైల్ వ్యూహాన్ని మార్చేసిన ఘనతను సొంతం చేసుకున్నారు.

# 300 నగరాలకు అమెజాన్‌నౌ విస్తరణ: ఆండీ జెస్సీ

**ముంబయి:** ఈకామర్స్ దిగ్గజం అమెజాన్ క్విక్‌కామర్స్ విభాగంలో ప్రవేశపెట్టిన అమెజాన్‌నౌ సర్వీస్, దేశంలో అత్యంతవేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారంగా నిలిచిందని అమెజాన్ సీఈఓ ఆండీ జెస్సీ వెల్లడించారు. భారత పర్యటనలో ఉన్న ఆండీ జెస్సీ, ముంబైలోని అత్యంత రద్దీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన అమెజాన్ నౌ మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించారు. భారత్‌లో ఉండటం, ముంబైలోని మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ సెంటర్‌ను సందర్శించడం చాలా బాగుంది. ప్రజలకు తక్షణం అవసరమయ్యే కిరాణా సరుకులు, షాంపూలు, బేబీ ప్రొడక్టులు వంటివి ఆర్డర్ చేసిన నిమిషాల్లోనే ప్యాక్ చేసి డెలివరీ చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ మైక్రోఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలను ప్రత్యేకంగా నిత్యావసర వస్తువులను వేగంగా ప్యాక్ చేసి, డెలివరీ చేసేందుకు వీలుగా డిజైన్ చేశారు. ఈ సేవను ఉపయోగించడం ప్రారంభించిన ప్రైమ్ మెంబర్లు, షాపింగ్ ఫ్రీక్వెన్సీని మూడు రెట్లు పెంచారని జెస్సీ గణాంకాలతో వివరించారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No : APTEL / 2004 / 13725, Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14